
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 228

బుధవారం 9-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


విశాఖపట్నంలోని పెదజాలారిపేట గంగమ్మ గుడి వద్ద మంగళవారం సాయంత్రం 5 గంటల 47 నిమిషాలకు కనువిందు చేసిన చంద్రగ్రహణం



మహారాష్ట్రలోకి 'జోడో యాత్ర'

రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్ర మహారాష్ట్రకు చేరుకుంది. నాందేడ్ జిల్లాలో గురుద్వారాను ఆయన సందర్శించారు.

వివరాలు 6లో



15న సంచలన ప్రకటన: ట్రంప్

అమెరికాలో మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభమైన నేపథ్యంలో 15న కీలక ప్రకటన చేస్తానని డోనాల్డ్ ట్రంప్ చెప్పారు.


వివరాలు 6లో



పాపం మీది.. పరిహారమివ్వండి

పర్యావరణాన్ని నాశనం చేసేది సంపన్న దేశాలేనని, తాము బాధితులమని కాప్ సదస్సులో పేద దేశాలు ఘోషిస్తున్నాయి.

వివరాలు 6లో



'నోట్ల రద్దు'పై నేడు విచారణ

పెద్ద నోట్ల రద్దు వ్యవహారాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నేడు విచారణ చేపట్టనుంది.

వివరాలు 6లో

పుస్తకాల పిలుపు

డిసెంబర్ పాఠ్య ప్రణాళికకు అక్టోబర్‌లోనే పుస్తకాలన్నీ సిద్ధం

- ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే 3వ దశకు కూడా ఇప్పుడే..
- 2, 3 దశలకు 1,39,38,034 ఉచిత పుస్తకాలు సిద్ధం
- స్కూళ్లు తెరవగానే 3,45,29,970 పుస్తకాలు ఉచితంగా పంపిణీ
- బై లింగ్యువల్ కారణంగా కొంత మేర పెరిగిన పరిమాణం
- విద్యార్థుల వెన్ను విరిచే చర్యలకు స్వస్తి పలికిన సర్కారు
- మోత బరువు లేకుండా పాఠ్య ప్రణాళికకు అనుగుణంగా తయారీ
- నాడు.. ఆర్నెల్లు గడిచినా పిల్లలకు పుస్తకాలివ్వలేని దుస్థితి.. 2.8 కోట్ల పుస్తకాలను ముద్రించేందుకు గత సర్కారు ఆపసోపాలు
- నేడు.. స్కూళ్లు తెరవటమే తరువాయి.. 6.88 కోట్ల పుస్తకాలు పంపిణీకి సిద్ధం
- ప్రైవేట్ స్కూళ్లకు సైతం ప్రభుత్వమే ఇవ్వడంతో ధరల దోపిడీకి కళ్లెం



సాక్షి, అమరావతి: విద్యారంగంలో కీలక సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం చదువులు సాఫీగా సాగేందుకు పాఠశాలల నుంచి పుస్తకాల దాకా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలను రూ.వేల కోట్లతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడంతోపాటు చరిత్రలో తొలిసారిగా పాఠ్య పుస్తకాలను స్కూళ్ల ప్రారంభానికి ముందే సిద్ధం చేసి విద్యా కానుకతోపాటు అందచేస్తోంది. పాఠ్య ప్రణాళికకు అనుగుణంగా పుస్తకాలను ప్రభుత్వమే ముద్రించి దశలవారీగా అందిస్తూ పిల్లలకు మోత బరువు నుంచి, తల్లిదండ్రులకు ధరల భారం నుంచి భారీ ఊరట కల్పించింది. గత సర్కారు హయాంలో విద్యా సంవత్సరం సగం గడిచినా పుస్తకాలు రాకపోవడం, అందరికీ ఒకేసారి ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి రాగానే పిల్లల చదువులకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ప్రతి అంశాన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. విద్యా కానుక ద్వారా అందించే వస్తువుల నాణ్యత, పాఠ్య ప్రణాళిక, పుస్తకాలను నేరుగా పరిశీలిస్తూ పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ద్విభాషా (బై లింగ్యువల్) పాఠ్య పుస్తకాల కారణంగా కొంత మేర పరిమాణం పెరిగినట్లు గుర్తించడంతో పిల్లలకు మోత బరువు లేకుండా ముద్రించిన పుస్తకాలను రెండు దశల్లో అందించాలని ఆదేశించారు.

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం..

ఈ విద్యాసంవత్సరంలో స్కూళ్లు తెరవగానే మొదటి దశ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన

మిగతా 2వ పేజీలో ▶

విశాఖపట్నంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023 లోగోను క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వాస్తవ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా..

విశాఖలో గ్లోబల్ సమ్మిట్

మార్చి 3, 4 తేదీల్లో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు- 2023

- సమ్మిట్ లోగోను విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్
- గత సర్కారు తరహాలో ఉత్తుత్తి ఒప్పందాలు ఉండవు: మంత్రి అమర్‌నాథ్
- అగ్రి, ఫుడ్ ప్రాసెసింగ్, రక్షణ, ఏరోస్పేస్, మెరైన్, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్, టూరిజం, గ్రీన్ ఎనర్జీ తదితర రంగాలపై దృష్టి
- సదస్సు విజయవంతం అయ్యేలా అంతర్జాతీయంగా రోడ్‌షోలు
- 2024 జనవరి నాటికి రామాయపట్నానికి మొదటి నౌకను తీసుకొస్తాం

సాక్షి, అమరావతి: వాస్తవ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా మార్చి 3, 4 తేదీల్లో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు- 2023ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కోవిడ్ కారణంగా రెండేళ్ల నుంచి ఎటువంటి పెట్టుబడుల సమావేశాలు నిర్వహించలేకపోయామని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నిర్వహిస్తున్న తొలి సదస్సు విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 వివరాలను తెలియజేయడానికి మంగళవారం ఆయన సచివాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జరిగిన పెట్టుబడుల సదస్సుకు భిన్నంగా దీనిని నిర్వహిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో రూ.16 లక్షల కోట్లకు పైగా

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఆమే కీలకం



ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయ చైతన్యం ఇష్టపడే మహిళలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ ఒకటి. అందుకే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మహిళా ఓటర్లను ఆకట్టుకునే వ్యూహాలను అమలు చేస్తున్నాయి.

వివరాలు 6లో ▸

రేపు మరో అల్పపీడనం!



నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న భూమధ్య రేఖా ప్రాంతంలోని హిందూ మహాసముద్రంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. దీని ప్రభావంతో గురువారం నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని ఐఎండీ తెలిపింది.

వివరాలు 2లో ▸

సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



కంటైనర్ నుంచి భారీఎత్తున సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు దొంగిలించిన కేసులో ఇద్దరిని కడప పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.1,58,14,789 విలువైన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సామగ్రిని రికవరీ చేశారు.

వివరాలు 3లో ▸

ఐఏఎస్ శ్రీలక్ష్మికి క్లీన్‌చిట్



ఓఎంసీ కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి, ఏపీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టు భారీ ఊరట కల్పించింది. సీబీఐ చేసిన అభియోగాలను కొట్టివేస్తూ ఆమెకు క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈమేరకు హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 10లో ▸

'పెండింగ్'పై 23న భేటీ

ఏపీపై కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ కార్యదర్శి నేతృత్వంలో సమీక్ష

- వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర, రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం
- అజెండాలో రెవెన్యూ లోటు భర్తీ సహా ప్రత్యేక హోదా అంశం
- విశాఖలో మెట్రో రైలు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఏర్పాటు తదితరాలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వివిధ మంత్రిత్వ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారానికి ఏర్పాటైన కేంద్ర, రాష్ట్ర సమన్వయ కమిటీ ఈ నెల 23వ తేదీన సమావేశమై సమీక్ష నిర్వహించనుంది. కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ (సమన్వయ) కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ డైరెక్టర్ ఎం.చక్రవర్తి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం పంపారు. ఈ–సమీక్ష పోర్టల్‌లో పొందుపరిచిన ఏపీకి చెందిన అంశాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ లోటు, హోదా..

సమన్వయ కమిటీ వద్ద పెండింగ్‌లో ఉన్న 34 అంశాలతో పాటు వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల వద్ద అపరిష్కృతంగా ఉన్న 15 అంశాలను సమీక్ష అజెండాలో చేర్చారు. రాజధానిలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ఆర్థిక సాయం అందించడంతో పాటు రాష్ట్ర విభజన జరిగిన ఏడాది

మిగతా 2వ పేజీలో ▶



16న పీపీఏ సర్వసభ్య సమావేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 16న హైదరాబాద్‌లో జరగనుంది. సమావేశంలో ఈ సీజన్‌లో చేపట్టాల్సిన పనులు, సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్..ఆ మేరకు నిధుల మంజూరుపై చర్చించనున్నారు. పీపీఏ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని 4 నెలల క్రితం పీపీఏ సీఈవోకు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ లేఖ రాశారు. పీపీఏ నుంచి స్పందన లేకపోవడంతో ఇటీవల అదే అంశాన్ని గుర్తు చేస్తూ మరో లేఖ రాశారు. దీనిపై స్పందించిన పీపీఏ సీఈవో చంద్రశేఖర్ అయ్యర్ 16న సమావేశాన్ని నిర్వహిస్తామని ఏపీకి సమాచారమిచ్చారు. కాగా, ఏడాది క్రితం పీపీఏ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.



వచ్చేవారం నింగిలోకి తొలి ప్రైవేట్ రాకెట్

- దేశంలో ప్రైవేట్ రంగంలో అభివృద్ధి చేసిన మొట్టమొదటి రాకెట్ 'విక్రమ్–ఎస్' ప్రయోగాన్ని వచ్చేవారం చేపట్టబోతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈ నెల 12–16 తేదీల మధ్య ఈ ప్రైవేట్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మొత్తం ప్రయోగానికి 'ప్రారంభ్ మిషన్' అని నామకరణం చేశారు.

- వివరాలు 6లో ▸

జి-20కి నాయకత్వం.. భారత్‌కు గర్వకారణం

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

- వివరాలు 6లో ▸

రబీకి 5 లక్షల లీటర్ల నానో యూరియా నిల్వలు

- 2021–22 సీజన్‌లో 2.90 లక్షల లీటర్ల అమ్మకాలు
- గడిచిన ఖరీఫ్‌లో 1.25 లక్షల లీటర్ల విక్రయం
- ఆర్బీకేల ద్వారా కనీసం 25 శాతం అమ్మకాలకు ఏర్పాట్లు

2లో



ఎల్‌కే అద్వాణీ @ 95



బీజేపీ కురువృద్ధ నేత లాల్ కృష్ణ అద్వాణీ మంగళవారం 95వ పుట్టిన రోజు జరుపుకొన్నారు. ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

- వివరాలు 6లో ▸



..బుక్ రాకుండా మళ్లీ స్టే తెచ్చుకుంటాడేమో!

గైర్హాజరులోని వైద్యులకు మెమోలు

- వారిపై కఠిన చర్యలకు రంగం సిద్ధం
- విధుల నుంచి తొలగించే యోచనలో ప్రభుత్వం



సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో నెలలతరబడి అనధికారికంగా గైర్హాజరులో ఉన్న వైద్యుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది కొరతకు తావులేకుండా సీఎం వైఎస్ జగన్ సర్కార్ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో 46 వేల వరకు పోస్టులను భర్తీ చేపట్టింది. అయితే కొందరు వైద్యులు కొన్ని నెలల తరబడి విధులకు హాజరవ్వడం లేదు. ఆ స్థానంలో కొత్త వారిని నియమించలేని పరిస్థితులు ఉంటున్నాయి. దీనివల్ల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు నెలకొంటున్నాయి. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో గైర్హాజరులో ఉన్న 112 మంది వైద్యులకు నోటీసులు జారీ చేశారు. వారిలో పలువురు వైద్యులు తిరిగి విధుల్లో చేరగా, మరికొందరు విధుల్లో చేరలేదు. విధుల్లో చేరని 18 మంది వైద్యులకు చార్జ్‌మెమోలు జారీ చేయబోతున్నట్లు సమాచారం. వీరిలో ఎనిమిది మంది కడప రిమ్స్, 10 మంది తిరుపతి రుయాకు చెందిన వైద్యులు ఉన్నట్టు తెలిసింది. ఇదే తరహాలో మిగిలిన ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు చార్జ్‌మెమోలు జారీ చేసి, వారిని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

అవినీతి అధికారులకు ఇక హడలే!

- రెడ్‌హ్యాండెడ్‌గా దొరక్కపోయినా అరెస్టులు
- సరికొత్త వ్యూహంతో చెక్ పెడుతున్న అవినీతి నిరోధక శాఖ
- లంచం తీసుకున్న రెండునెలల తరువాత ఓ కేసులో సీఐ, ఎస్సై అరెస్టు
- ఆకస్మిక తనిఖీల తర్వాత కొన్ని నెలలకు సబ్ రిజిస్ట్రార్ అరెస్టు
- సమగ్ర దర్యాప్తుతో ఆధారాలు సేకరించి అరెస్టుచేస్తున్న ఏసీబీ



సాక్షి, అమరావతి: 'సాధారణంగా లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికితేనే ఏసీబీ అరెస్టు చేస్తుంది. మధ్యవర్తుల ద్వారానో ఇతర మార్గాల్లోనో లంచం తీసుకుంటే ఏం కాదు'.. ఇదీ దశాబ్దాలుగా రాష్ట్రంలో అవినీతి అధికారుల్లో నెలకొన్న ధీమా. దాంతో ఏసీబీకి దొరక్కుండా వారు అవినీతికి పాల్పడుతున్నారు. కానీ, అవినీతిపరుల ఈ ధీమాకు ఏసీబీ చెక్ పెడుతోంది. సరికొత్త పంథాతో అవినీతి అధికారులను హడలెత్తిస్తోంది. మూడో కంటికి తెలీకుండా లంచాలు తీసుకున్నా సరే సమగ్ర దర్యాప్తుతో ఆటకట్టిస్తోంది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా రెడ్‌హ్యాండెడ్‌గా దొరకనప్పటికీ.. సమగ్ర దర్యాప్తుతో ఆధారాలు సేకరించి అక్రమార్కులను ఏసీబీ అరెస్టుచేస్తోంది.

బురిడీ కొట్టిస్తున్న అవినీతి అధికారులు

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ని ఏర్పాటుచేసినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రధానంగా మూడు కేటగిరీల ఆధారంగానే విధులు నిర్వహిస్తోంది. ఎవరైనా లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికితే అరెస్టుచేసి కేసు నమోదు చేస్తోంది.. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు ఆధారాలు లభిస్తే కేసు నమోదు చేస్తుంది.. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అనధికారిక డబ్బులు దొరికినా.. ఇతరత్రా నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆధారాలు లభించినా కేసు నమోదు చేస్తుంది. కానీ, ఈ మూడు విధానాల నుంచీ అవినీతి అధికారులు చాకచక్యంగా తప్పించుకుంటున్నారు. తాము నేరుగా కాకుండా మధ్యవర్తుల ద్వారా లంచాలు తీసుకుంటున్నారు. ప్రధానంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, చెక్‌పోస్టులు, రెవెన్యూ తదితర కార్యాలయాల్లో ఇదే విధానం కొనసాగిస్తున్నారు. ఆదాయనికి మించి ఉన్న ఆస్తుల కేసుల్లో కూడా తమ ఆస్తులకు కాకి లెక్కలు చెబుతున్నారు. ఇక ఆకస్మిక తనిఖీల్లో డబ్బులు లభించినా అవి ఎవరివో అన్నది చెప్పలేరు. కాబట్టి ఏసీబీ అధికారులు తాము చేసిన తనిఖీలపై

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా

రాష్ట్రంలో పెట్టుబడులపై తైవాన్ ఆసక్తి

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి తైవాన్ ఆసక్తిని వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే యాపిల్‌ఫోన్స్‌ను తయారు చేస్తున్న తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్, ఫాక్స్‌లింక్ వంటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టగా.. మరిన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయి. దేశ పర్యటనలో ఉన్న 23 మంది తైవాన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (టీమా) బృందంతో ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీ (అపిటా) సభ్యులు చెన్నైలో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ సబ్సిడీ, నీటి లభ్యత, భూమి ధరలు వంటి అంశాలపై వారు ఆసక్తిని వ్యక్తం చేసినట్లు ఐటీ, ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. వర్చువల్‌గా వారితో సమావేశమైన గౌర్ ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల తయారీకి రాష్ట్రం హబ్‌గా తయారయ్యిందని, ఈ రంగానికి అవసరమైన మానవ వనరులను కూడా నైపుణ్య శిక్షణ ఇచ్చి అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా తైవాన్‌ను కోరారు.

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం!

సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న భూమధ్య రేఖా ప్రాంతంలోని హిందూ మహాసముద్రంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. దీని ప్రభావంతో గురువారం నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం రాత్రి నివేదికలో తెలిపింది. అనంతరం ఈ అల్పపీడనం 11వ తేదీ వరకు వాయవ్య దిశగా తమిళనాడు, పుదుచ్చేరి తీరం వైపు కదులుతుందని పేర్కొంది. అల్పపీడనం ప్రభావంతో ఈనెల 11, 12 తేదీల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. అల్పపీడనం కారణంగా కోస్తా తీరం వెంబడి గంటకు 45–55, గరిష్ఠంగా 65 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఫలితంగా సముద్రం అలజడిగా మారుతుందని తెలిపింది. అందువల్ల మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని సూచించింది.

మీరూ ప్రారంభించండి 'స్పోర్ట్స్ క్లబ్'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని క్రీడాకారులంతా 'జగనన్న స్పోర్ట్స్ క్లబ్స్'లో నమోదు చేసుకునేలా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటివరకు 40కి పైగా క్రీడాంశాల్లో 4,793 క్లబ్స్ నమోదవగా.. చాలామంది అవగాహన లోపంతో ఈ ప్రక్రియలో వెనుకబడుతున్నట్టు గుర్తించింది. యాప్ ఆధారంగా ప్రతి గ్రామంలో స్పోర్ట్స్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసుకునేలా.. ఆయా క్లబ్‌లలో సభ్యులుగా చేరేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల అధికారులు, చీఫ్ కోచ్‌ల ఆధ్వర్యంలో జగనన్న స్పోర్ట్స్ క్లబ్స్ రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఇప్పటికే ఎంపీడీవోలు, సచివాలయాల్లోని ఉద్యోగులకు గ్రామాల్లో క్లబ్స్ రిజిస్ట్రేషన్లను ప్రోత్సహించేలా చేపట్టాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్సుల ద్వారా వివరిస్తున్నారు. పీడీలు, పీఈటీల భాగస్వామ్యంతో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సైతం స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. ఒక గ్రామంలో ఒక క్రీడలో ఎన్ని క్లబ్స్‌నైనా ఏర్పాటు చేసుకునేలా వెసులుబాటు కల్పించారు.

పోలవరం పూర్తయ్యేలోగా పిల్లకాలువలు రెడీ

సాక్షి, అమరావతి: పోలవరం జలాశయం పనులు పూర్తయ్యేలోగా ఆయకట్టుకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీ (పిల్ల కాలువ)లను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. కుడికాలువ కింద 3.2 లక్షల ఎకరాలు, ఎడమకాలువ కింద 4 లక్షల ఎకరాలు.. మొత్తం 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించే పిల్లకాలువల పనుల డీపీఆర్‌ను ఈనెల 25లోగా సిద్ధం చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించింది. డీపీఆర్ ఆధారంగా పిల్లకాలువల పనులకు టెండర్లు పిలిచి.. కాంట్రాక్టర్లకు అప్పగించి వేగంగా పూర్తిచేయాలని నిర్ణయించింది. టీడీపీ సర్కార్ తప్పిదాల వల్ల అస్తవ్యస్తంగా మారిన పోలవరం జలాశయం పనులను ప్రభుత్వం గాడిలోపెట్టి ప్రణాళికాయుతంగా పూర్తిచేసే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. జలాశయంతో ఎడమ, కుడి కాలువలను అనుసంధానం చేసే సొరంగాలు, హెడ్ రెగ్యులేటర్ల పనులను వేగవంతం చేసింది. కుడికాలువను దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలోనే పూర్తిచేశారు. ఎడమకాలువ తవ్వకం పనులు 91 శాతం, లైనింగ్ పనులు 71 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులను వేగవంతం చేశారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం కింద పోలవరం కుడికాలువలో అంతర్భాగమైన 1.57 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా పిల్లకాలువలను ఇప్పటికే తవ్వారు. ఎడమకాలువలో అంతర్భాగమైన 1.41 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా పుష్కర ఎత్తిపోతల కింద పిల్లకాలువలను ఇప్పటికే అభివృద్ధి చేశారు. పోలవరం జలాశయం పనులు పూర్తయిన తర్వాత తొలిదశలో గ్రావిటీపై కుడికాలువ కింద 1.57 లక్షల ఎకరాలు, ఎడమకాలువ కింద 1.41 లక్షల ఎకరాలు వెరసి 2.98 లక్షల ఎకరాలకు నీళ్లందించనున్నారు. 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా పిల్లకాలువలను తవ్వడానికి డీపీఆర్‌లో ఈ అంశాన్ని చేర్చారు.

ఎస్‌ఐఎఫ్‌టీ ఆక్వా ల్యాబ్‌కు అంతర్జాతీయ గుర్తింపు

- 14 దేశాలతో పోటీపడి రింగ్ టెస్ట్‌లో విజయం
- పరీక్షల నిర్వహణ, వ్యాధికారకాల గుర్తింపులో ప్రతిభ
- ఇప్పటికే ఐఎస్‌ఓ, ఎన్‌ఏబీఎల్ గుర్తింపు పొందిన ల్యాబ్
- తాజాగా అమెరికాలోని అరిజోనా యూనివర్సిటీ గుర్తింపు



అంతర్జాతీయ గుర్తింపు పొందిన రాష్ట్ర ఆక్వా ల్యాబ్

సాక్షి, అమరావతి : రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ (స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఎస్‌ఐఎఫ్‌టీ) కాకినాడ)కు మరో అరుదైన గౌరవం దక్కింది. ఎస్‌ఐఎఫ్‌టీలోని ఆక్వా లేబొరేటరీకి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆక్వా ల్యాబ్‌ల నైపుణ్యతను పరీక్షించేందుకు అమెరికాకు చెందిన అరిజోనా యూనివర్సిటీ నిర్వహించే రింగ్ టెస్ట్‌లో ఎస్‌ఐఎఫ్‌టీ అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. ఇందులో 14 దేశాలకు చెందిన 29 ఆక్వా ల్యాబ్‌లతో పాటు భారత్ తరపున ఎస్‌ఐఎఫ్‌టీ ఆక్వా ల్యాబ్ పాల్గొంది. రొయ్యలలో తెల్లమచ్చల వ్యాధి, ఎంట్రోసైటోజూన్ హైపాటోపెనై (ఈహెచ్‌పీ) వ్యాధి కారకాలను నిర్ణీత కాలవ్యవధిలో అత్యంత సమర్థవంతంగా పరీక్షించి గుర్తించగలగడంతో ఎస్‌ఐఎఫ్‌టీలోని ఆక్వా ల్యాబ్ విజయం సాధించింది. ల్యాబ్, పరీక్షల నిర్వహణ, వ్యాధి కారకాల గుర్తింపులో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తున్న ల్యాబ్‌గా ఎస్‌ఐఎఫ్‌టీ ల్యాబ్‌ను అరిజోనా యూనివర్సిటీ గుర్తించింది.

అంతర్జాతీయ ప్రమాణాలతో 61 పరీక్షలు

2001లో కాకినాడ ఎస్‌ఐఎఫ్‌టీలో ఏర్పాటైన రియల్ టైం పాలీమరేస్ చైన్ రియాక్షన్ (ఆర్‌టీపీసీఆర్) ఆక్వా ల్యాబ్‌కు 2017లో ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ రాగా, గతేడాది బోర్డ్ ఆఫ్ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనిచేసే నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు లిమిటెడ్ (ఎన్‌ఏబీఎల్) గుర్తింపు కూడా లభించింది. ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో 61 రకాల పరీక్షలు చేస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా కల్చర్ యాక్ట్ (అప్సడా) నియమావళి ప్రకారం వివిధ రకాల మేతలు, సీడ్ నాణ్యతలను పరీక్షించి ధృవీకరించేందుకు ఎస్‌ఐఎఫ్‌టీ ఆక్వాకల్చర్ ల్యాబ్ రాష్ట్ర రిఫరల్ ల్యాబ్‌గా పనిచేస్తోంది. అలాగే, నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులు సాధించడమే లక్ష్యంగా రూ.50.30 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ఎనిమిది ఆక్వా ల్యాబ్స్‌ను ఆధునీకరించడంతోపాటు కొత్తగా 27 ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్స్‌ను ఏర్పాటుచేస్తోంది. 35 ల్యాబ్‌లలో స్థానిక అవసరాలను బట్టి 14 చోట్ల మేతల నాణ్యత విశ్లేషణ, 17 చోట్ల పీసీఆర్, 14 చోట్ల క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లుచేశారు.

> **ఆక్వా రైతులు వినియోగించుకోవాలి**
>
> ఎన్‌ఏబీఎల్ గుర్తింపు పొందిన ఎస్‌ఐఎఫ్‌టీ ఆక్వా ల్యాబ్‌ను అరిజోనా యూనివర్సిటీ కూడా గుర్తించడం ద్వారా మన ల్యాబ్ అంతర్జాతీయ ప్రమాణాలు కల్గిన ల్యాబ్‌గా ఖ్యాతిని గడించింది. ఆక్వా రైతులు, హేచరీలు ఈ ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకుని సుస్థిర సాగుతో పాటు అధిక దిగుబడులు సాధించేందుకు కృషిచేయాలి.
> – పి.కోటేశ్వరరావు, ప్రిన్సిపల్, ఎస్‌ఐఎఫ్‌టీ

రబీకి 5 లక్షల లీటర్ల నానో యూరియా నిల్వలు



సాక్షి, అమరావతి: పర్యావరణ హితమైన నానో యూరియా వినియోగం పట్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. సంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా భారత రైతుల ఎరువుల సహకార సంస్థ (ఇఫ్కో) నానో టెక్నాలజీ ద్వారా ద్రవరూపంలో ఈ నానో యూరియాను మార్కెట్‌లోకి తెచ్చింది. 500 మిల్లీలీటర్ల సీసాలో ఉండే నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాకు సమానం. బస్తా యూరియా మార్కెట్‌లో రూ.266.50 ఉండగా, నానో యూరియా సీసా రూ.240కే అందుబాటులోకి తెచ్చారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రయోగాత్మకంగా ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో అమ్మకాలకు శ్రీకారం చుట్టగా, 20 వేల మంది రైతులు 34,128 సీసాల (17 వేల లీటర్ల) యూరియాను కొనుగోలు చేశారు. ఆ తర్వాత రబీలో లక్షమందికి పైగా రైతులు 5,46,012 సీసాలు (2.73 లక్షల లీటర్లు) కొనుగోలు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2 లక్షల లీటర్లు (4 లక్షల సీసాలు) అందుబాటులో ఉంచగా 1.25 లక్షల లీటర్లు (2.50 లక్షల సీసాలు) అమ్ముడయ్యాయి. సకాలంలో వర్షాలు పడడం, పూర్తిస్థాయిలో సాగునీరు అందుబాటులో ఉండడం, తెగుళ్ల ఉద్ధృతి తక్కువగా ఉండడం, రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో యూరియా నిల్వలను డిమాండ్‌కు తగినట్టుగా అందుబాటులో ఉంచడం వంటి కారణాల వల్ల ఆశించిన స్థాయిలో నానో యూరియా అమ్మకాలు జరగలేదని అంచనా వేస్తున్నారు. ఎరువుల వినియోగం ఎక్కువగా ఉండే ప్రస్తుత రబీ సీజన్‌లో కనీసం 5 లక్షల లీటర్ల (10 లక్షల సీసాల) నానో యూరియాను అందుబాటులో ఉంచారు. డిమాండ్‌ను బట్టి వీటిలో కనీసం 25 శాతానికి తక్కువ కాకుండా ఆర్బీకేల ద్వారా విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నానో యూరియా వినియోగంపై ఆర్బీకేల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లతో పాటు పంటల వారీగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. నానో యూరియా మాదిరిగానే నానో డీఏపీ, జింక్, కాపర్ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ట్రయల్‌రన్‌లో ఉన్న ఈ ఉత్పత్తులను ఖరీఫ్–2023 సీజన్ నుంచి మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

> **సమృద్ధిగా నానో యూరియా నిల్వలు**
>
> నానో యూరియా వినియోగంపై రైతుల్లో చైతన్యం పెరుగుతోంది. గతేడాది ఖరీఫ్‌లో 17 వేల లీటర్ల విక్రయాలు జరగగా, ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏకంగా 1.25 లక్షల లీటర్ల విక్రయాలు జరిగాయి. రైతుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత రబీ సీజన్ కోసం 5 లక్షల లీటర్ల నానో యూరియా బాటిల్స్‌ను అందుబాటులో ఉంచాం. ఇంకా అవసరమైతే పెంచేందుకు ఇఫ్కో సిద్ధంగా ఉంది. – టి.శ్రీధర్‌రెడ్డి, స్టేట్ మార్కెటింగ్ మేనేజర్, ఇఫ్కో

విశాఖలో గ్లోబల్ సమ్మిట్

▶ మొదటి పేజీ తరువాయి



పెట్టుబడులు వచ్చినట్లు ప్రచారం చేసుకున్నారని, కానీ వాస్తవ రూపంలోకి వచ్చింది రూ.40,000 కోట్లే అని చెప్పారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ఎటువంటి లక్ష్యాలు లేకుండా, వాస్తవంగా రాష్ట్రంలోకి వచ్చే పెట్టుబడులకు సంబంధించి మాత్రమే ఒప్పందం చేసుకుంటామన్నారు. అంతకుముందు సీఎం క్యాంపు కార్యాలయంలో గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ 2023 లోగోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, మారిటైం బోర్డు సీఈఓ ఎస్ షన్‌మోహన్, ఏపీఎంఎస్ఎంఈ చైర్మన్ వంకా రవీంద్రనాథ్, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, ఏపీటీపీసీ చైర్మన్ కె రవిచంద్రారెడ్డి, పరిశ్రమల శాఖ సలహాదారు ఎల్ శ్రీధర్, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, సీఐఐ ఏపీ చైర్మన్ ఎస్.నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా రోడ్‌షోలు

రాష్ట్రంలో ఉన్న వనరులను వినియోగించుకుంటూ పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించే విధంగా త్వరలో దేశ, విదేశాల్లో రోడ్‌షోలను నిర్వహించనున్నట్లు మంత్రి అమరనాథ్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో విజయవంతంగా పరిశ్రమలు నడుపుతున్న వారు చెబుతున్న అభిప్రాయాలనే బ్రాండింగ్‌గా వినియోగించుకోనున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, రక్షణ, ఏరోస్పేస్, మెరైన్, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాలు, టూరిజం, గ్రీన్ ఎనర్జీ, ఎంఎస్ఎంఈ, ఫుట్‌వేర్, పోర్టు ఆధారిత పరిశ్రమలు వంటి రంగాలపై దృష్టి సారిస్తామన్నారు. ఇజ్రాయెల్, తైవాన్, దక్షిణ కొరియా, అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో రోడ్‌షోలను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అంతర్జాతీయ పెట్టుబడులతో పాటు స్థానిక పెట్టుబడులను ఆకర్షించే విధంగా దేశ వ్యాప్తంగా వివిధ పట్టణాల్లో కూడా రోడ్‌షోలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఇన్వెస్టర్ మీట్‌కు అంతర్జాతీయ ప్రతినిధులను ఆహ్వానించి రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరిస్తామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిలో భాగంగా రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే, భావనపాడు పోర్టులతో పాటు తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 2024 జనవరి నాటికి రామాయపట్నం పోర్టుకు తొలి నౌకను తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలతో పోటీ పడి.. దక్కించుకున్న బల్క్ డ్రగ్ పార్క్ ద్వారా రూ.40,000 కోట్ల పెట్టుబడులు, 25 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందన్నారు. దావోస్ సదస్సులో గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.1.26 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగితే, అప్పుడే అందులో రూ.40,000 కోట్లు వాస్తవ రూపంలోకి వచ్చాయన్నారు.

'పెండింగ్'పై 23న భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ లోటు భర్తీతో సహా ప్రత్యేక హోదా అంశాన్ని కూడా అజెండాలో పొందుపరిచారు. జాతీయ రహదారులు, రైల్వే లైన్లకు సంబంధించి పెండింగ్ అంశాలను అజెండాలో చేర్చారు.

అజెండాలో ముఖ్యాంశాలు ఇవీ...

- విభజన చట్టం 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న మేరకు ఆరు నెలల్లోగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు.
- కొత్త రాజధాని నుంచి హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ముఖ్యమైన నగరాలకు ర్యాపిడ్ రైలుతోపాటు రోడ్డు కనెక్టివిటీ కల్పించడం.
- విభజన చట్టం 13వ షెడ్యూల్ ప్రకారం వైఎస్సార్ జిల్లాలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు.
- 2014–15 ఆర్థిక ఏడాదిలో రెవెన్యూ లోటు భర్తీకి నిధులు అందించడం.
- 2016లో ప్రధాని ప్రకటన మేరకు విశాఖలో జాతీయ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ ఏర్పాటు.
- కొత్త రాజధానిలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం అందించడం.
- పోలవరంలో ఆర్ అండ్ ఆర్‌తో సహా ప్రాజెక్టుకయ్యే పూర్తి వ్యయాన్ని కేంద్రమే భరించడం. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన ఇతర అంశాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు చర్యలు తీసుకోవడం.
- విశాఖలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఏర్పాటు చేయడం.
- విశాఖలో మెట్రో రైలు ఏర్పాటుకు చర్యలు చేపట్టడం.
- వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అందించడం.
- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించడం.
- విభజన చట్టంలో పేర్కొన్న మేరకు పారిశ్రామిక ఆర్థిక ప్రగతికి పన్ను రాయితీలు ఇవ్వడం. హైదరాబాద్‌లో ఉన్న వివిధ శిక్షణ సంస్థలను ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పడం.
- కాకినాడ పోర్టు సమీపంలో ఎలక్ట్రానిక్ (హార్డ్‌వేర్) ఉపకరణాల తయారీ కేంద్రం ఏర్పాటు.

అవినీతి అధికారులకు ఇక హడలే!

▶ మొదటి పేజీ తరువాయి



సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి సరిపెట్టుకునేవి.

ఇక నుంచి ఒక లెక్క..

కానీ, అవినీతి అధికారుల్లో ధీమా.. మితిమీరిన అవినీతికి చెక్ పెడుతూ ఏసీబీ సరికొత్త కార్యాచరణను చేపట్టింది. ప్రధానంగా అవినీతి నిర్మూలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఏసీబీ ప్రవేశపెట్టిన 14400 మొబైల్ యాప్ దోహదపడుతోంది. గతంలో కేవలం 14400 కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారానే బాధితులు ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉండేది. ఇప్పుడు ఈ యాప్ వినూత్న ఫీచర్లతో బాధితులకు అండగా నిలుస్తోంది. అవినీతికి సంబంధించి పత్రాలు, ఆడియో, వీడియో రికార్డింగులు కూడా 14400 యాప్ ద్వారా ఏసీబీ అధికారులకు సమర్పించేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో ఆధారాల సేకరణకు మార్గం సుగమమైంది. బ్యాంకు ఖాతాలు, కాల్ డేటాలు, ఇతరత్రా ఆధారాలతో అవినీతిని నిరూపించే రీతిలో ఆధారాలు సేకరించి సంబంధిత అధికారులను అరెస్టుచేస్తోంది. ఉదా..

లంచం తీసుకున్న రెండునెలల తర్వాత..

కృష్ణాజిల్లా తోట్లవల్లూరుకు చెందిన గడికొయ్య శ్రీనివాసరెడ్డి హత్య కేసులో అదే గ్రామానికి చెందిన ఆళ్ల శ్రీకాంత్‌రెడ్డి, మిథునలను పోలీసులు ఈ ఏడాది జులై 26న అరెస్టుచేశారు. ఈ హత్య కేసులో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల పేర్లు చేర్చకుండా ఉండేందుకు సీఐ ముక్తేశ్వరరావు రూ.15లక్షలు, ఎస్సై అర్జున్ రూ.2లక్షలు లంచం డిమాండ్ చేశారు. శ్రీకాంత్‌రెడ్డి బంధువు జొన్నల నరేంద్రరెడ్డి ద్వారా ఈ వ్యవహారం నడిపారు. శ్రీకాంత్‌రెడ్డి తల్లిదండ్రులు నరేంద్రరెడ్డికి రూ.19.36 లక్షలిచ్చారు. ఆ మొత్తం నుంచి నరేంద్రరెడ్డి సీఐ ముక్తేశ్వరరావుకు రూ.12.50 లక్షలు, ఎస్సై అర్జున్‌కు రూ.1.50 లక్షలు లంచం ఇచ్చారు. పోలీసుల పేరుచెప్పి నరేంద్రరెడ్డి ఎక్కువ మొత్తం తీసుకున్నాడని శ్రీకాంత్‌రెడ్డి బంధువు పుచ్చకాయల శ్రీనివాసరెడ్డికి తెలిసింది. ఆ విషయం ఆయన శ్రీకాంత్‌రెడ్డి తల్లిదండ్రులకు చెప్పారు. దాంతో నరేంద్రరెడ్డి ఆగ్రహించి పుచ్చకాయల శ్రీనివాసరెడ్డిని హత్యచేశారు. ఈ కేసు విచారించిన ఆత్కూరు పోలీసులు నరేంద్రరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించడంతో సీఐ, ఎస్సైల అవినీతి బండారం కూడా బయటపడింది. కానీ.. సీఐ, ఎస్సై లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరకలేదు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణకు ఆదేశించారు. బ్యాంకు లావాదేవీల వ్యవహారాలు, కాల్‌డేటా, ఇతర ఆధారాలను ఏసీబీ అధికారులు సేకరించి బాధితుల వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ, ఎస్సైలను ఏసీబీ అక్టోబర్ 14న అరెస్టుచేసింది.

> **ఆకస్మిక తనిఖీల అనంతరం దర్యాప్తుచేసి మరీ..**
>
> ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆకస్మిక తనిఖీల్లో కర్నూలు కల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మధ్యవర్తుల వద్ద రూ.59,300లు జప్తుచేశారు. కానీ, ఆ డబ్బులు ఎవరివన్నది ఆ రోజు నిరూపించలేకపోయారు. ఏసీబీ మాత్రం సమగ్రంగా విచారించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారంరోజులపాటు జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. సంబంధిత వ్యక్తులను విచారించారు. మధ్యవర్తుల బ్యాంకు ఖాతాలు, సబ్ రిజిస్ట్రార్, ఆయన కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాల లావాదేవీలు అన్నీ పరిశీలించి ఆధారాలు సేకరించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌ను అరెస్టుచేశారు.

> **అవినీతి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ**
>
> 
>
> సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అవినీతి నిర్మూలనకు ఏసీబీ ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. గతంలో అవినీతిపరులైన అధికారులు సాంకేతిక అంశాలను సాకుగా చూపించి తప్పించుకునేవారు. ఈ పరిస్థితిని నిరోధించేందుకు ఏసీబీ ఇటీవల పటిష్టమైన వ్యూహంతో కేసుల దర్యాప్తును ముమ్మరం చేసింది. లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన కేసులే కాదు.. వేరే మార్గాల్లో అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వోద్యోగులను పూర్తి ఆధారాలతో అరెస్టుచేస్తున్నాం. ఇటీవల ప్రవేశపెట్టిన 14400 మొబైల్ సత్ఫలితాలిస్తోంది.
> – కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, డీజీపీ, డీజీ (ఏసీబీ)

పుస్తకాల పిలుపు

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు 2, 3వ దశల పుస్తకాలను సైతం ఇప్పటికే సిద్ధం చేశారు. డిసెంబర్ మొదటి వారం నుంచి 2వ దశ పాఠ్య ప్రణాళిక తరగతులు ప్రారంభం కానుండగా నెల రోజులు ముందుగానే అక్టోబర్ 30 నాటికే విద్యాశాఖ పుస్తకాలను తయారుగా ఉంచడం గమనార్హం. 2, 3 దశల పుస్తకాలను ఒకే షెడ్యూల్‌లో విద్యార్థులకు అందచేసేలా చర్యలు చేపట్టింది. మొదటి దశలో 3,45,29,970 పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందచేశారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి రూపొందించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పుస్తకాలను సిద్ధం చేశారు. రెండు, మూడు దశల కోసం 1,39,38,034 పుస్తకాలను ముద్రించి అక్టోబర్ 15 – 31వ తేదీల మధ్య జిల్లాలకు తరలించారు. నవంబర్ 10 లోపు మండల పాయింట్లకు, అక్కడి నుంచి స్కూళ్లకు చేరవేసి విద్యార్థులకు అందించేలా షెడ్యూల్ ప్రకటించి ఏర్పాట్లు చేపట్టారు.

ప్రైవేట్ స్కూళ్లకు కూడా..

మొదటి దశలో ప్రైవేట్ స్కూళ్లకు 1,39,79,221 పుస్తకాలను విద్యాశాఖ అందించింది. వీటిలో 1,05,82,332 పుస్తకాలను విక్రయించగా 33,96,889 పుస్తకాలు మిగిలి ఉన్నాయి. ఈ పాఠశాలలకు 2, 3 దశల కింద 37,69,423 పాఠ్య పుస్తకాలను విద్యాశాఖ జిల్లా కేంద్రాలలో ఇప్పటికే సిద్ధంగా ఉంచింది.

నాడు నిద్రావస్థ.. నేడు ముందే ముద్రణ

గత సర్కారు హయాంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు అందాలంటే 6 నెలలు వస్తేగానీ ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఇప్పటి మాదిరిగా కాకుండా సబ్జెక్టులవారీగా ఒకటే పుస్తకాన్ని ముద్రించారు. అది కూడా గరిష్ఠంగా 2.8 కోట్ల పుస్తకాలే కావడం గమనార్హం. పోనీ అవైనా స్కూళ్లు తెరవగానే ఇచ్చారా అంటే అదీ లేదు. ఆర్నెల్లు గడిస్తే గానీ పాఠ్య పుస్తకాలు అందేవి కావు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 6.88 కోట్ల పుస్తకాలను ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు శరవేగంగా సమకూరుస్తోంది. గతంతో పోలిస్తే మూడు రెట్ల పుస్తకాలను అదనంగా ముద్రిస్తూ విద్యార్థులకు తరగతుల ప్రారంభానికి ముందే అందేలా చర్యలు తీసుకుంది. అంతేకాకుండా ద్వి భాషా పుస్తకాలు (బై లింగ్యువల్), వర్కు బుక్స్, పాఠ్య పుస్తకాలు ఇలా వేర్వేరు రకాలుగా ముద్రించి ముందుగానే అందించడం విద్యా రంగం పట్ల ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తోంది.

పుస్తకాల పేరుతో పిండేసి..

టీడీపీ హయాంలో ప్రైవేట్‌కు లబ్ధి చేకూరేలా వ్యవహరించడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బయట దుకాణాల్లో పుస్తకాలు కొనుక్కోవాల్సి వచ్చేది. ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీలో తీవ్ర జాప్యం చేస్తూ పిల్లలను గత సర్కారు అవస్థలకు గురి చేసింది. ప్రైవేట్ స్కూళ్లకు ప్రైవేట్ పబ్లిషర్లే పాఠ్య పుస్తకాలను ముద్రిస్తూ ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేశారు. రూ.వందల విలువ చేసే పుస్తకాలను వేల రూపాయలకు విక్రయించారు. నారాయణ, చైతన్య లాంటి కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠ్య పుస్తకాలను ముద్రించి పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను పిండుకున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే ప్రైవేట్ పాఠశాలలకు సైతం పుస్తకాలను ముద్రించి అందచేస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించడం వల్ల తల్లిదండ్రులపై వేల రూపాయల భారం తగ్గింది.

టీడీపీ హయాంలో పుస్తకాల పంపిణీ ఇలా

సంవత్సరం	పుస్తకాల సంఖ్య కోట్లల్లో	పంపిణీ
2015–16	2.85	2015 అక్టోబర్
2016–17	2.61	2016 సెప్టెంబర్
2017–18	2.28	2017 అక్టోబర్
2018–19	2.33	2018 అక్టోబర్

పుస్తకాలను ప్రభుత్వమే ముద్రించడంతో తల్లిదండ్రులకు ఎంత ఊరటంటే?

తరగతి	తెలుగు మీడియం ధర	ఇంగ్లీషు మీడియం ధర	ప్రైవేట్ స్కూళ్లు గతంలో వసూలు చేసిన ధర (రూ.ల్లో)
1	280	326	2,000 - 3,500
2	298	348	2,200 - 3,600
3	443	553	2,300 - 4,000
4	466	578	2,500 - 4,300
5	479	597	2,700 - 4,600
6	326	484	2,900 - 4,600
7	414	638	3,000 - 4,700
8	548	874	3,000 - 4,700
9	555	557	3,200 - 4,900
10	674	683	3,500 - 5,000

ఈ ఏడాది 2, 3 దశల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ ఇలా

ఉమ్మడి జిల్లా	ప్రభుత్వ స్కూళ్లలో	ప్రైవేట్ స్కూళ్లలో
శ్రీకాకుళం	8,62,255	1,29,543
విజయనగరం	6,97,723	69,126
విశాఖపట్నం	11,71,133	2,74,935
తూర్పు గోదావరి	13,95,844	4,27,218
పశ్చిమ గోదావరి	10,55,640	2,16,891
కృష్ణా	9,43,745	3,33,868
గుంటూరు	11,97,284	6,12,170
ప్రకాశం	10,89,635	1,68,640
నెల్లూరు	8,98,436	1,95,496
కడప	8,44,388	2,43,137
కర్నూలు	12,82,361	4,07,095
అనంతపురం	13,24,270	3,70,898
చిత్తూరు	11,75,320	3,20,406
మొత్తం	1,39,38,034	37,69,423

ఏడుగురు ఏఆర్ డీఎస్పీలకు పదోన్నతి

సాక్షి, అమరావతి: ఏఆర్ పోలీసు విభాగానికి చెందిన ఏడుగురు డీఎస్పీలకు అదనపు పోలీస్ సూపరింటెండెంట్లుగా ప్రభుత్వం పదోన్నతినిచ్చి, బదిలీ చేసింది. ఈ మేరకు హోంశాఖ ప్రధాన కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత ప్రదేశం	బదిలీ అయిన ప్రాంతం
ఎస్.ఎల్.ఎన్.రెడ్డి	చిత్తూరు ఏఆర్ డీఎస్పీ	ఏఎస్పీ (ఏఆర్) తిరుపతి
డి.శ్రీనివాసరావు	నెల్లూరు హోంగార్డ్స్ డీఎస్పీ	ఏఎస్పీ (ఏఆర్) తూర్పుగోదావరి
జి.చంద్రబాబు	విశాఖ సిటీ హోంగార్డ్స్ డీఎస్పీ	ఏఎస్పీ (ఏఆర్) నంద్యాల
జి.నాగేశ్వరరావు	డీఎస్పీ సీఎంఎస్‌జీ, ఇంటెలిజెన్స్	ఏఎస్పీ (ఏఆర్) చిత్తూరు
కె.శ్రీనివాసరావు	డీఎస్పీ జెన్‌కో	ఏఎస్పీ(ఏఆర్) ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్
ఎస్ఎస్ఎస్‌వికృష్ణారావు	ఇంటెలిజెన్స్	ఏఎస్పీ(ఏఆర్) కడప
ఎం.ఎం.సోలమన్	వెయిటింగ్	ఏఎస్పీ (ఏఆర్) విజయనగరం

సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

కడప అర్బన్: కంటైనర్ నుంచి భారీఎత్తున సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు దొంగిలించిన కేసులో ఇద్దరిని కడప పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.1,58,14,789 విలువైన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సామగ్రిని రికవరీ చేశారు. రెండు కార్లను సీజ్ చేశారు. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో మంగళవారం ఎస్పీ కె.కె.ఎన్.అన్బురాజన్ వివరాలు తెలిపారు.

డ్రైవర్, సహాయకుడి ముందస్తు ప్రణాళికతోనే చోరీ

అక్టోబర్ 19న సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులతో బ్లూడార్ట్ కంపెనీకి చెందిన ఒక కంటైనర్ (హెచ్‌ఆర్‌వై 3224) హరియాణ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ నుంచి చెన్నైకి బయలుదేరింది. డ్రైవర్ జుబేర్, సహాయకుడు వాసిం సరుకును దొంగిలించాలని ముందే ప్రణాళిక రచించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం గుడిపాడు గ్రామ సమీపంలోని సర్వీస్ రోడ్డు వద్ద నిందితులు కంటైనర్‌ను ఆపి తాళాలు పగులగొట్టి అందులోని రూ.1, 68,58,671 విలువైన మొబైల్ ఫోన్లు, ల్యాప్ టాప్‌లు, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను ఇన్నోవా (హెచ్‌ఆర్ 26 బిజె 4348), ఆడి (హెచ్‌ఆర్ 29 వై 0267) కార్లలోకి మార్చుకున్నారు.కాగా, మంగళవారం కడప నుంచి హైదరాబాద్ వైపు రెండు వాహనాల్లో చోరీసొత్తును తీసుకెళ్తున్న సల్మాన్ మన్సూర్ అహమ్మద్, మహమ్మద్ రెహమాన్ షరీఫ్‌ను అరెస్టు చేశారు.

అది రెండు కుటుంబాల గొడవ

- శ్రీకాకుళం జిల్లా మందస మండలం హరిపురంలో స్థల వివాదం
- టీడీపీ హయాం నుంచీ రగడ.. తాజాగా ఓ వర్గంపై మరో వర్గం వారు మట్టిపోసిన వైనం
- ఈ వ్యవహారాన్ని వైఎస్సార్‌సీపీకి అంటగట్టి టీడీపీ నీచ రాజకీయం



ఎంపీ రామ్మోహన్‌నాయుడుతో నిందితుడు రామారావు

శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని హరిపురంలో రెండు కుటుంబాల మధ్య ఎన్నో ఏళ్ల నుంచి స్థల వివాదం ముదిరి.. సోమవారం (ఈ నెల 7వ తేదీన) ఇద్దరు మహిళలపై గులకరాళ్లతో కూడిన మట్టి పోసే వరకు వెళ్లిన వ్యవహారంలో టీడీపీ రాజకీయ చలి మంటకు సిద్ధమైంది. ఆ గ్రామంలోని రామారావు, ప్రకాశరావు, ఆనందరావులు ట్రాక్టర్లతో వివాద స్థలంలో కంకర మట్టి వేస్తుండగా.. వారి సమీప బంధువులు కొత్ర దాలమ్మ, మజ్జి సావిత్రిలు వెనక వైపునకు వెళ్లి అడ్డుకున్నారు. అదే సమయంలో వీరిద్దరిపై అమాంతం మట్టిని కుమ్మరించేశారు. నడుంలోతు వరకు వారు కూరుకు పోవడంతో పెద్దగా రోదించారు. చుట్టు పక్కల వారు వచ్చి బయటకు లాగారు. దీనిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్ని మంగళవారం అరెస్ట్ చేశారు. కాగా, టీడీపీ హయాంలో 2017, 2019లో బాధిత మహిళలు నిరాహార దీక్షలు చేశారు. అప్పుడు ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో నడుస్తోంది.

ఇలా లింకు పెట్టొచ్చా..

మహిళలపై మట్టిపోసిన ఘటనలో ప్రధాన నిందితుడు కొత్ర రామారావుకు.. టీడీపీ నేత, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావుతో మంచి సంబంధాలున్నాయి. అలాగని వీరంతా ఇతనికి అండగా నిలిచారని చెప్పలేం. అలా అనడం తప్పు కూడా. అయితే ఇది రెండు కుటుంబాల మధ్య వివాదం అనే కనీస అవగాహన లేకుండా చంద్రబాబు, ఆయన పుత్ర రత్నం లోకేశ్‌లు ఈ ఘటనపై వరుస ట్వీట్లతో వైఎస్సార్‌సీపీపై బురద చల్లి, నీచ రాజకీయం చేశారు. పోలీసులు చర్యలు తీసుకున్నప్పటికీ, లేదని దుష్ప్రచారం చేశారు.

- సాక్షి, శ్రీకాకుళం

ఏపీ పథకాలకు కేంద్రంలో మంచి గుర్తింపు

కేంద్ర సామాజికన్యాయం, సాధికారత శాఖ మంత్రి నారాయణస్వామి



కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు జాతీయస్థాయిలో మంచి ఆదరణ లభిస్తోందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి ఎ.నారాయణస్వామి చెప్పారు. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడప కలెక్టరేట్ స్పందన హాలులో మంగళవారం కలెక్టర్ విజయరామరాజు అధ్యక్షతన జరిగిన ఆకాంక్ష జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా నాడు–నేడు కార్యక్రమాల్లో భాగంగా చేపడుతున్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న వైద్యశాలల అభివృద్ధి, పేదలందరికీ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. గత రెండేళ్లు కోవిడ్ వంటి ప్రపంచ విపత్తుతోపాటు వర్షాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను సైతం అధిగమించి వైఎస్సార్ జిల్లా ఆకాంక్ష జిల్లాల లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఈ సమావేశంలో ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, సీఎం రమేష్, ఎస్పీ కె.కె.ఎన్.అన్బురాజన్, జేసీ సాయికాంత్‌వర్మ, కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి.ఎస్.ఎస్.ప్రవీణ్‌చంద్, తదితరులు పాల్గొన్నారు.

జయలక్ష్మీ బ్రాంచ్‌లలో విస్తృత సోదాలు

విచారణలో వేగం పెంచిన సీఐడీ అధికారులు


కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద జయలక్ష్మి మెయిన్ బ్రాంచ్‌లో సోదాలు

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లాలో డిపాజిటర్ల సొమ్మును దారి మళ్లించి నట్టేటముంచిన జయలక్ష్మీ సొసైటీ లిమిటెడ్ గత పాలకవర్గ అవినీతి, అవకతవకలపై సీఐడీ అధికారులు విచారణ వేగవంతం చేశారు. సొసైటీ పాలకవర్గంలోని కీలకమైన గత చైర్మన్, వైస్ చైర్మన్ దంపతులతో పాటు వారి కుమారుడిని ఇప్పటికే జైలుకు పంపిన సీఐడీ అధికారులు..మిగతా వారి కోసం గాలిస్తున్నారు. మరో వైపు జయలక్ష్మీ సొసైటీకి కొత్త పాలకవర్గం అందుబాటులోకి వచ్చింది. కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు తాళాలు తెరవాలని సీఐడీ అధికారులను కోరుతూ మహాజన సభ వేదిక ద్వారా ఈ పాలకవర్గం తీర్మానించింది. కాగా, రాష్ట్రంలోని 29 బ్రాంచ్‌లలో అధికారులు సోదాలకు దిగారు. సోమవారం పిఠాపురం బ్రాంచ్‌లో తనిఖీలు ప్రారంభించిన అధికారులు మంగళవారం అన్ని బ్రాంచ్‌లకు తిరుగుతున్నారు. సర్పవరం వద్ద మెయిన్ కార్యాలయంలో మంగళవారం సీఐడీ అడిషనల్ ఎస్పీ రవివర్మ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు బుచ్చిరాజు, రమణమూర్తి, సిబ్బంది రికార్డులను తనిఖీ చేశారు. బ్రాంచ్ మేనేజరు టి.పద్మావతి, సీఏవో లీలాప్రసాద్‌తో అడిషనల్ ఎస్పీ రవివర్మ మాట్లాడారు.కాగా, ఈ కేసులో అరెస్టయి జైలులో ఉన్న ముగ్గురు నిందితులను తమ కస్టడీలోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.



సంతోషానికి వేరే దారి లేదు.
సంతోషమే దారి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, నవంబర్, 9

'కోటా' తీర్పుతో కొత్త ప్రశ్నలు

ఆధిపత్య కులాల్లోని నిరుపేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 2019లో తీసుకున్న నిర్ణయం సరైందేనని అయిదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సోమవారం వెలువరించిన మెజారిటీ తీర్పు సహజంగానే పలు ప్రశ్నలను రేకెత్తించింది. రాజ్యాంగంలోని 15, 16 అధికరణలకు కొత్త క్లాజులు చేరుస్తూ తీసుకొచ్చిన 103వ సవరణ రాజ్యాంగ బద్ధతపై దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ రవీంద్ర భట్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. తరతరాలుగా సామాజిక అణచివేతకూ, వివక్షకూ గురవుతూ అన్ని విధాలుగా వెనకబడివున్న కులాలకు రిజర్వేషన్లు కల్పించాలని మన రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించగా నిరుపేదలకు కల్పించిన కోటా ఇందుకు విరుద్ధంగా ఆర్థిక వెనకబాటుతనాన్ని ప్రాతిపదికగా తీసుకుంది. సారాంశంలో కోటా కల్పనకు ఒక వర్గాన్నీ, దాని సామాజిక స్థితిగతులనూ కాక వ్యక్తిని పరిగణనలోకి తీసుకుంది. పైగా ఈ కోటానుంచి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పేదలను మినహాయించింది. ఇది సరైందేనని మెజారిటీ తీర్పు అంటుండగా, మైనారిటీ తీర్పు నిరుపేదలకు కోటా కల్పనను సమర్థిస్తూనే దాన్నుంచి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పేదలను మినహాయించటం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించటమేననీ, రాజ్యాంగాన్ని బలహీనపరచటమేననీ స్పష్టం చేసింది. తన ఆధ్వర్యంలోని ధర్మాసనంలో మెజారిటీ తీర్పునిచ్చిన సభ్యుల్లో ప్రధాన న్యాయమూర్తి ఒకరుగా లేకపోవటం చాలా అరుదు. పదవీ విరమణ చేయబోతున్న జస్టిస్ లలిత్ అసమ్మతి తీర్పు వెలువరించిన ఇద్దరిలో ఒకరై ఆ రికార్డు నెలకొల్పారు.

కులంతో సంబంధం లేకుండా నిరుపేద వర్గాలన్నిటికీ అవసరమైన సదుపాయాలు కల్పించటం, ఆ వర్గాల ఎదుగుదలకు దోహదపడటం తప్పేమీ కాదు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు అందుకు అవకాశ మిస్తున్నాయి. కానీ పేద వర్గాలకు కోటా ఇవ్వాలంటే ఆ వర్గాలు పేదరికం కారణంగా సామాజి కంగా ఎటువంటి వివక్షనూ, అణచివేతనూ ఎదుర్కొంటున్నాయన్నది... ఒక వ్యక్తి ఎదుగుదలకు ఆర్థిక అననుకూలత ఎలా అవరోధంగా ఉందన్నది నిగ్గు తేల్చవలసిన అవసరం ఏర్పడుతుంది. దాన్ని గణించటం సాధ్యమా? పైగా నిరుపేద వర్గాలను ఉద్ధరించటం కోసం కోటా ఉద్దేశించామని చెబుతూ అత్యంత నిరుపేద వర్గాలు అధికంగా ఉండే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలను దాన్నుంచి మినహాయించటం సరైందేనా? ఆ వర్గాలు ఇప్పటికే రిజర్వేషన్ల ఫలాలను అనుభవిస్తున్నాయన్న కారణంతో ఇలా మినహాయించటం సరికాదని మైనారిటీ తీర్పునిచ్చిన న్యాయమూర్తులు వ్యక్తం చేసిన అభిప్రాయం సహేతుకమైనదన్న భావన కలగదా? అంతేకాదు... గతంలో మండల్ కమిషన్ కేసులో తొమ్మిదిమంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన మెజారిటీ తీర్పు రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని మించరాదని స్పష్టం చేసింది. దాని ప్రాతిపదికనే రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ఇచ్చే కుల రిజర్వేషన్లను వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టు ఇంతవరకూ కొట్టివేస్తూ వచ్చాయి. కానీ తాజాగా మెజారిటీ సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పు 50 శాతం కోటా పరిమితి మార్చడానికి వీల్లేనిది కాదంటున్నది. ఆ తీర్పు కులప్రాతిపదికన ఇస్తున్న కోటాకే వర్తిస్తుందని భాష్యం చెబుతోంది. ఇది కొత్తగా రిజర్వేషన్లు కోరుకుంటున్న వర్గాలనుంచి తామరతంపరగా డిమాండ్లు పుట్టుకురావటానికి దోహదపడదా? నిజానికి తొలిసారి 1991లో అప్పటి ప్రధాని పీవీ జనరల్ కేటగిరీలోని పేదలకు పదిశాతం కోటా నిర్ణయం తీసుకున్నారు. కానీ సుప్రీంకోర్టు అప్పట్లో ఈ నిర్ణయాన్ని కొట్టేసింది.

ఆర్థిక అసమానతలు పీడిస్తున్నప్పుడు సహజంగానే బాధిత వర్గాలు ప్రభుత్వాల నుంచి ఆసరా కోరుకుంటాయి. దేశంలో ఆర్థిక సంస్కరణల అమలు తర్వాత సాగిన అభివృద్ధికి సమాంతరంగా సంక్షోభం కూడా బయల్దేరింది. చేతివృత్తులపై ఆధారపడి జీవించే అట్టడుగు కులాలతోపాటు వ్యవసాయంపై ఆధారపడే కులాలు సైతం ఒడిదుడుకుల్లో పడ్డాయి. అందుకే రిజర్వేషన్లు పొందుతున్న వర్గాల్లోని అత్యంత వెనకబడిన కులాలు వర్గీకరణ కావాలని ఉద్యమించటం మొదలుపెడితే... మొదటినుంచీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్న వర్గాలు తమకూ వాటిని వర్తింపజేయాలన్న డిమాండ్‌తో ముందుకొచ్చాయి. ఇక క్రీమీ లేయర్ వాదన సరేసరి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, దానిపై తాజాగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు సహజంగానే దళిత, ఓబీసీ వర్గాల్లో కలవరం కలిగించాయి. అందుకే మైనారిటీ తీర్పు వ్యక్తంచేసిన అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని కేంద్రం ఆ వర్గాలకు తగిన భరోసానివ్వాలి. అంతకన్నా ముందు అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మానసపుత్రికలైన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటివి, ప్రస్తుతం ఏపీలో ఇస్తున్నట్టు వివిధ వృత్తులవారికి ఏటా నిర్ణీత మొత్తంలో నగదు అందించే పథకాలవంటివి అమలు చేసే అంశాన్ని పరిశీలించాలి. ఇప్పటికే ఉన్న వాటిని మరింత మెరుగుపరచాలి. ఎటూ ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు కుంచించుకుపోయాయన్నది వాస్తవం. కనుక కోటాలవల్ల ఆచరణలో పెద్దగా ఫలితం ఉండదు. ప్రభుత్వ రంగాన్ని విస్తరిస్తే, తయారీ రంగ పరిశ్రమల స్థాపనకు నడుం బిగిస్తే నిరుద్యోగం నియంత్రణలో ఉంటుంది. పేదరికం అంతరిస్తుంది. కేంద్రం ఈ సంగతి ఆలోచించాలి.

ఫెడరల్ వ్యవస్థకు రోజులు మూడాయా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

కేంద్ర ప్రభుత్వం కత్తినీ, కలాన్నీ సమంగా శత్రువుగా భావిస్తోందా? ఉగ్రవాదులనూ, సమాజాన్ని చైతన్యపరిచే రచయితలనూ ఒకటిగానే చూస్తోందా? అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నవారిని నిర్బంధించడానికి వెనుకాడటం లేదు. ఈ క్రమంలో అధికారం మొత్తాన్నీ తన చేతుల్లోకి తీసుకోవడానికీ వెరవడం లేదు. దీంతో దేశ ఫెడరల్ వ్యవస్థ మనుగడకు రోజులు మూడాయన్న భావన దేశ ప్రజల మనసుల్లో పాదుకుపోతున్నది. దీనికితోడుగా రాజ్యాంగ పరిధుల్ని కాలదన్నుతూ తాజాగా కేరళ, తమిళనాడు గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలను ప్రశ్నించే దశకు దిగజారడాన్ని సుప్రీంకోర్టు గమనిస్తూనే ఉంది. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే, 2024 సంవత్సరానికి ముందే దేశమంతటా రాష్ట్రపతి పాలన విధించే అవకాశాలున్నాయని పలువురు అనుమానిస్తున్నారు.

''దేశంలో శాంతి భద్రతలకు ఏర్పడుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని ప్రభుత్వ శాఖలు, భద్రతా సంస్థలు సిద్ధంగా ఉండాలి. శాంతి, భద్రతలను కాపాడే బాధ్యత రాష్ట్రాలకు ఉన్నదని రాజ్యాంగం నిర్దేశించినా... దేశ సమైక్యతతో ఈ సమస్య ముడిపడి ఉంది కాబట్టే మా ఆవేదనంతా. మనది ఒకే దేశం కాబట్టి దేశవ్యాప్తంగా పోలీసులకు ఒకే రకం యూనిఫామ్ ఉండాలి. దేశ యువకుల ఉద్రేక స్వభావాల్ని ఆసరా చేసుకొని కొందరు తమ కలాల ద్వారా ఉగ్రవాద ప్రచారానికి తోడ్పడుతున్నారు. ఉగ్రవాద కార్యకలాపాల నిరోధానికి రూపొందిన 'ఉపా' చట్టం ప్రభుత్వానికి ఎంతో వెన్నుదన్నుగా ఉపయోగపడుతోంది. అయినా 'ఉపా' చట్టాన్ని, దాని సామంజస్యాన్ని ప్రశ్నించే కొన్ని పిటిషన్లు సుప్రీంకోర్టు పరిశీలనకు వచ్చాయి.''

– అక్టోబర్ 28–29 తేదీల్లో ప్రధాని మోదీ ప్రసంగాల సారాంశం.

''ప్రతీ రాష్ట్రమూ శాంతి భద్రతల రక్షణకు దేశవ్యాప్తంగా ఒకే ఒక విధానం రూపొందించి తీరాలి. ఇది 2024 లోగానే రూపొంది తీరాలి.''

– హోంమంత్రి అమిత్ షా (27 అక్టోబర్ 2022)

దేశ ఫెడరల్ వ్యవస్థ మనుగడకు 'రోజులు మూడాయన్న' భావన క్రమంగా దేశ ప్రజల మనసుల్లో పాదుకుపోతున్నది. ఇటీవలనే పదవీ కాలం ముగిసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రమణతో ప్రారంభమైన కొన్ని అభ్యుదయకర తీర్పుల ఫలితంగా దేశవ్యాప్తంగా ఉన్నత న్యాయస్థానం మీద కొంత విశ్వాసం బలపడింది. అయితే భారతదేశ చైతన్యవంతులైన, పాలక శక్తుల అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న దేశ యువతరంపై దారుణమైన నిర్బంధ విధానానికి బీజేపీ ప్రభుత్వం పాల్పడింది. చివరికి నిలువెల్లా వికలాంగుడైన అభ్యుదయవాది, భావ విప్లవ స్ఫూర్తికి దోహదం చేస్తూ అనేక సంవత్సరాలుగా దేశ పాలక వర్గాల అధికార దుర్వినియోగాన్ని సహిస్తూ వచ్చిన సాయిబాబాను వెంటనే విడుదల చేయాలని ఒక రాష్ట్ర హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినా, దాన్ని రద్దు చేయించడానికి పాలకవర్గం సాహసించి, తిరిగి జైలుకు పంపించింది. అంత బలహీన స్థితికి దేశ బీజేపీ నాయకత్వ పాలనా పద్ధతులు దిగజారిపోయాయని ప్రజలు నిర్ణయానికి వచ్చే అవకాశాన్ని పాలకులు కల్పించకూడదు.

సుప్రసిద్ధ సుప్రీంకోర్టు న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ స్వయంగా తన తండ్రి జస్టిస్ చంద్రచూడ్ ఇచ్చిన తీర్పును కూడా తిరగదోడారు. ఆయన బిడ్డగా ఎదిగివచ్చినా తన తనాన్ని, తన స్వతంత్ర ప్రతిపత్తిని సదా ఈ క్షణం దాకా కాపాడుకుంటూ వచ్చిన ఉద్దండుడు నేటి సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి. తన సొంత తండ్రిగారిచ్చిన తీర్పునే కొట్టి పారేయడానికి రక్త సంబంధం ఏమాత్రం ఆయనకు అడ్డు నిలువక పోవడం అత్యంత ప్రశంసనీయం. ఈ పరిణామం గమనించి ఉన్న బీజేపీ పాలకులు నవంబర్ 9న నూతన ప్రధాన న్యాయమూర్తిగా డి.వై.చంద్రచూడ్ పదవీ స్వీకారం చేయకుండా నిరోధించేందుకు ఎవరి చేతనో ఒక అడ్డుపుల్ల పిటిషన్ వేయించారు. కానీ తాజా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు. లలిత్ ఆ 'కొంటి' పిటిషన్‌ను 'సరుకులేని కాగితం'గా కొట్టి పారవేశారు. ఇలా బీజేపీ హయాంలో ఒకటిగాదు, ఎన్నో పిటిషన్లు!



రెండో మాట

'ది వైర్' లాంటి ప్రముఖ దేశీయ వార్తా సంస్థకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణ జరిపి తీరాలని ఢిల్లీ పోలీసుల్ని దేశ ప్రఖ్యాత 'ఎడిటర్స్ గిల్డ్' పోలీసులను కోరింది. ఇంతకన్నా బీజేపీ పాలకుల అసమర్థ దుర్జనత్వానికి నిదర్శనం మరొకటుంది. 'జాతీయ భద్రతా ప్రయోజనాల' పేరిట ఇతరులు తెరచి చూడటానికి వీలు లేదన్న మిషపైన పాలకులు కొత్తగా 'సీల్డ్ కవర్' ఎత్తుగడలు పాటిస్తూ వచ్చారు. కానీ, ఆ ఎత్తుగడలను బహిర్గతం చేస్తూ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీల సుప్రీం బెంచ్ 'మీడియా వన్ ఛానల్' టెలికాస్ట్‌పై నిషేధాన్ని సవాలు చేస్తూ వచ్చిన పిటిషన్‌ను పక్కకి తోసేసింది. ఎందుకంటే, ఆ ఛానల్‌కు ఎప్పటి నుంచో ఉన్న సెక్యూరిటీ అనుమతిని కూడా అకస్మాత్తుగా పాలకులు రద్దు చేశారు. ఎవరు ఫిర్యాదు చేసినా, అసలు ఫైల్‌లో ఉన్నదేమిటో, బయటికి పొక్కకుండా రహస్యంగా దాచిన విషయం జాతీయ భద్రతకు ఏ విధంగా విఘాతం కల్గిస్తుందో కోర్టు వారికి విధిగా బహిరంగపరచాల్సిందేననీ, 'సీల్డ్ కవర్'ల తతంగం ఇక మీదట కొనసాగరాదనీ కోర్టు తీర్పు చెప్పవలసి వచ్చింది.

ఈ భాగోతం ఇలా ఉండగానే, రాజ్యాంగ పరిధుల్ని కాలదన్నుతూ తాజాగా కేరళ, తమిళనాడు గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాల రాజ్యాంగబద్ధమైన నిర్ణయాలను ప్రశ్నించే దశకు దిగజారడాన్ని సుప్రీం గమనిస్తూనే ఉంది. గతంలో బొమ్మై (కర్ణాటక) ప్రభుత్వ హయాంలో ఆ ప్రభుత్వాన్ని దించేయడానికి జరిగిన ప్రయత్నంలో శాసనసభ చర్చకు, దాని అనుమతికి బద్ధమై మాత్రమే నిర్ణయాలు జరగాలన్న జస్టిస్ జయచంద్రారెడ్డి హెచ్చరికను ఆనాటి ప్రతిపక్షం పాటించక తప్పలేదు. అటు కేరళ బీజేపీ గవర్నర్, ఇటు తమిళనాడు గవర్నర్, మరికొన్ని ఇతర రాష్ట్రాల గవర్నర్లు రాజ్యాంగ బాధ్యతలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవడంపై దేశవ్యాప్తంగా నేడు పెద్ద అలజడి విద్వత్ వర్గాలలో ప్రారంభమైంది. బహుశా 2024వ ఏడాదికి ముందే అర్ధంతరంగా దేశవ్యాప్తంగా రాష్ట్రపతి పాలన వచ్చే అవకాశం ఉందన్న ఊహాగానాలు నిజమే అవుతాయేమో అన్నంతగా ప్రజాబాహుళ్యంలో ఆందోళన ప్రారంభమైంది. ఎందుకంటే – భారత రాజ్యాంగం ప్రకారం, గవర్నర్ పని, ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విధానాలకు బద్ధమై ఉండవలసిందేగానీ, వ్యతిరేకించకూడదు. రాజ్యాంగం తనను అనుమతించిన మేరకే రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలలో 163(2) అధికరణ గవర్నర్ల జోక్యానికి అనుమతిస్తుంది. అంతేగానీ, ప్రజలు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకొన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను ధిక్కరించి 'సొంత దుకాణం' తెరచుకునే అధికారం నామినేటెడ్ గవర్నర్లకు లేదు.

సుప్రసిద్ధ సుప్రీం మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్... షంషేర్ సింగ్ కేసులో చెప్పిన తీర్పులో ఇలా పేర్కొన్నారు: ''శాసనసభ (లెజిస్లేచర్)కు ఆయా శాఖల మంత్రులు జరూరుగా సమాధానాలు చెప్పవలసి ఉంటుంది. వీరు ఆశువుగా చెప్పే పద్ధతికి ప్రజలూ అలవాటు పడ్డారు. ఎవరో ఒకే ఒక నాయకుడి ఆత్మకు దాసోహమని కూర్చోకుండా ప్రజలు ఈ రకపు ప్రజాస్వామ్యానికి కూడా అలవాటుపడ్డారనుకోవాలి. కాకపోతే, భారతదేశపు సంక్లిష్ట రాజకీయ నిర్మాణ సూత్రాలకు ఒదిగి ఉండక తప్పదేమో''! కాబట్టి ఈ పరిస్థితుల్లో కోర్టు రాజ్యాంగ ధర్మాసనం గవర్నర్ల అనవసర జోక్యానికి చోటివ్వకుండా చూడాలని ప్రసిద్ధ సుప్రీంకోర్టు న్యాయవాది కాళేశ్వరం రాజ్ అభిప్రాయం. చివరికి, త్వరలో దేశమంతటా రాష్ట్రపతి పాలన విధించే అవకాశాల గురించి పలువురి అనుమానాలకు తగినట్టుగానే గుజరాత్ విద్యాపీఠ్‌కు 12వ అధ్యక్షుడిగా గుజరాత్ గవర్నర్, బీజేపీ అనుయాయి అయిన దేవవ్రత్‌ను నియమించాలని కేంద్రం నిర్ణయించినట్టు వార్తలు వెలువడ్డాయి. ఈ విద్యాపీఠ్‌ను స్వతంత్ర సంస్థగా 1920లో గాంధీజీ నెలకొల్పారని మరవరాదు. నిజమైన గాంధేయవాది మాత్రమే ఈ విద్యాపీఠ్‌ను అలంకరించాలని నాడు నిర్ణయమయింది. కానీ, ఆ ఆశయానికి విరుద్ధంగా దేవవ్రత్‌ను (రాజకీయ గవర్నర్) నియమించినందుకు నిరసనగా విద్యాపీఠ్ ట్రస్టీల బోర్డునుంచి గత నెల 18న తొమ్మిదిమంది సభ్యులు రాజీనామాలు చేశారు. ఏతావాత మన పాలకులు కూడా కలాన్నీ, కత్తినీ సమపాళ్లలోనే ఒకే బాటలో నిలబెట్టడానికి అంగీకరిస్తున్నందువల్ల గాంధీ విద్యాపీఠ్ నెత్తిపైన కూడా ఈ రెండు రకాల ఆయుధాలను – సమంగా మోపడానికి వెనుదీయలేదన్నమాట!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అగ్రకులాల రిజర్వేషన్



ఆర్థికంగా బలహీన వర్గాలు అనేది తప్పుమాట; అది అగ్ర కులాలకు రిజర్వేషన్. అర్హతగా విధించిన కటాఫ్ ఆదాయం సంవత్సరానికి 8 లక్షలు. అంటే నెలకు 67,000. ఇది చారిత్రకంగా కులం పేరుతో అణచివేతకు గురైన వర్గాల పేదరికాన్ని అపహాస్యం చేయడమే.

– క్లిఫ్టన్ డిరోజారియో, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, కేంద్ర కమిటీ సభ్యుడు

ఏం జరగనుంది?



ఆర్థికంగా బలహీన వర్గాల రిజర్వేషన్‌ను ఏ అభ్యంతరం లేకుండా కాంగ్రెస్ స్వాగతించింది. ఆ ప్రక్రియను డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రారంభించారని కూడా ఆ పార్టీ చెప్పుకొంది. కానీ దాని మిత్ర పక్షాలు సందిగ్ధంలో ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలు, ప్రత్యేకించి మండల్ పార్టీలు ఈ అంశంలో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెడతాయా?

– సుగత శ్రీనివాసరాజు, పాత్రికేయుడు

బీ టీమ్‌లు అనకూడదు



నా ఉద్దేశంలో 'బి టీమ్' సిద్ధాంతాలు సోమరివి. బీఎస్పీ, ఏఐఎంఐఎంలకు కూడా మిగతా పార్టీల్లాగే ఎన్నికల్లో పాల్గొనడానికి పూర్తి హక్కుంది. ఒకవేళ ఆర్జేడీ తన ఓట్లను ఈ పార్టీలకు కోల్పోతున్నదంటే, అది ఆర్జేడీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. బహుళ పార్టీ ప్రజాస్వామ్యంలో ఏ ఒక్క పార్టీకో ఎన్నికల్లో పాల్గొనే పేటెంట్ ఉండదు.

– నకుల్ సింగ్ సహానీ, ఫిలింమేకర్

వామ్మో!



వచ్చే వారానికి భూమండల జనాభా 800 కోట్ల మార్కును చేరనుంది. ఈ వాస్తవాన్ని జీర్ణించుకోవాలి.

– రామి నిరంజన్ దేశాయి, ఆంత్రోపాలజిస్ట్

మంచి చేయకూడదా?




'యాక్టివిస్ట్' బూతుపదం ఎందుకైంది? గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్, అంబేడ్కర్, నెల్సన్ మండేలా... వేలాది యాక్టివిస్టులు ఈ ప్రపంచాన్ని మార్చారు.

– పత్రలేఖా ఛటర్జీ, విజిటింగ్ ఫెలో

అసంబద్ధం, తర్కవిరుద్ధం

స్పందన



ఉల్లి బాలరంగయ్య

'మనము నేర్చుకోవాల్సిన పాఠం' అంటూ అక్టోబర్ 31వ తేదీన కరణ్ థాపర్ వ్యాసంలోని అంశాలు అసంబద్ధంగా, తర్కవిరుద్ధంగా ఉన్నాయి. బ్రిటన్ దేశ ప్రధాన మంత్రిగా హిందూ భక్తుడైన రిషి సునాక్ ఎన్నిక కావడానికీ, బ్రిటన్ నుంచి మనము పాఠం నేర్చుకోవడానికీ సంబంధం ఏమిటో అర్థం కావడం లేదు. రిషి సునాక్‌ను ఎన్నుకోవడానికి ముందు లిజ్ ట్రస్ అనే మహిళను కన్జర్వేటివ్ పార్టీ ఎన్నుకున్నది కదా. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించడానికి బ్రిటన్ దేశానికి, ముఖ్యంగా కన్జర్వేటివ్ పార్టీ ప్రభుత్వానికి రిషి సునాక్ లాంటి ఆర్థిక వ్యవహారాల నిపుణుడి అవసరం వచ్చింది. కన్జర్వేటివ్ పార్టీ రిషి సునాక్‌ను ఎన్నికల ముందు ప్రధాని అభ్యర్థిగా నిలబెట్టి, ఎన్నికలలో గెలిచి ఉంటే – అప్పుడు భారతీయులు బ్రిటన్ ప్రజల నుంచి ఆదర్శాన్ని అందిపుచ్చుకోవాల్సి ఉండేది.

190 సంవత్సరాలు భారతదేశాన్ని పీల్చిపిప్పి చేసింది బ్రిటన్. ఇప్పటికీ 14 దేశాలపై తన రాజరికపు ముద్రను కొనసాగిస్తూనే ఉన్నది. తమను దోచుకున్న దేశాన్ని బ్రిటిషర్స్ శత్రువులుగా భావిస్తారు. వ్యాసకర్త చెప్పిన దానికి విరుద్ధంగా ఆ దేశం నుండి చాలా విషయాలను స్వయం ప్రకటిత మేధావులైన కొందరు భారతీయులు నేర్చుకోవాలి.

ఇక రిషి సునాక్ బ్రిటన్ ప్రధానిగా ఎన్నికైన సందర్భాన్ని నేపథ్యంగా కేంద్ర ప్రభుత్వాన్ని నడిపే భారతీయ జనతా పార్టీ హిందూ మతానికి చెందినదనీ, ఆ పార్టీ ముస్లింలకు వ్యతిరేకమని చెప్పడానికీ వ్యాసకర్త సంఖ్యాపరమైన విశ్లేషణలు చక్కగా చేశారు. ఈ దేశంలో సంఖ్యాపరంగా ముస్లింలు 14.3 శాతం ఉన్నది నిజమే. పార్లమెంట్లో వారి స్థానాలు కూడా తక్కువనేది వాస్తవమే. సివిల్ సర్వెంట్లుగా, సైనికులుగా ఆ మతం వారి సంఖ్య దేశంలోని ఇతర మతాల వారితో పోలిస్తే తక్కువే. ఇందుకు భారతీయ జనతా పార్టీ కారణం కాదే! హిందువులు మెజారిటీగా ఉన్న భారతదేశంలో ముస్లిం వర్గం నుండి నలుగురు రాష్ట్రపతులుగా ఎన్నిక చేయబడ్డారు. మరి ముస్లింలు మెజారిటీగా ఉండే పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మైనార్టీ వర్గాలైన హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్సీలు, క్రైస్తవుల పరిస్థితి ఏమిటి?

20 కోట్ల మంది ముస్లింల నుండి ఒక ప్రధాని ఆశించడానికి వీలు లేదా? అని ఒక మంచి ప్రశ్న వేశారు వ్యాసకర్త. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, క్రైస్తవ మతానికి చెందిన సోనియా గాంధీ 2004 నుండి 2014 వరకు ఈ దేశంపై సర్వాధికారాలను అనుభవించిన విషయం అందరికీ తెలిసిందే. జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో 28 శాతం హిందువులు ఉంటారు. ఆ రాష్ట్రం భారతదేశంలో విలీనమైనప్పటి నుండి ఇప్పటివరకు ఒక్క హిందువూ సీఎం కాలేదనే విషయం వ్యాసకర్తకు తెలియదా?

ముస్లింలను చెద పురుగులుగా, బాబర్ వారసులుగా అవహేళన చేస్తూ, మానసి కంగా వేధిస్తున్నారనే విషయం వాస్తవమేనా? కశ్మీర్ లోయనుండి 3 లక్షల మంది హిందువులను తరిమికొట్టింది ఎవరు? ఇక చివరిగా రిషి సునాక్‌ను బ్రిటన్ ప్రధానిగా చేయడం వెనుక ఆ దేశ అవసరం ఉంది. ఈ విషయంలో ఆయన భారతీయ మూలాల శ్రేష్ఠత గానీ, రంగు గానీ, జాతి గానీ కన్జర్వేటివ్ పార్టీ ఎంపీలకు కనబడలేదనే విషయం మనం అర్థం చేసుకోవాలి. అందుకే మనం రిషీ సునాక్ ఎంపిక చూసి గర్వపడాల్సింది ఏమీలేదు. బ్రిటిష్‌వారి ఔదార్యమూ అంతకన్నా ఏమీలేదు.

వ్యాసకర్త రాజకీయ, సామాజిక విశ్లేషకులు

నేషన్ వాంట్స్ టు నో

అభిప్రాయం



భండారు శ్రీనివాసరావు

అది 1978, జనవరి 14వ తేదీ ఉదయం. ముంబై (అప్పుడు బొంబాయి)లో ఉన్న రిజర్వ్ బ్యాంకు చీఫ్ అకౌంట్స్ కార్యాలయంలో సీనియర్ అధికారి ఆర్. జానకి రామన్ ఇంట్లో ఫోను మోగింది. వెంటనే ఢిల్లీ రావలసిందని ఒక ప్రభుత్వ అధికారి ఆదేశం. ఆయన ఢిల్లీ వెళ్ళీ వెళ్ళగానే అక్కడి ఉన్నతాధికారులు, ఒక ఆర్డినెన్స్ ముసాయిదాను ఒకే ఒక్క రోజులో తయారు చేయాలని ఆయన్ని కోరారు. పెద్ద విలువ కలిగిన కరెన్సీ నోట్లని చలామణి నుంచి తప్పించాలని ప్రభుత్వం సంకల్పించిందనీ, అందుకు తగిన ఆర్డినెన్స్ సిద్ధం చేయాలనీ, ఇదంతా చాలా గోప్యంగా జరగాలనీ రామన్‌ను ఆదేశించారు.

అనుకున్న పద్ధతిలోనే ఆర్డినెన్స్ ముసాయిదా తయారయింది. జనవరి 16 తెల్లవారు జాము కల్లా రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి సంతకం కోసం పంపారు. అదే రోజు ఉదయం తొమ్మిది గంటలకు ఆకాశవాణి ద్వారా పెద్ద కరెన్సీ నోట్లను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ ప్రజలకు తెలిసిపోయింది. అప్పటి ఆర్బీఐ గవర్నర్ ఐ.జీ. పటేల్‌కు ఈ రద్దు వ్యవహారం నచ్చలేదు. సంకీర్ణ జనతా ప్రభుత్వంలోని కొందరు నాయకులు పెద్ద నోట్ల రద్దుకు పట్టుబట్టడం వల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నది ఆయన అభిప్రాయం. అంతకు పూర్వం దేశాన్ని పాలించిన నాయకుల అవినీతి పనులను లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుందని పటేల్ చెప్పారు. భారతీయ ఆర్థిక విధానాలపై పటేల్ రాసిన పుస్తకంలో ఇంకా ఇలా పేర్కొన్నారు.

'పెద్ద విలువ కలిగిన కరెన్సీ నోట్లను రద్దు చేయాలనే నిర్ణయం గురించి ఆర్థిక మంత్రి హెచ్.ఎం. పటేల్ నాతో ప్రస్తావించారు. అటువంటి సంచలన నిర్ణయాలతో అద్భుత ఫలితాలు రాబట్టడం చాలా అరుదుగా జరుగుతుందని నేను మంత్రితో స్పష్టంగా చెప్పాను.' 'సాధారణంగా అవినీతి, అక్రమ పద్ధతుల్లో భారీఎత్తున డబ్బు పోగేసుకునేవాళ్ళలో అత్యధికులు ఆ సంపదను కరెన్సీ రూపంలో ఎక్కువ కాలం దాచిపెట్టుకోరు' అన్నది నాటి రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ అభిప్రాయం.

1978లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ శకం ముగిసిన తరువాత ప్రజల తీర్పుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి కాంగ్రెసేతర జనతా ప్రభుత్వం వెయ్యి, అయిదు వేలు, పదివేల రూపాయల నోట్లను రద్దు చేయాలని సంకల్పించి, ఆ నిర్ణయాన్ని వెంటనే అమలు చేసింది. అప్పుడు జనతా ప్రభుత్వానికి నేతృత్వం వహించింది గుజరాత్‌కు చెందిన మొరార్జీ దేశాయ్. మళ్ళీ ఇన్నేళ్ళ తరువాత, 2016 నవంబర్ ఎనిమిదో తేదీన అయిదు వందలు, వెయ్యి రూపాయల కరెన్సీ నోట్లని రద్దు చేయాలని నిర్ణయించింది కూడా అదే రాష్ట్రానికి చెందిన నేటి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ. ఇది కాకతాళీయం కావచ్చు. అలాగే ఈ రెండు నిర్ణయాలు కాంగ్రెసేతర ప్రభుత్వాలవి కావడం మరో పోలిక.



నవంబర్ ఎనిమిది సాయంత్రం ఢిల్లీలో కేంద్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. సమావేశం ముగిసే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెద్ద నోట్ల చలామణి రద్దు నిర్ణయాన్ని క్లుప్తంగా తెలియచేసి మంత్రులనందరినీ సమావేశ మందిరంలోనే కూర్చోబెట్టి ప్రభుత్వ సంకల్పాన్ని రాష్ట్రపతికి తెలియ చేయడానికి వెళ్ళారు. ఆ తరువాత నేరుగా దేశ ప్రజలనుద్దేశించి రేడియో, దూరదర్శన్‌లలో ప్రసంగించారు. నోట్ల రద్దు నిర్ణయం గురించి మొత్తం దేశంలో తెలిసిన వాళ్ళు పది మంది మాత్రమే అనీ, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ పదవి నుంచి తప్పుకున్న రఘురాం రాజన్ అందులో ఒకరనీ తెలుసుకుని ఆశ్చర్యపోవడం మీడియా వంతయింది. నోట్ల రద్దుకు ఆరు నెలల ముందు నుంచే ఏర్పాట్లు జరిగాయి. ఆ ఏర్పాట్లలో భాగమే కొత్త రెండువేల రూపాయల నోటు నమూనా తయారు చేయడం, ఆమోదించడం, ఆ నోట్లను పెద్ద మొత్తంలో ముద్రించడం.

ప్రధాని ప్రసంగం ముగించిన వెంటనే, దాన్ని విన్న ప్రజలందరికీ, దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్న నల్ల ధనం పిశాచి భరతం పట్టడానికి మోదీ ఎంతో సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్న ఒకే అభిప్రాయం కలిగింది. 'కొద్ది రోజులు కటకట పడితే పడదాము, కష్టాలు శాశ్వతంగా తీరిపోతున్నప్పుడు తాత్కాలిక ఇబ్బందులను పట్టించుకోవద్దు' అనే భావన సర్వత్రా కనబడింది.

అయితే రోజులు గడుస్తున్న కొద్దీ సామాన్య జనం ఆలోచనల్లో మార్పు రావడం మొదలయింది. అనుకున్నది ఒకటయితే, జరుగుతున్నది మరొకటన్న అభిప్రాయం బలపడసాగింది. బడాబాబులు ఎవ్వరూ ప్రభుత్వ నిర్ణయంతో కలవరపడక పోవడం వారిని ఆశ్చర్య పరిచింది. ఏమీ జరగనట్టు నల్ల కుబేరులు నిబ్బరంగా వుంటుంటే, తాము మాత్రం రాత్రీ పగలూ తేడా లేకుండా బ్యాంకుల ముందూ, ఏటీఎంల వద్దా పడిగాపులు పడడం ఏమిటన్న సందేహం పొడ మరించింది. తమ డబ్బు తాము తీసుకోవడానికి ఇంతగా హైరానా పడాలా అనే ప్రశ్నలు వారిని వేధించడం మొదలు పెట్టాయి. అయితే ప్రజలకు ఉన్న ఓరిమి చాలా గొప్పది. సర్దుకుపోయే తత్వం ఇంకా గొప్పది. అంచేతే మంచి రోజుల కోసం ఎదురు చూడడానికే సిద్ధపడ్డారు.

తరువాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు మోదీకి బ్రహ్మరథం పట్టారు. దానితో పెద్ద నోట్ల రద్దు నిర్ణయానికి దేశ ప్రజల మద్దతు పూర్తిగా లభించినట్టు అయింది. దేశానికి సంబంధించి తీసుకున్న ఒక కీలక, ప్రధాన నిర్ణయానికి ప్రజల మద్దతు పొందడం మామూలు విషయం కాదు. ఆ మేరకు ప్రధాని మోదీ చాలా అదృష్టవంతుడనే చెప్పాలి. కానీ నల్లధనం రద్దుకు తీసుకున్న ఈ నిర్ణయం వికటించిందా, ఫలించిందా అంటే ఔనని చెప్పలేని పరిస్థితి.

అయితే సామాన్య ప్రజలకు అంతకు ముందు లేని ఒక మంచి అలవాటు అలవడింది. చిన్న చిన్న లావాదేవీలకు కూడా నగదు రహిత చెల్లింపులకు అలవాటు పడ్డారు. పెద్ద నోట్లు రద్దు చేసిన సమయంలో దేశంలో ద్రవ్య చలామణి 17.97 లక్షల కోట్లు వుండగా ఇప్పుడది 72 శాతం పెరిగి 30.88 లక్షల కోట్లకు చేరుకుందని గణాంకాలు చెబు తున్నాయి. గత ఆరేళ్ల కాలంలో దేశ వ్యాప్తంగా అనేక ఎన్నికలు జరిగాయి. ప్రతి చిన్నా, పెద్దా ఎన్నికల్లో అన్ని పార్టీల వాళ్ళు విచ్చల విడిగా డబ్బు వెదజల్లారు. ఇదంతా ప్రజలు కళ్ళారా చూశారు. చెవులారా విన్నారు.

పెద్దనోట్లు రద్దు చేసిన తర్వాత కూడా బడాబాబుల దగ్గర ఇంతంత డబ్బు ఎలా పోగుపడింది? పెద్ద నోట్ల రద్దు పెద్దగా ఫలించలేదు అనడానికి ఇది తార్కాణం.

కారణం తెలుసుకునే హక్కు ప్రజలకు వుంది. నేషన్ వాంట్స్ టు నో.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: బ.పాడ్యమి సా.4.02 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: కృత్తిక రా.2.51 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: ప.2.13 నుండి 3.55 వరకు, దుర్ముహూర్తం: ప.11.20 నుండి 12.05 వరకు, అమృతఘడియలు: రా.12.18 నుండి 1.57వరకు; రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు; సూర్యోదయం 6.05 : సూర్యాస్తమయం 5.23.


విజయనగరం జిల్లా చింతాడలో సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


శ్రీసత్యసాయి జిల్లా గోనిమేకులపల్లిలో సంక్షేమ లబ్ధి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


పల్నాడు జిల్లా మాదలలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు


తూర్పుగోదావరి జిల్లా మలకపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

క్లుప్తంగా

బాంబే బ్లడ్ ఫ్రమ్ చెన్నై

కాకినాడకు చేరిన అత్యంత అరుదైన రక్తం

కాకినాడ క్రైం: ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరిన గర్భిణిని కాపాడేందుకు అరుదైన గ్రూప్ రక్తాన్ని సేకరించడంలో వైద్యులు సఫలీకృతమయ్యారు. కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన 34 ఏళ్ల మహిళ ప్రసవం నిమిత్తం కాకినాడ అపోలో ఆస్పత్రిలో చేరింది. సిజేరియన్ చేయాల్సిన సమయంలో ఆమెకు రక్తం అవసరమని వైద్యులు నిర్ధారించారు. అయితే, ఆమెది అత్యంత అరుదైన బాంబే బ్లడ్ గ్రూప్. ఈ రక్తం సేకరణకు వైద్యులు అన్ని ప్రయత్నాలూ చేపట్టారు. ఈలోపు మహిళ భర్త స్నేహితులు, బంధువులు, రక్తదాతల ప్రతినిధులను సంప్రదించారు. ఈ క్రమంలో చెన్నైలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఒక యూనిట్ బాంబే బ్లడ్ గ్రూప్ రక్తం ఉందని తెలుసుకున్నారు. దాన్ని తీసుకువచ్చేందుకు రైల్వే అధికారుల సాయం తీసుకున్నారు. కోల్డ్ చైన్ కొనసాగేలా ప్రత్యేక పెట్టెలో బ్లడ్ ప్యాకెట్‌ను పెట్టి కోచ్ కండక్టర్‌కు అందజేశారు. విజయవాడలో రెడ్‌క్రాస్ బృందం ఆదివారం రాత్రి 2.30కి దానిని అందుకుని మరో పెట్టెలోకి మార్చి మిగిలిన ప్రయాణ సమయంలో రక్తం భద్రంగా చేరేలా చర్యలు తీసుకుంది. సోమవారం ఉదయం 'బాంబే బ్లడ్' కాకినాడకు చేరింది. తక్షణమే వైద్యులు సిజేరియన్ చేయగా.. ఆ మహిళ మగ శిశువుకు జన్మనిచ్చింది. రక్తాన్ని కాకినాడకు చేరేలా కృషి చేసిన అందరికీ మహిళ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్ అండ్ ఆర్ అమలు పీఏలుగా జేసీలు

సాక్షి, అమరావతి: ఏపీలోని 26 జిల్లాల్లో ఆర్ అండ్ ఆర్ అమలు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ (పీఏ)లుగా ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్ (జేసీ)లను ప్రభుత్వం నియమించింది. పెద్ద ప్రాజెక్ట్ కావడంతో పోలవరంను ఇందులో నుంచి మినహాయించింది. 2013 రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ (ఆర్ అండ్ ఆర్) చట్టం ప్రకారం భూసేకరణ చేసే ప్రతి ప్రాజెక్ట్‌కు ఒక పీఏను నియమించాల్సి ఉంది. జిల్లాల్లో ఇలాంటి అన్ని ప్రాజెక్ట్‌లకు ప్రత్యేకంగా అడ్మినిస్ట్రేటర్లను నియమించడం కష్టం కావడంతో ఈ బాధ్యతలను జేసీలకే అప్పగిస్తున్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో తిరిగి మళ్లీ వారినే పీఏలుగా నియమిస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

చంద్రబాబు పర్యటనలో భద్రతా లోపాలు

డీజీపీకి వర్ల రామయ్య లేఖ

సాక్షి, అమరావతి: తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పర్యటనలో భద్రతా లోపాలున్నాయని టీడీపీ నేత వర్ల రామయ్య డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు లేఖ రాశారు. ఈ నెల 4న ఎన్టీఆర్ జిల్లా నందిగామలో చంద్రబాబు రోడ్ షోపై కొందరు రాళ్లు వేశారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతకు భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని తెలిపారు. భద్రతా లోపాలకు కారణమైన డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలను సస్పెండ్ చేయాలని కోరారు. దళితుల ఓట్లను దండుకుని అధికారంలోకి వచ్చిన జగన్ దళితులను నట్టేట ముంచారని నక్కా ఆనంద్ బాబు విమర్శించారు.

ఆక్రమణదారులకు జనసేన సాయం!

రాజకీయ లబ్ధి కోసం రూ.లక్ష చొప్పున సాయం ప్రకటించిన పవన్

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం ఇప్పటంలో ఆక్రమణల తొలగింపు ఘటనలో ప్రహరీలు కోల్పోయిన వారికి జనసేన పార్టీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది. ఈ మేరకు అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిర్ణయించినట్టు మంగళవారం ఆ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. మంగళగిరి–తాడేపల్లి నగర కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటంలో కొందరు ప్రభుత్వ రోడ్డును ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అయితే ఇటీవల రూ.1.65 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులలో భాగంగా నగర పాలక సంస్థ అధికారులు ఈ నెల 4వ తేదీన ఆక్రమణలు తొలగించిన విషయం తెలిసిందే. మానవతా దృక్పథంతో ఆక్రమణ పరిధిలో ఉండే ఇంటి ప్రహరీ, మెట్లు వంటి వాటిని మాత్రమే అధికారులు తొలగించారు. అయితే ప్రభుత్వం ఇళ్లను కూల్చి వేసిదంటూ పవన్ కళ్యాణ్ ఇప్పటంలో పర్యటించి నానా హంగామా సృష్టించారు. ప్రహరీ కోల్పోయిన ఒక్కో ఇంటికి రూ.లక్ష చొప్పున పార్టీ పరంగా పవన్ కళ్యాణే స్వయంగా త్వరలో బాధితులకు అందజేస్తారని పార్టీ పేర్కొంది. కాగా, ఇళ్లు కూల్చనప్పటికి.. పవన్ సహాయం రాజకీయ లబ్ధి కోసమేనని విమర్శలు ఉన్నాయి. గత మార్చిలో జనసేన సమావేశం సందర్భంగా ఇప్పటం అభివృద్ధికి ప్రకటించిన రూ.50 లక్షలు ఇప్పటి వరకు ఇవ్వకపోవడం గమనార్హం.

ప్రాధాన్యత ప్రాజెక్టుగా మహేంద్రతనయ

సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు శరవేగంగా పనులు

- రూ.852.45 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా అడుగులు
- ప్రాజెక్టు ద్వారా 24,600 ఎకరాలకు సాగు నీరు, 108 గ్రామాలకు తాగునీరు
- శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లాలో సాగు, తాగు నీటి సదుపాయాలను మెరుగుపర్చడం ద్వారా జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లాలో అత్యంత వెనుకబడిన నందిగం, పలాస, టెక్కలి, మెళియపుట్టి మండలాల్లో 24,600 ఎకరాలకు సాగు నీరు, 108 గ్రామాలకు తాగు నీరు అందించే మహేంద్ర తనయ ప్రాజెక్టును జలవనరుల శాఖ అధికారులు ప్రాధాన్యత ప్రాజెక్టుగా చేపట్టారు. జలయజ్ఞంలో భాగంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును చేపట్టారు. దీనిని గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ప్రాజెక్టు నత్తనడకన సాగింది. ఇప్పుడు వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిపెట్టింది. దివాలా తీసిన పాత కాంట్రాక్టర్‌ను తొలగించి, మిగిలిపోయిన పనులను కొత్త కాంట్రాక్టు సంస్థకు అప్పగించడానికి టెండర్ షెడ్యూళ్లను జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపింది. జ్యుడిషియల్ ప్రివ్యూ అనంతరం రివర్స్ టెండరింగ్ ద్వారా తక్కువ ధరకు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తారు.

రోజుకు 1200 క్యూసెక్కులు మళ్లించి..

ఒడిశాలోని తుపరసింగి వద్ద పుట్టిన మహేంద్రతనయ గొట్టా బ్యారేజ్‌కు 4 కిలోమీటర్ల ఎగువన వంశధారలో కలుస్తుంది. శ్రీకాకుళం జిల్లా మెళియపుట్టి మండలం చాపర వద్ద మహేంద్రతనయపై రెగ్యులేటర్ నిర్మించి, అక్కడి నుంచి రోజుకు 1200 క్యూసెక్కులు తరలించేలా 13.52 కిలోమీటర్ల వరద కాలువ తవ్వుతారు. ఈ కాలువ ద్వారా నీటిని తరలించి రేగులపాడు వద్ద 1.76 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే రిజర్వాయర్‌లో నిల్వ చేస్తారు. రిజర్వాయర్ నుంచి ఎడమ కాలువ (11.20 కిలోమీటర్లు) ద్వారా 12,500 ఎకరాలకు, కుడి కాలువ (10.20 కిలోమీటర్లు) ద్వారా 12,100 ఎకరాలు.. మొత్తం 24,600 ఎకరాలకు సాగు నీటితోపాటు 108 గ్రామాలకు తాగు నీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.852.45 కోట్లు. వరద కాలువలో ఇప్పటికే 7.27 కిలోమీటర్ల పని పూర్తయింది. మరో 6.3 కిలోమీటర్ల కాలువ తవ్వాల్సి ఉంది. కాలువపై 26 కాంక్రీట్ నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. రిజర్వాయర్ పనుల్లో భాగంగా 2.485 కిలోమీటర్ల పొడవున 55.6 మీటర్ల ఎత్తుతో మట్టికట్ట నిర్మించాలి. రిజర్వాయర్‌లో ముంపునకు గురయ్యే ఏడు గ్రామాల్లోని 1,059 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉండగా.. ఇప్పటికే 659 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. ఆయకట్టుకు నీళ్లందించేలా 51.5 కిమీల పిల్ల కాలువల కోసం 373.75 ఎకరాల భూమిని సేకరించాలి. ఈ భూమి సేకరణ, నిర్వాసితులకు పునరావాసంపై అధికారులు దృష్టి సారించారు. మిగిలిపోయిన పనులను కొత్త కాంట్రాక్టు సంస్థకు అప్పగించి.. శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి

ఏపీ శాక్స్ జేడీ డాక్టర్ కిషోర్

సాక్షి, అమరావతి: హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శాక్స్) చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని ఆ సంస్థ జేడీ డాక్టర్ కిషోర్ కోరారు. తాడేపల్లిలోని శాక్స్ కార్యాలయంలో మంగళవారం స్ట్రాటజిక్ ఎక్స్‌పర్టయిజ్ టెక్నికల్ యూనిట్ (సేతు) సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. రాబోయే ఆరునెలల్లో చేపట్టబోయే కార్యక్రమాలపై సిబ్బందితో చర్చించారు. శాక్స్ కార్యక్రమాలను సేతు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సేతు సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్వచ్ఛంద సంస్థల పనితీరును రోజువారీ సమీక్షిస్తూ కార్యక్రమాలకు సంబంధించిన లోపాలను గుర్తించి తెలపాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పెప్ ఫర్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, సేతు ప్రాజెక్ట్ ప్రివెన్షన్ స్పెషలిస్ట్ సి.బాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆత్మగౌరవం పెంచేలా పాలన

బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ


బీసీ ఉప కులాల కార్పొరేషన్ చైర్మన్లతో కలిసి సంఘీభావం తెలుపుతున్న మంత్రి చెల్లుబోయిన

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో గీత కార్మికుల జీవన కష్టాన్ని కళ్లతో కాకుండా మనసుతో చూశారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. అందుకే బీసీల ఆత్మగౌరవం పెంచేలా, జీవన భద్రత కల్పించేలా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. గీత కార్మికుల కోసం కొత్త పాలసీ తెచ్చి, వారికి భద్రత కల్పించారని తెలిపారు. మంగళవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బీసీ ఉప కులాల కార్పొరేషన్ చైర్మన్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, యాత, ఈడిగ ఉపకులాలతో పాటు షెడ్యూల్ కులాలు, తెగల వాళ్లు కూడా కల్లు గీత వృత్తి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరి జీవన విధానం మెరుగు పడేలా ఈ నెల 5న జీవో 693 ద్వారా సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రమాదవశాత్తు గీత కార్మికులు మృతి చెందితే, ఆ కుటుంబాలు రోడ్డునపడకుండా ఆదుకునేందుకు ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచారు' అని చెప్పారు. ఈ గొప్ప నిర్ణయంపై రాష్ట్రంలోని గీత, గీత ఉప కులాలన్నీ ముక్త కంఠంతో హర్షం వ్యక్తం చేస్తూ ర్యాలీలు నిర్వహించి, సీఎం జగన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఇంకా ఏమన్నారంటే..

బీసీలకు అన్ని విధాలుగా అండగా నిలిచిన సీఎం

- సీఎం జగన్ అన్ని విధాలా బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. నన్ను బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా, మరో ఐదుగురిని గీత ఉప కులాల కార్పొరేషన్ల చైర్మన్లుగా నియమించడం పట్ల మాకు ఎంతో ఆనందంగా ఉంది. గీత కులాల వారు సీఎం జగన్‌ను తమ బిడ్డగా భావిస్తున్నారు.
- గీత ఉప కులాల వారు.. శ్రీకాకుళం ప్రాంతంలో శ్రీశైనులుగా, విజయనగరం, విశాఖపట్నంలో యాతలుగా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో శెట్టిబలిజలుగా, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో గౌడలుగా, రాయలసీమ జిల్లాల్లో ఈడిగలుగా జీవనం సాగిస్తున్నారు.
- ఈ ఐదు కులాల ప్రధాన వృత్తి గీత. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం కాకముందు, గీత వృత్తిదారుల్లో చదువు పట్ల ఆసక్తి చూపించిన వారి సంఖ్య చాలా తక్కువ. వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి రూపకల్పన చేసి, అమలు చేశాక, లక్షలాది మంది పిల్లలు ఉన్నత చదువులు చదివి, విదేశాలకు వెళ్లారు. సీఎం జగన్ పాలనలో ఇప్పుడు ఆ సంఖ్య ఇంకా పెరిగింది.
- టీడీపీకి గీత కులాల గురించి మాట్లాడే అర్హతే లేదు. బీసీలను చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ మోసం చేశారు. ఓట్లు కోసం మాత్రమే మమ్మల్ని వాడుకున్నారు. దేశంలో ఎక్కడా ఎక్స్‌గ్రేషియా రూ.లక్షకు మించి లేదు. అదే సీఎం జగన్ రూ.10 లక్షలకు పెంచడం హర్షణీయం. గీత కార్మికులకు ఏపీలో అందుతున్న సహకారం దేశంలో మరెక్కడా లేదు.
- ఈ సమావేశంలో కార్పొరేషన్ల చైర్మన్లు డాక్టర్ గుబ్బాల తమ్మయ్య (శెట్టి బలిజ), మాదు శివరామకృష్ణ (గౌడ), పిల్లి సుజాత (యాత), కె.సంతు (ఈడిగ) పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో మానసిక ఆరోగ్య చికిత్సలు

వైద్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: ప్రైవేట్ మానసిక ఆస్పత్రులను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఎంపానల్‌మెంట్ చేయడం ద్వారా మానసిక ఆరోగ్య చికిత్సలు పూర్తి స్థాయిలో విస్తరించాలని వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంలో స్టేట్ మెంటల్ హెల్త్ అథారిటీ (ఎస్ఎంహెచ్ఏ) సమావేశం మంగళవారం జరిగింది. కృష్ణబాబు మాట్లాడుతూ మానసిక చికిత్సలకు ప్రభుత్వాస్పత్రుల్లో ఇప్పటికే ఆరోగ్యశ్రీలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే, కొన్ని ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మాత్రమే ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద మానసిక చికిత్సలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అన్ని ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మానసిక ఆరోగ్య వైద్య సేవలకు ఆరోగ్యశ్రీ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జిల్లాల్లోనూ డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్ఎంహెచ్ఏ సీఈవో, డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్, ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్, కో–ఆర్డినేటర్ డాక్టర్ రాధిక, జేడీ డాక్టర్ నీలిమ పాల్గొన్నారు.

శ్రీశైలంలో తగ్గుతున్న నీటినిల్వలు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో నీటినిల్వలు రోజురోజుకు తగ్గుతున్నాయి. ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం తగ్గడం, శ్రీశైలం నుంచి దిగువ ప్రాంతాలకు నీటివిడుదల పెరగడంతో డ్యామ్‌లో నీరు తగ్గిపోతోంది. మంగళవారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 19,288 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి వస్తోంది. రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పాదన అనంతరం 51,439 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. జలాశయంలో 183.8486 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 879.20 అడుగులకు చేరుకుంది.

అవినీతికి తావు లేకుండా అభివృద్ధి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అవినీతి రహిత పాలన అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని, దీనిపై టీడీపీ నేతలు అవాకులు చెవాకులు పేలడం సరికాదని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. దళారుల ప్రమేయం లేకుండా, పైసా లంచం ఇవ్వకుండా, పారదర్శకంగా.. అర్హతే ప్రామాణికంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని పీఎన్‌కాలనీలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనాలతో మాట్లాడితేనే ప్రభుత్వ పనితీరుపై వారి సంతృప్తి స్థాయి తెలుస్తుందని చెప్పారు. వ్యవస్థ దానంతటదే పని చేసుకునే పద్ధతి రావాలని, అభివృద్ధి చెందిన దేశాల్లో అలాగే జరుగుతుందన్నారు. మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా ప్రజలకు పథకాలు అందించాలని అప్పట్లో ప్రధానిగా రాజీవ్ గాంధీ చెప్పారన్నారు. మధ్యవర్తుల కారణంగానే అప్పట్లో 90 శాతం స్కీమ్‌లు అర్హులకు చేరేవి కావన్నారు. కానీ రాష్ట్రంలో ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, వ్యవస్థను మార్పు చేస్తూ వివిధ పథకాల కింద లక్షన్నర కోట్ల రూపాయలకు పైగా ప్రజలకు నేరుగా అందించామని స్పష్టం చేశారు. ఇది మార్పు కాదా? అని ప్రశ్నించారు. విద్యా రంగంలో సంస్కరణల ద్వారా మంచి మార్పులు తీసుకొచ్చామన్నారు. నిన్నా మొన్నటి వరకు రాష్ట్రం అక్షరాస్యతలో దేశంలో 22వ స్థానంలో ఉండేదని, తాజా సంస్కరణల వల్ల ఆ పరిస్థితిలో బాగా మార్పు వస్తోందన్నారు. అయితే సంస్కరణలు తీసుకొచ్చినప్పుడు కొంత వ్యతిరేకత ఉండటం సహజమని చెప్పారు. ప్రజలు వాటిని అర్థం చేసుకోవడానికి కొంచెం సమయం పడుతుందన్నారు. ఇది అర్థం కాని వారే ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని వివరించారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

వైఎస్సార్‌సీపీ హయాంలోనే జిల్లా అభివృద్ధి

- బుడగట్ల పాలెంలో ఫిషింగ్ హార్బర్, రూ.3 వేల కోట్లతో భావనపాడు పోర్టు నిర్మించనున్నాం. గొట్టా బ్యారేజ్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, ఉద్దానంలో రూ.700 కోట్లతో మంచినీటి ప్రాజెక్టు, పలాసలో కిడ్నీ రోగుల కోసం రూ.50 కోట్లతో డయాలసిస్ సెంటర్, ఆస్పత్రి నిర్మాణం జరుగుతోంది.
- జిల్లాల పునర్విభజన పూర్తయింది. రిమ్స్‌ను 900 పడకలతో తీర్చిదిద్దాం. ఇదంతా అభివృద్ధి కాదా? ఇది టీడీపీ నేతలకు కనిపించడం లేదా?


మరో తెలంగాణ కాకూడదు..

- రాష్ట్ర విభజన తర్వాత శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులను చంద్రబాబు పట్టించుకోకుండా, నారాయణ కమిటీ సిఫార్సులను అమలు చేయడం దారుణం. చంద్రబాబు, ఆయన సామాజిక వర్గం వారి స్వార్థానికి రాష్ట్రంలో ప్రజలందరినీ బలి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ మరో తెలంగాణ కాకూడదు. ఈ దృష్ట్యా పాలన రాజధాని విశాఖే అన్న నినాదం వినిపించేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉత్తరాంధ్ర ప్రజల వెనుకబాటుతనాన్ని గుర్తించిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.
- వైజాగ్.. రాష్ట్రం మధ్యలో లేదని కొంత మంది చెప్పడం హాస్యాస్పదం. దేశంలో తమిళనాడు, మహారాష్ట్రల్లో చెన్నై, ముంబై ఎక్కడ ఉన్నాయో గమనించాలి. పాలన రాజధానిగా అందరినీ ఆదరించే గుణం వైజాగ్ సొంతం. న్యాయ రాజధానిగా కర్నూలు, లెజిస్లేటివ్ రాజధానిగా అమరావతి ఉంటుంది. దేశంలో సుమారు 8 రాష్ట్రాల్లో ఈ విధంగా రాజధానులు ఉన్నాయి.

కుప్పం కాలువ పనులు షురూ

మూడున్నరేళ్లుగా పనులు నిలిపివేసిన సంస్థను తప్పించిన ప్రభుత్వం

- పాత ఒప్పందానికే ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి పనుల అప్పగింత
- దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.25 కోట్లు ఆదా
- 6 నుంచి 9 నెలల్లో కాలువ పనుల పూర్తికి కసరత్తు


కుప్పం ఉపకాలువలో జరుగుతున్న కాంక్రీట్ నిర్మాణ పనులు

బి.కొత్తకోట: అనంత వెంకటరెడ్డి (ఏవీఆర్) హంద్రీ–నీవా ప్రాజెక్టు రెండో దశ పనుల్లో భాగమైన కుప్పం ఉపకాలువ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. గత మూడున్నరేళ్లుగా పనులు నిలిపేసిన రిత్విక్ ప్రాజెక్ట్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం తప్పించింది. ఈ పనులను పాత ఒప్పందానికే ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించింది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.25 కోట్లు ఆదా అవుతాయి. పనులు కూడా ఆరు నుంచి 9 నెలల్లో పూర్తికానున్నాయి.

క్షేత్ర స్థాయిలో పుంజుకుంటున్న పనులు

అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం నుంచి పుంగనూరు ఉపకాలువ ప్రారంభమవుతుంది. ఇక్కడ నుంచి చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలంలో కుప్పం ఉపకాలువ మొదలవుతుంది. ఈ ఉపకాలువ గుడిపల్లె మండలంలోని పరమసముద్రం చెరువు వద్ద ముగుస్తుంది. పనులపై గత ప్రభుత్వం శీతకన్ను వేయగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో క్షేత్రస్థాయిలో పనులు వేగం పుంజుకున్నాయి. ఈ పనులు పూర్తయ్యాక ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలను తరలించనున్నారు.

అదనపు పనుల పేరుతో నిధులను కొల్లగొట్టి..

కుప్పం ఉపకాలువ పనులకు 2015లో రూ.413.27 కోట్లకు టెండర్లు పిలిచింది. దీంతో రూ.430.27 కోట్లకు హెచ్ఈఎస్–ఆర్‌కే–కోయా జాయింట్ వెంచర్ సంస్థ పనులు దక్కించుకుంది. మధ్యలో ఈ పనుల్లో నాటి టీడీపీ ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు నాటి టీడీపీ ప్రభుత్వం భాగస్వామ్యం కల్పించింది. 2016 అక్టోబర్ నాటికి పనులన్నీ పూర్తి చేయాలని ఒప్పందం చేసుకున్నప్పటికీ పూర్తి చేయలేదు. టీడీపీ ప్రభుత్వం.. కాంట్రాక్టు సంస్థకు అదనపు పనుల పేరుతో రూ.122.75 కోట్లు మంజూరు చేస్తూ 2018 సెప్టెంబర్ 7న జీవో నంబర్ 626 జారీ చేసింది. మళ్లీ కాలువ గట్ల మీద మట్టిపనులు చేశారని 2019 జనవరి 28న జీవో 68 జారీ చేసి రూ.21.95 కోట్లు అదనంగా ఇచ్చింది. ఈ నిధులను తీసుకున్న కాంట్రాక్టు సంస్థ ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులను నిలిపివేసింది. పనులు చేపట్టాలని ఎన్ని నోటీసులు ఇచ్చినా కదలిక లేకపోవడంతో పనుల నుంచి ఆ సంస్థను ప్రభుత్వం తప్పించింది.

వేగంగా పనులు పూర్తి చేసేందుకు..

హెచ్ఈఎస్–ఆర్‌కే–కోయా జాయింట్ వెంచర్ సంస్థ పనులు చేయకపోవడంతో ఆ పనులను సత్వరమే పూర్తి చేయించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు సంస్థలతో సంప్రదింపులు జరిపింది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ గత ఒప్పంద విలువకే పనులు చేసేందుకు ముందుకు రావడంతో రూ.117.17 కోట్ల విలువైన పనులను అప్పగించారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.25 కోట్ల మేర ఆదా అయ్యింది. కాలువకు సంబంధించి 4.800 కిలోమీటర్ల కాలువ తవ్వకం, 101 స్ట్రక్చర్స్ నిర్మాణ పనులు, 8,32,141 క్యూబిక్ మీటర్ల మట్టి పనులు, 40,360 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు, మూడు ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులు, రోడ్ కటింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. మొత్తం ఒప్పంద విలువ రూ.430.27 కోట్లు అయినా గత ప్రభుత్వం అదనంగా రూ.144.7 కోట్లు పెంచుకోవడంతో పనుల అంచనా విలువ రూ.574.97 కోట్లకు చేరింది. 2019 వరకు 79.62 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన రూ.117.17 కోట్ల పనులను ప్రస్తుతం పూర్తి చేయనున్నారు. దీనిపై ప్రాజెక్టు మదనపల్లె సర్కిల్ ఎస్ఈ సీఆర్ రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పనులు పూర్తి చేయించి కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తరలించాలన్న ఆశయంతో ఉందని చెప్పారు. పనులను వేగంగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనిపై సీఈ హరినారాయణరెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని వెల్లడించారు.

క్లుప్తంగా...

ఎన్నికల వేళ.. గుజరాత్ కాంగ్రెస్‌లో కుదుపు

అహ్మదాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ గుజరాత్ కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే మోహన్‌సిన్హ్ రథ్వా మంగళవారం తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కీలక గిరిజన నేత రథ్వా 10 పర్యాయాలు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ప్రస్తుతం చోటా ఉదయ్‌పూర్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. డిసెంబర్‌లో జరగనున్న ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి మోహన్ సిన్హ్‌తోపాటు, ఎంపీ నరన్ రథ్వా కూడా తమ కుమారులను బరిలోకి దింపాలని పోటీపడుతున్నారు. ఈ అంశమే ఎమ్మెల్యే రాజీనామాకు కారణమైందని భావిస్తున్నారు.

గవర్నర్ వైఖరిపై ఎల్‌డీఎఫ్ విస్తృతస్థాయి నిరసన

తిరువనంతపురం: కేరళలో అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్) ప్రభుత్వాన్ని బహిరంగంగా తీవ్రంగా తప్పుబట్టే ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌పై క్షేత్రస్థాయి విస్తృత నిరసన కార్యక్రమాలకు ఎల్‌డీఎఫ్ శ్రేణుల తెరతీశాయి. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గవర్నర్ ఖాన్‌కు వ్యతిరేకంగా కరపత్రాలు పంచిపెట్టాయి. భారత రాజ్యాంగంపై కనీస అవగాహనలేని గవర్నర్ పూర్తిగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తరఫున పనిచేస్తున్నారని ఆ కరపత్రాల్లో ప్రచురించారు. ఉన్నత విద్య పరిరక్షణకు ఖాన్‌కు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎడ్యుకేషన్ ప్రొటెక్షన్ సొసైటీ పేరిట ఈ కరపత్రాలు ముద్రితమయ్యాయి. ఈనెల 15వ తేదీన రాజ్‌భవన్ ఎదుట ఏకంగా లక్షమందితో భారీ నిరసన కార్యక్రమానికి ఏర్పాటుచేస్తున్నట్లు ఎల్‌డీఎఫ్ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో సీపీఐ(ఎం) పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమిస్తున్నారని, గుత్తాధిపత్యం రాజ్యమేలుతోందని గవర్నర్ ఖాన్ సోమవారం విమర్శించిన విషయం తెల్సిందే.

యూపీ మదరసాల్లో సైన్స్, గణితం బోధన

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని మదరసాల్లో విద్యార్థులు మత బోధనతోపాటు సైన్స్, గణితం, ఇతర సబ్జెక్టులను కూడా నేర్చుకునేందుకు ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి ధరంపాల్ సింగ్ చెప్పారు. 'ఒక చేతిలో ఖురాన్, మరో చేతిలో ల్యాప్‌టాప్' అనే ప్రధాని మోదీ ఆశయ సాధనకు అనుగుణంగా ఇందుకు సంబంధించిన పథకాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. ఆధునిక విద్యతో మదరసాల్లో విద్యార్థులు మౌల్వీలకు బదులుగా ప్రభుత్వాధికారులు, డాక్టర్లు, వైద్యులుగా తయారవుతారని పేర్కొన్నారు. చాలా చోట్ల ఆక్రమణల్లో ఉన్న వక్ఫ్‌బోర్డ్ స్థలాలను ఖాళీ చేయించి అక్కడ ఆస్పత్రులు, స్కూళ్లు నిర్మిస్తామని చెప్పారు. దీంతో పాటు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల నుంచి 4 వేల గోవులను సంరక్షించేందుకు వీలుగా గోవంశ్‌స్థల్‌లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

అయోధ్య రామాలయం సగం పూర్తి

పలంపూర్/అన్నీ(యూపీ): అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణ పనులు సగందాకా పూర్తి అయ్యాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. వచ్చే ఏడాది డిసెంబర్‌కల్లా ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని చెప్పారు. 'దాదాపు 500 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అయోధ్య రామాలయ నిర్మాణ క్రతువు మొదలైంది' అని హిమాచల్ ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి తరఫున ప్రచారసభలో యోగి ప్రసంగించారు. 'హిమాచల్ ప్రజల గుండె ధైర్యం గొప్పది. వందలాది మంది యువత భారత సైన్యంలో చేరుతోంది. మన శత్రువు ఇప్పుడు మనవైపు చూసేందుకు కూడా భయపడుతున్నాడు' అని సభలో వ్యాఖ్యానించారు.

ఇంగ్లండ్, వేల్స్ విదేశీ నివాసితుల్లో అత్యధికులు భారత్‌లో పుట్టిన వారే

లండన్: ఇంగ్లండ్, వేల్స్‌లో ఉండే ప్రతి ఆరుగురిలో ఒకరు విదేశాల్లో పుట్టిన వారే కాగా, ఇందులో 1.5 శాతంతో భారతీయులు అగ్రభాగంలో ఉన్నట్లు తేలింది. ఇంగ్లండ్, వేల్స్‌లోని నివాసితుల్లో విదేశాల్లో జన్మించిన వారు 2011లో 75 లక్షల మంది (13.4%) ఉండగా, 2021 నాటికి కోటి మంది (16.8%)కి చేరారని యూకే ఆఫీస్ ఆఫ్ నేషనల్ స్టాటిస్టిక్స్ (ఓఎన్ఎస్) గణాంకాలను వెలువరించింది. ఇంగ్లండ్, వేల్స్ నివాసితుల్లో యూకే వెలుపల జన్మించిన వారిలో అత్యధికులు 9.20 లక్షల మంది భారత్‌కు చెందిన వారే. ఆ తర్వాతి స్థానంలో 7.43 లక్షల మంది (1.2%)తో పోలండ్, 6.24 లక్షల మంది (1%)తో పాకిస్తాన్ మూడో స్థానంలో నిలిచాయి. 2011లో చేపట్టిన గణాంకాల్లోనూ భారత్, పోలండ్, పాకిస్తాన్‌లే మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయని తెలిపింది. కాగా, యూకేలోని స్కాట్లాండ్, నార్తర్న్ ఐర్లాండ్ ప్రాంతాల వివరాలను ఓఎన్ఎస్ పేర్కొనలేదు.

రిజర్వేషన్లపై 50% పరిమితి ఎత్తివేయాలి : నితీశ్ కుమార్

పట్నా: దేశంలో రిజర్వేషన్లపైనున్న 50% పరిమితిని ఎత్తివేయాలని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఆర్థికంగా వెనుకబడిన వారికి 10% కోటాను సమర్థించడంపై నితీశ్ హర్షం వ్యక్తం చేశారు. ''సుప్రీం కోర్టు తీర్పు చాలా న్యాయంగా ఉంది. రిజర్వేషన్లకు మేము ఎప్పుడూ అనుకూలమే. అయితే రిజర్వేషన్లపై 50% పరిమితిని ఎత్తివేయడానికి ఇదే సరైన సమయం. ఈ పరిమితి వల్ల ఓబీసీ, ఈబీసీలకు వారి జనాభాకి అనుగుణంగా అవకాశాలు రావడం లేదు'' అని అన్నారు. దేశవ్యాప్తంగా కులాల వారీగా జనాభా గణన చేపట్టాలని ఆయన పునరుద్ఘాటించారు. కుల గణన జాతీయ స్థాయిలో జరగాల్సిన అవసరం ఉందన్నారు.

పాపం మీది.. పరిహారమివ్వండి

- కాప్-27లో పేద దేశాల అధినేతల డిమాండ్

షెర్మ్-ఎల్-షేక్: భూతాపం, ప్రకృతి విపత్తులు, ఉత్పాతాలు.. వీటికి శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వినియోగించడం, పర్యావరణాన్ని నాశనం చేయడమే కారణం. ఈ పాపం సంపన్న, అభివృద్ధి చెందిన దేశాలదేనని పేద దేశాలు ఘోషిస్తున్నాయి. శిలాజ ఇంధనాలను అధికంగా ఉపయోగించే దేశాల కారణంగా తాము బాధితులుగా మారాల్సి వస్తోందని వాపోతున్నాయి. బడా దేశాలు, కార్పొరేట్ సంస్థలు నష్ట పరిహారం చెల్లించాలన్న డిమాండ్ ఊపందుకుంటోంది. ఈజిప్టులోని షెర్మ్-ఎల్-షేక్‌లో జరుగుతున్న కాప్-27లో పలుదేశాల నాయకులు ఈ డిమాండ్‌కు మద్దతుగా గళం విప్పుతున్నారు. విపత్తుల్లో నష్టపోతున్న పేద దేశాలకు న్యాయం చేయాలని మలావీ దేశాధ్యక్షుడు లాజరస్ చక్‌వెరియా అన్నారు. శిలాజ ఇంధన కంపెనీలు నిత్యం 3 బిలియన్ డాలర్ల లాభాలు ఆర్జిస్తున్నాయని ఆంటిగ్వా బార్బుడా ప్రధానమంత్రి గాస్టన్ బ్రౌనీ చెప్పారు. అందులో కొంత సొమ్మును పేద దేశాలకు పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూగోళాన్ని మండించి, సొమ్ము చేసుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంధన కంపెనీలు తమ లాభాల నుంచి గ్లోబల్ కార్బన్ ట్యాక్స్ చెల్లించాలన్నారు. మానవ నాగరికతను బలిపెట్టి లాభాలు పిండుకోవడం సరైంది కాదన్నారు. నష్టపరిహారం కోసం అవసరమైతే అంతర్జాతీయ కోర్టులను ఆశ్రయిస్తామని తేల్చిచెప్పారు. పెద్ద దేశాల నేతలు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ప్రతిఏటా కాప్‌కు సదస్సుకు హాజరై, ఘనంగా ప్రకటనలు ఇచ్చి వెళ్లిపోతున్నారని తప్ప ఆచరణలో ఏమీ చేయడం లేదని గాస్టన్ బ్రౌనీ ఆరోపించారు. వాతావరణ లక్ష్యాలను సాధించాలంటే చిన్న దేశాలపై విధించిన చట్టవిరుద్ధమైన ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలని జింబాబ్వే అధ్యక్షుడు ఎమర్సన్ మాంగాగ్వే పేర్కొన్నారు.



ఆంటిగ్వా బార్బుడా ప్రధానమంత్రి గాస్టన్ బ్రౌనీ

మడ అడవుల సంరక్షణలో సహకరిస్తాం

మడ అడవుల పునరుద్ధరణలో భారత్ నైపుణ్యం సాధించిందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ చెప్పారు. పర్యావరణానికి అత్యంత కీలకమైన మడ అడవుల సంరక్షణ కోసం గత ఐదు దశాబ్దాలుగా కార్యాచరణ కొనసాగిస్తోందని అన్నారు. ఈ విషయంలో ఇతర దేశాలకు సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. కాప్-27 సందర్భంగా యూఏఈ, ఇండోనేషియా ఆధ్వర్యంలో మాంగ్రూవ్ అలయెన్స్ ఫర్ క్లైమేట్(ఎంఏసీ)ని ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా మడ అడవుల పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం, కాపాడుకోవడం ఈ కూటమి లక్ష్యం. ఈ సందర్భంగా భూపేంద్ర మాట్లాడారు. ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్న లక్ష్యాన్ని సాధించడానికి మడ అడవుల సంరక్షణ అత్యంత కీలకమని సూచించారు. కర్బన ఉద్గారాల నిర్మూలన ఇలాంటి అడవులతో సాధ్యమవుతుందన్నారు. అండమాన్, సుందర్బన్స్, గుజరాత్ తీర ప్రాంతంలో మడ అడువుల విస్తీర్ణం పెరిగిందని వెల్లడించారు.

జి-20కి నాయకత్వం.. భారత్‌కు గర్వకారణం

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన
- జి-20 లోగో, థీమ్, వెబ్‌సైట్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ: అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న పెద్ద దేశాలతో కూడిన గ్రూప్-20(జి-20)కి నాయకత్వం వహించనుండడం భారత్‌కు గర్వకారణమని ప్రధాని మోదీ చెప్పారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవాల వేళ ఇది మనకు దక్కిన గొప్ప అవకాశామని అన్నారు. జి-20కి భారత నాయకత్వానికి సంబంధించిన లోగో, థీమ్, వెబ్‌సైట్‌ను మోదీ ఆవిష్కరించారు. 20 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలతో కూడిన ఈ గ్రూప్‌నకు ప్రస్తుతం ఇండోనేషియా నాయకత్వం వహిస్తోంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి నాయకత్వ బాధ్యతలను భారత్ స్వీకరించనుంది. దేశ అభివృద్ధి ప్రయాణాన్ని మోదీ ప్రస్తావించారు. స్వాతంత్ర్యం అనంతరం దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ప్రభుత్వాలు, ప్రజలు తమ వంతు పాత్ర పోషించారని చెప్పారు. ప్రజాస్వామ్యం అనేది ఒక సంస్కృతిగా రూపుదిద్దుకుంటే సంఘర్షణలకు తావు ఉండదన్న నిజాన్ని భారత్ ప్రపంచానికి చాటి చెప్పిందని పేర్కొన్నారు. దేశ సౌభాగ్యానికి అభివృద్ధి, పర్యావరణం (ప్రగతి, ప్రకృతి) కలిసికట్టుగా ముందుకు సాగాలని తెలిపారు. జి-20కి నేతృత్వం వహించే అవకాశం లభించడం భారతీయులందరికీ గర్వకారణమన్నారు. లోగో, థీమ్, వెబ్‌సైట్ మన ప్రాధాన్యతలను, సందేశాన్ని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు.

15, 16న బాలీలో శిఖరాగ్ర సదస్సు

జి-20లో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), అమెరికా, యూరోపియన్ యూనియన్(ఈయూ) సభ్యదేశాలుగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది జి-20 శిఖరాగ్ర సదస్సు ఇండోనేషియాలోని బాలీలో ఈ నెల 15, 16వ తేదీల్లో జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కానున్నారు.

మిత్రుల కోసమే నోట్ల రద్దు

- ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజం
- మహారాష్ట్రలో మొదలైన భారత్ జోడో యాత్ర

దెగ్లూర్: దేశ ఆర్థిక వ్యవస్థను శాసించే తన ఇద్దరు, ముగ్గురు బిలియనీర్ స్నేహితుల కోసమే ప్రధాని మోదీ నోట్ల రద్దును అమలు చేశారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ సందర్భంగా మోదీని పేపీఎం(పేటీఎంతో పోలుస్తూ)గా అభివర్ణించారు. నోట్ల రద్దుతో దేశంలోని చిన్న, మధ్య తరహా వ్యాపారాలు ఘోరంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర మంగళవారం మహారాష్ట్రలో మొదలైంది. నాందేడ్ జిల్లా దెగ్లూర్‌లోని గురుద్వారాను సందర్శించిన అనంతరం రాహుల్ యాత్రను ప్రారంభించారు. కన్యాకుమారిలో రెండు నెలల క్రితం మొదలైన యాత్ర శ్రీనగర్‌లో మువ్వన్నెల పతాకం ఎగురవేసే దాకా సాగుతుందని, తమను ఎవరూ ఆపలేరని రాహుల్ అన్నారు. దేశాన్ని ఐక్యంగా ఉంచడం, సమస్యలను ప్రజలకు వివరించడమే యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. జోడో యాత్రలో మంగళవారం అపశ్రుతి చోటుచేసుకుంది. యాత్రలో పాల్గొంటున్న సేవాదళ్ జనరల్ సెక్రటరీ కృష్ణ కుమార్ పాండే కుప్పకూలి పడిపోయారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పాండేకు రాహుల్ నివాళులర్పించారు. చివరి క్షణం వరకు జాతీయ జెండాను మోసిన అంకిత భావం గల వ్యక్తి అని శ్లాఘించారు.

'నోట్ల రద్దు'కు ఆరేళ్లు

- నల్లధనం అంతమైపోతుందన్న ప్రభుత్వం
- నగదు చెలామణి తగ్గుతుందని ధీమా
- ఆశించిన ఫలితం ఇవ్వని డిమానిటైజేషన్
- ఆరేళ్లలో 72 శాతం పెరిగిన 'చెలామణిలోని నగదు'

న్యూఢిల్లీ: సరిగ్గా ఆరేళ్ల క్రితం.. అంటే 2016 నవంబర్ 8న దేశంలో రూ.500, రూ.1,000 కరెన్సీ నోట్లు ఉన్నపళంగా రద్దయిపోయాయి. అనూహ్యంగా పెద్ద నోట్లను రద్దు (డిమానిటైజేషన్) చేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రధానంగా నల్ల ధనాన్ని అరికట్టడానికి, ఉగ్రవాదులకు నిధులు అందకుండా చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. అయితే, నోట్ల రద్దు దుష్ఫలితాలు బయటపడడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. డిమానిటైజేషన్ తర్వాత ఈ ఆరేళ్లలో ఏం జరిగిందో తెలుసుకుంటే నిరాశే మిగులుతుంది.

115 మంది బలి!

అప్పటిదాకా చెలామణిలో ఉన్న నోట్లు రద్దు కావడంలో వాటిని మార్చుకోవడానికి జనం బ్యాంకుల ముందు క్యూకట్టారు. బ్యాంకులు జనసందోహంతో కిటకిటలాడాయి. క్యూలో నిల్చొని 115 మంది చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. నోట్ల రద్దు వల్ల కరెన్సీ చెలామణి చాలావరకు తగ్గిపోతుందని, డిజిటల్ లావాదేవీలు పెరుగుతాయని అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవం మాత్రం మరోలా ఉంది. 2016 నవంబర్ 4న దేశంలో చెలామణిలో ఉన్న నగదు రూ.17.97 లక్షల కోట్లు కాగా, 2022 అక్టోబర్ 21 నాటికి రూ.30.88 లక్షల కోట్లకు చేరుకుంది. కేంద్రం ఇచ్చిన 'మాస్టర్‌స్ట్రోక్' తర్వాత 2016తో పోలిస్తే 2022లో నగదు చెలామణి 72 శాతం పెరగడం గమనార్హం.

పడిపోయిన జీడీపీ వృద్ధిరేటు

నగదు రహిత లావాదేవీలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. డిజిటల్ చెల్లింపు పద్ధతులు ఇబ్బడిముబ్బడిగా అందుబాటులోకి వచ్చాయి. అయితే, దేశంలో ఇప్పటికీ 15 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు లేవు. అనివార్యంగా నగదు లావాదేవీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. నోట్ల రద్దు వల్ల వ్యాపారాలు దారుణంగా దెబ్బతిన్నాయి. బడా బాబులపై పెద్దగా ప్రభావం కనిపించలేదు. సామాన్య జనం మాత్రం ఇక్కట్ల పాలయ్యారు. ఆర్థిక వ్యవస్థ పురోగతి మందగించింది. జీడీపీ వృద్ధి రేటు 1.5 శాతం పడిపోయింది. రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసిన ప్రభుత్వం వెంటనే కొత్తగా రూ.2,000, రూ.500 నోట్లను తీసుకొచ్చింది. డిమానిటైజేషన్ వల్ల ఎంతమేరకు నల్లధనం అంతమైపోయిందో కేంద్రం ఇప్పటికీ లెక్కలు చెప్పలేదు.

నేడు సుప్రీంకోర్టు విచారణ

పెద్ద నోట్ల రద్దు వ్యవహారాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది. డిమానిటైజేషన్‌పై అఫిడవిట్లు దాఖలు చేయాలని సుప్రీంకోర్టు గత నెలలో కేంద్ర ప్రభుత్వం,ఆర్‌బీఐకి ఆదేశాలు జారీ చేసింది. రూ.500, రూ.1,000 నోట్ల రద్దు నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై అక్టోబర్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.నజీర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేంద్రం, ఆర్‌బీఐకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 9కి వాయిదా వేసింది.

ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం

నోట్ల రద్దు రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ అడ్వొకేట్ వివేక్ నారాయణ్ శర్మ 2016 నవంబర్ 9న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే దేశవ్యాప్తంగా పలు హైకోర్టుల్లోనూ పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, అది చెల్లదని పిటిషన్లు పేర్కొన్నారు. వివేక్ నారాయణ్ శర్మ పిటిషన్‌పై అప్పటి సుప్రీంకోర్టు సీజే జస్టిస్ ఠాకూర్ నేతృత్వంలోని బెంచ్ స్పందించింది. హైకోర్టుల్లోనిపిటిషన్ల విచారణపై 2016లోస్టే విధించింది. వాటన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ఆదేశించింది. నోట్ల రద్దుకు వ్యతిరేకంగా దాఖలైన అన్ని పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగిస్తూ నాటి సీజే నిర్ణయం తీసుకున్నారు.

సంచలన ప్రకటన 15న: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మూడోసారి బరిలో దిగేందుకు ఉవ్విళ్లూరుతున్న మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ సోమవారం మధ్యంతర ఎన్నికల చివరి ప్రచార సభలో మాట్లాడారు. 'ఫ్లోరిడాలోని మార్-ఏ-లాగో రిసార్ట్‌లో నవంబర్ 15న సంచలన విషయాన్ని వెల్లడించబోతున్నాను' అని ఓహియో రాష్ట్రంలోని వాండలియా సిటీలో పార్టీ మద్దతుదారులనుద్దేశిస్తూ ప్రసంగించారు. తాను తప్పకుండా మూడోసారి పోటీకి దిగుతానని ఆదివారం సైతం మియామీలో జరిగిన బహిరంగ సభలో వ్యాఖ్యానించారు. అయితే, మధ్యంతర ఎన్నికలు ముగిసేదాకా ఆగాలని, ఆ తర్వాతే అధ్యక్ష ఎన్నికలపై మాట్లాడాలని రిపబ్లికన్ సీనియర్ నేతలు, ఆయన సన్నిహితులు ట్రంప్‌కు సలహాలు ఇస్తున్నారు. ముందే అధ్యక్ష అభ్యర్థిత్వంపై వ్యాఖ్యానాలు చేస్తే, మధ్యంతర ఎన్నికలు.. ట్రంప్ అభ్యర్థిత్వానికి రెఫరెండమ్‌గా మారే ప్రమాదముందని ట్రంప్‌కు హితవు పలికారు. అయినాసరే ట్రంప్ పలు మధ్యంతర ఎన్నికల ప్రచారసభల్లో తన అధ్యక్ష అభ్యర్థిత్వంపై వ్యాఖ్యానాలు చేస్తుండటం గమనార్హం.



అమెరికాలోని సౌత్ డకోటాలో జరిపిన తవ్వకాల్లో లభించిన టిరనోసారస్ రెక్స్ రాకాసిబల్లి కపాలమిది. న్యూయార్క్‌లో సోత్‌బీ సంస్థ దీన్ని డిసెంబర్‌లో వేలం వేయనుంది. ఇది దాదాపు 2.5 కోట్ల డాలర్ల ధర పలకొచ్చని అంచనా.

అద్వాణీకి 95 ఏళ్లు

న్యూఢిల్లీ: బీజేపీ కురువృద్ధ నేత లాల్ కృష్ణ అద్వాణీ మంగళవారం 95వ పుట్టిన రోజు జరుపుకున్నారు. ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ ట్విట్టర్‌లో..'దేశాభివృద్ధిలో ఆయన సేవలు చిరస్మరణీయం. దూరదృష్టి, మేధస్సు కలిగిన ఆయన దేశంలోని అన్ని వర్గాల ప్రజల గౌరవం పొందారు. బీజేపీని నిర్మించి, బలోపేతం చేయడంలో ఆయన కృషి ఎనలేనిది. అద్వాణీజీ ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని ప్రార్థిస్తున్నాను'అని పేర్కొన్నారు. ఎల్‌కే అద్వాణీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. 1927లో అవిభాజ్య భారత్‌లోని కరాచీలో జన్మించిన అద్వాణీ యువకునిగా ఉన్నప్పుడే ఆర్ఎస్ఎస్‌లో, అనంతరం జనసంఘ్‌లో సేవలందించారు. 1980లో బీజేపీ వ్యవస్థాపకుల్లో మాజీ ప్రధాని వాజ్‌పేయితోపాటు ఆయన కూడా ఉన్నారు. 1990లలో అయోధ్యలో రామాలయం కోసం రథ యాత్రను చేపట్టి దేశవ్యాప్తంగా బీజేపీ బలోపేతానికి కృషి చేశారు. అనంతర కాలంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. వాజ్‌పేయి ప్రధాని కాగా, హోంమంత్రిగా అద్వాణీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఉపప్రధానిగానూ వ్యవహరించారు.

వచ్చేవారమే నింగిలోకి తొలి ప్రైవేట్ రాకెట్

- ఈ నెల 12-16 మధ్య 'విక్రమ్-ఎస్' ప్రయోగం!
- అభివృద్ధి చేసిన హైదరాబాద్ కంపెనీ స్కైరూట్ ఏరోస్పేస్



న్యూఢిల్లీ: భారత్‌లో అంతరిక్ష ప్రయోగాల విషయంలో నూతన అధ్యాయం ప్రారంభం కాబోతోంది. దేశంలో ప్రైవేట్ రంగంలో అభివృద్ధి చేసిన మొట్టమొదటి రాకెట్ 'విక్రమ్-ఎస్' ప్రయోగాన్ని వచ్చే వారమే చేపట్టబోతున్నారు. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈ నెల 12-16 తేదీల మధ్య ఈ ప్రైవేట్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మొత్తం ప్రయోగానికి 'ప్రారంభ్ మిషన్' అని నామకరణం చేశారు. విక్రమ్-ఎస్ రాకెట్‌ను హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ అనే ప్రైవేట్ స్టార్టప్ కంపెనీ అభివృద్ధి చేసింది. ప్రైవేట్ రంగంలో రాకెట్‌ను అభివృద్ధి చేసి, ప్రయోగిస్తుండడం దేశంలో ఇదే మొదటిసారి కావడం విశేషం. విక్రమ్-ఎస్ రాకెట్ మూడు పేలోడ్లను అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. ఇందులో విద్యార్థులు తయారు చేసిన 2.5 కిలోల పేలోడ్ సైతం ఉంది. స్పేస్ కిడ్స్ ఇండియా కార్యక్రమంలో భాగంగా దీనిని తయారు చేశారు.

'ఇన్-స్పేస్' క్లియరెన్స్

దేశంలో అంతరిక్ష సాంకేతికరంగ నూతన సంస్థలకు ప్రోత్సాహం, నియంత్రణలకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 'ఇన్-స్పేస్' సంస్థ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది. ప్రైవేట్ విక్రమ్-ఎస్ రాకెట్ ప్రయోగానికి ఇన్-స్పేస్ నుంచి ఇప్పటికే క్లియరెన్స్ లభించింది. ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ ఈ నెల 12-16 మధ్య ప్రయోగం చేపట్టే వీలున్నట్లు స్కైరూట్ ఏరోస్పేస్ బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రతినిధి శిరీష్ పల్లికొండ మంగళవారం తెలిపారు. ప్రారంభ్ మిషన్‌ను ఆరంభిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి ప్రయోగ తేదీని ఖరారు చేస్తామని స్కైరూట్ ఏరోస్పేస్ సీఈఓ పవన్‌కుమార్ చందన వెల్లడించారు. స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీ మూడు వేరియంట్లలో విక్రమ్ రాకెట్‌ను డెవలప్ చేస్తోంది. విక్రమ్-1 రాకెట్ 480 కిలోల పేలోడ్‌ను తక్కువ ఎత్తు ఉన్న కక్ష్యలోకి మోసుకెళ్లగలదు. విక్రమ్-2 595 కిలోలు, విక్రమ్-3 815 కిలోల పేలోడ్‌ను భూమి నుంచి 500 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలోకి మోసుకెళ్తాయి.

రాష్ట్రాల్లో దశలవారీగా ఉమ్మడి పౌర స్మృతి: నడ్డా

షిమ్లా(హిమాచల్ ప్రదేశ్): ఉమ్మడి పౌర స్మృతి దశలవారీగా ఒక్కో రాష్ట్రంలో అమలుచేస్తూ ముందుకు తీసుకెళ్తామని బీజేపీ అధ్యక్షులు జేపీ నడ్డా స్పష్టంచేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు సందర్భంగా పీటీఐకి నడ్డా ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు కొన్ని ఆయన మాటల్లోనే.. 'హిమాచల్‌లో పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ హామీ ఇస్తోంది. అవన్నీ నమ్మకండి. పాత పెన్షన్ విధానానికి సంబంధించిన సమస్యలను సహేతుకంగా పరిష్కరిస్తాం. పటిష్టమైన ప్రచార కార్యక్రమాల ద్వారా పార్టీ రెబల్స్‌ను 'తటస్థీకరిస్తాం'. అభ్యర్థులను చూసి కాకుండా పార్టీ కోసం ఓటు వేసేలా చేస్తాం. సాధికారత కోసం శ్రమిస్తాం. ఉచిత హామీలకు మేం దూరంగా ఉంటాం. ప్రతీ ఎన్నికలను మేం సీరియస్‌గా తీసుకుంటాం. కాంగ్రెస్ వారి ఉచితహామీలను హిమాచల్ ప్రజలు నమ్మరు. రాష్ట్ర ఖజానా పరిస్థితి ప్రజలకు తెలుసు. అందుకే కాంగ్రెస్‌ను వారు సీరియస్‌గా తీసుకోరు' అని నడ్డా అన్నారు. స్థానిక ఎన్నికలకు సైతం మోదీ పేరు చెప్పే ప్రచారం చేస్తారనే కాంగ్రెస్ విమర్శపై స్పందించారు. 'పార్టీలో అత్యున్నత ప్రజాదరణ గల నేత ఆయన. ఆయనకు ఎవరూ సాటిరాలేరు' అని అన్నారు.

ఆమే కీలకం

- హిమాచల్ ప్రదేశ్‌లో మహిళా ఓటర్లను ఆకర్షించే వ్యూహాలు
- పోటీపడి హామీలు గుప్పించిన ప్రధాన పార్టీలు

హిమాచల్ ప్రదేశ్. పర్యాటకమే ప్రధాన ఆదాయ వనరు. ఆ రాష్ట్రంలో ఏ మూలకి వెళ్లినా రోడ్డుపక్కన టీ కొట్టుల్లో, ఆలయాల వద్ద, ఇతర ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో మహిళలే వ్యాపారాలు చేస్తూ కనిపిస్తారు. ఆర్థిక స్వాతంత్ర్యం రాజకీయ చైతన్యం ఇష్టపడే మహిళలు ఎక్కువగా ఉన్న ఏకైక రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్. అందుకే ప్రధాన పార్టీలన్నీ మహిళా ఓటర్లపై గాలం వేస్తున్నాయి.

హిమాచల్ ప్రదేశ్‌లో రెండు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మహిళా ఓటర్లను ఆకట్టుకునే వ్యూహాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాయి. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించడంలో మహిళలు అత్యంత కీలకంగా మారారు. రాష్ట్ర జనాభాలో 49% మంది మహిళలే ఉన్నారు. 1998 నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని విశ్లేషిస్తే పురుషుల కంటే మహిళలే అధిక సంఖ్యలో ఓట్లు వేశారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 55,92,828 ఉంటే వారిలో పురుష ఓటర్లు 28,54,945, మహిళా ఓటర్లు 27,37,845, థర్డ్ జెండర్ ఓటర్లు 38 ఉన్నాయి. స్త్రీ, పురుష ఓటర్ల నిష్పత్తి జాతీయ సగటు కంటే హిమాచల్ ప్రదేశ్‌లో అధికం. ప్రతీ వెయ్యి మంది పురుషులకు జాతీయ స్థాయిలో 976 మంది మహిళలు ఉంటే హిమాచల్ ప్రదేశ్‌లో 981 మంది ఉన్నారు. 18 నియోజకవర్గాల్లో లింగ నిష్పత్తి వెయ్యి దాటి ఉండడం విశేషం. '' అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దేవేష్ కుమార్ వ్యాఖ్యానించారు.

పోటీ పడి హామీలు

అధికార బీజేపీ మహిళా ఓటర్లను ఆకర్షించడానికి ప్రత్యేక మేనిఫెస్టో స్త్రీ సంకల్ప పత్ర విడుదల చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు, నిరుపేద కుటుంబాలకు చెందిన అమ్మాయిలకు పెళ్లయ్యే సమయంలో రూ.51 వేల ఆర్థిక సాయం, ప్రాథమిక విద్య అభ్యసించే బాలికలకు ఉచిత సైకిళ్లు, ఉన్నత విద్య అమ్మాయిలకు స్కూటీలు, మహిళా సాధికారత సాధించడానికి వడ్డీ లేని రుణాలు ఇవ్వడానికి రూ.500 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు, ఆశావర్కర్ల జీతం రూ.4,700కి పెంపు వంటి హామీలు గుప్పించింది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల పథకం కింద 1.36 లక్షల ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లు, రాష్ట్రస్థాయిలో గ్రామీణ సువిధ యోజన కింద 3.24 లక్షల గ్యాస్ కనెక్షన్ల పంపిణీతో మహిళలు పొగ ముప్పు నుంచి విముక్తి చెందారని, తొలి స్మోక్ ఫ్రీ రాష్ట్రంగా హిమాచల్ ప్రదేశ్ నిలిచిందని ఆ పార్టీ ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో 18 ఏళ్ల వయసు పైబడిన మహిళలందరికీ హర్ ఘర్ లక్ష్మి నారి సమ్మాన్ నిధి పథకం కింద నెలకి రూ.1500 ఇస్తామని ప్రకటించింది. ''ఉన్నత విద్య అభ్యసించలేని యువతులు కానివ్వండి, సింగిల్ మదర్లు, వితంతువులు ఇలా అవసరం ఉన్న మహిళలందరికీ రూ.1500 బ్యాంకులో పడతాయి. వారికి ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తుంది'' అని కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యే ఆశాకుమారి చెప్పారు. అంతకు ముందే ఆప్ తాము అధికారంలోకి వస్తే నెలకి వెయ్యి రూపాయల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చింది.

ప్రాతినిధ్యం ఏది ?

మహిళా ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించే పార్టీలు వారికి టికెట్ ఇవ్వడానికి మాత్రం ముందుకు రావడం లేదు. 68 స్థానాలున్న అసెంబ్లీలో గత సారి కేవలం నలుగురు మాత్రమే మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ సారి బీజేపీ ఆరుగురికి టికెట్ ఇస్తే, కాంగ్రెస్ పార్టీ కేవలం ముగ్గురుకి మాత్రమే ఇచ్చింది. తొలిసారిగా ఎన్నికల బరిలో నిల్చొన్న ఆమ్ ఆద్మీ పార్టీ ఆరుగురికి టికెట్లు ఇచ్చింది. 1998లో తొలిసారిగా ఆరుగురు మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి ఎన్నికై రికార్డు నెలకొల్పారు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో 338 అభ్యర్థులు పోటీ పడితే వారిలో 19 మంది మాత్రమే మహిళలు. వారిలో నలుగురు అసెంబ్లీకి ఎన్నికయ్యారు.



6% ఎక్కువగా మహిళల ఓటింగ్

హిమాచల్ ప్రదేశ్‌లో మహిళా అక్షరాస్యత ఎక్కువ. ఓటు ఎంత విలువైనదో వారికి బాగా తెలుసు. సామాజికంగా, రాజకీయంగా, మతపరంగా ఎంతో అవగాహనతో ఉంటారు. అందుకే పురుషుల కంటే మహిళలే ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు తరలవచ్చి ఓట్లు వేస్తారు. గత 20 ఏళ్లుగా పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 6 శాతం అధికంగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు.

ఓటింగ్‌లో ఎవరెంత ? (శాతంలో)

ఎన్నికలు	మహిళలు	పురుషులు
2017	77.92	71.6
2012	76.20	69.39
2007	74.01	68.36
2003	75.92	73.14
1998	72.21	70.26

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్‌ జిల్లా

బుధవారం । 9 । నవంబర్‌ । 2022



సీహెచ్‌సీలో కేంద్ర బృందం

కంకిపాడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. రూ.4.60 కోట్లతో నిర్మిస్తున్న నూతన భవనాన్ని పరిశీలించింది



ముగిసిన ఉత్సవాలు

మచిలీపట్నంటౌన్‌: శ్రీ పాండురంగస్వామి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయ వంశపారంపర్య నిర్వాహకుడు టేకి నరసింహం పర్యవేక్షణలో గోపాలకాల ఉత్సవం జరిగింది.



ఘనంగా గురునానక్‌ జయంతి

గాంధీనగర్‌: గురునానక్‌ జయంత్యుత్సవాలను మంగళవారం సిక్కులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మందిరాలను పూలతో అలంకరించి, కీర్తనలు ఆలపించారు.

న్యూస్‌రీల్‌

కృష్ణా వర్సిటీ పీజీ ఫలితాలు విడుదల



మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ పోస్ట్‌ గ్రాడ్యుయేషన్‌ ఫలితాలను కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినర్‌ డాక్టర్‌ బ్రహ్మాచారితో కలిసి వైస్‌ చాన్సలర్‌ చంద్రశేఖర్‌ మంగళవారం విడుదల చేశారు. పీజీ (గణితం), ఎంబీఏ, ఎంసీఏ నాలుగో సెమిస్టర్‌ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోల్‌ ఆఫ్‌ ఎగ్జామినర్‌ డాక్టర్‌ బ్రహ్మాచారి తెలిపారు. ఫలితాల కోసం యూనివర్సిటీ వెబ్‌ సైట్‌ను విద్యార్థులు సందర్శించాలని సూచించారు. పరీక్ష ఫలితాలను సకాలంలో విడుదల చేసేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని వైస్‌ చాన్సలర్‌ చంద్రశేఖర్‌ అభినందించారు. పీజీ పరీక్షల విభాగం కో–ఆర్డినేటర్‌ డాక్టర్‌ సుశీల, క్యాంపస్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మారుతి, జయలక్ష్మి, పరీక్ష విభాగం సిబ్బంది పాల్గొన్నారు

అండర్‌–15 క్రికెట్‌ బాలికల జిల్లా జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్‌: ఆంధ్రా క్రికెట్‌ అసోసియేషన్‌(ఏసీఏ) సెంట్రల్‌ జోన్‌ అంతర్‌ జిల్లాల అండర్‌–15 క్రికెట్‌ బాలికల పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అడహాక్‌ కమిటీ కన్వీనర్‌ ఎం.రవిశంకర్‌ మంగళవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఎండీ మెహక్‌ (కెప్టెన్‌), కె.కీర్తి, బి.చైత్ర, బి.తనిశిసాయి, ఎస్‌.లావణ్యశృతి, పి.లక్ష్మీఅపర్ణ, ఆర్‌.ఇషికామయి, ఎస్‌.నిఖిత, టి.ప్రన్విత, ఆర్‌.రోహిణి, టి.నాగచంద్రిక, సయ్యద్‌ ఉజ్మా, పి.హుమేరా, టి.విజయలక్ష్మి, టి.మేఘన జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ జట్టు ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగే ఏసీఏ సెంట్రల్‌ జోన్‌ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

42,433 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్‌ యార్డుకు మంగళవారం 41,754 మిర్చి బస్తాలు రాగా, నిల్వలతో కలిపి ఈ–నామ్‌ విధానంలో 42,433 బస్తాలు విక్రయించారు. నాన్‌ ఏసీ కామన్‌ రకం 334, నంబర్‌–5, 273, 341, 4884, సూపర్‌–10 రకాల మిర్చి సగటు ధర రూ.8 వేల నుంచి రూ.28,500 వరకు పలికింది. నాన్‌ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్‌ రకాలకు సగటు ధర రూ.7 వేల నుంచి రూ.27,500 వరకు, తాలు రకానికి రూ.4,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది.

జీఎస్టీకి టోపీ

- వన్‌టౌన్‌లో కనిపించని జీఎస్టీ పన్నుల వృద్ధి
- జీరో దందాపై దృష్టి సారించిన అధికారులు
- ఇటీవల 10 బృందాలతో ఆకస్మిక తనిఖీలు
- పన్ను ఎగవేతలపై ప్రాథమికంగా నిర్ధారణ
- మరిన్ని దాడులు చేసేందుకు ప్రణాళికలు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ వన్‌టౌన్‌లో వ్యాపారాలు జోరుగా సాగుతున్నప్పటికీ పన్నుల ఆదాయం మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. అదే సమయంలో ఇతర ప్రాంతాల్లో మాత్రం పన్నుల వృద్ధి కనిపిస్తోంది. వన్‌టౌన్‌లో ఇలా ఎందుకు జరుగుతోంది అన్న అనుమానం జీఎస్టీ అధికారులకు వచ్చింది. జీఎస్టీ ఆదాయం తక్కువగా ఎందుకు ఉందో తేల్చాలని, వ్యాపారులు జీరో దందాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అక్టోబర్‌ 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు సరుకులు రవాణా చేసే వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా బిల్లులు లేకుండా రిటైల్‌, హోల్‌సేల్‌ షాపులకు ఇతర రాష్ట్రాల నుంచి వాహనాల ద్వారా సరుకుల రవాణా భారీగా జరుగుతోందని గుర్తించారు. ఈ సరుకు రవాణా సమయంలో ట్రాన్స్‌పోర్టర్లకు వ్యాపారులు నగదు ఇచ్చి బిల్లులు లేకుండా వ్యవహారం సాగిస్తున్నారని గుర్తించారు. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా విజయవాడ ఒకటో డివిజన్‌ పరిధిలో హోల్‌సేల్‌ వర్తకుల వాణిజ్య సముదాయాలపై ఏకకాలంలో పది బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేశారు. రాష్ట్ర పన్నుల ప్రధాన అధికారుల ఆదేశాల మేరకు విజయవాడ రీజనల్‌ అడిషనల్‌ కమిషనర్‌ (రాష్ట్ర పన్నులు) ఆధ్వర్యంలో ఈ దాడులు సాగాయి. ఈ బృందాలను జాయింట్‌ కమిషనర్‌ స్థాయి అధికారులు పర్యవేక్షించారు. ప్రధానంగా ఐరన్‌ అండ్‌ స్టీల్‌, విద్యుత్‌, డ్రై ఫ్రూట్స్‌, ఫ్లై ఉడ్‌, సుంగధ ద్రవ్యాలు, మెడికల్‌ వస్తువులకు సంబంధించి హోల్‌సేల్‌ దుకాణాల్లో తనిఖీలు చేశారు.



విజయవాడలోని ఓ ఐరన్‌షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న వాణిజ్య శాఖ ఉద్యోగులు

బిల్‌ లేకుండానే వస్తువులు

పలువురు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి బిల్లు లేకుండా, వస్తువు విలువ కన్నా తక్కువ విలువతో కూడిన బిల్లులు (అండర్‌ బిల్లింగ్‌)తో విజయవాడకు సరుకులు తెచ్చి విక్రయాలు సాగిస్తున్నారని అధికారులు తమ దాడుల్లో గుర్తించారు. ఇతర ప్రాంతాల్లో పన్నుల అభివృద్ధి కనిపించినా ఒకటో డివిజన్‌లో తక్కువ వృద్ధి ఉండటానికి పన్నుల ఎగవేతే కారణమని నిర్ధారించారు. ఇన్‌పుట్‌ ట్యాక్స్‌ బోగస్‌ బిల్లులపై క్లెయిమ్‌ ప్రధానంగా ఐరన్‌ అండ్‌ స్టీల్‌, విద్యుత్‌, ఫ్లై ఉడ్‌ తదితర వస్తువుల కొనుగోళ్లపై పొందినట్లు ప్రాథమిక విచారణ వెల్లడయిందని సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్ర కేంద్ర కార్యాలయ అధికారులు సెన్సిటివ్‌ గూడ్స్‌ కొనుగోళ్ల, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పన్నుల ఎగవేతకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే వ్యాపారులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పన్ను ఎగవేతను సీరియస్‌గా తీసుకొన్న ప్రభుత్వం మరిన్ని దాడులు చేసేందుకు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. డిపార్ట్‌మెంట్‌, బిజినెస్‌ అనలిటిక్స్‌, లాన్‌లైన్‌ ఈ–వే బిల్లు పోర్టర్‌ సమాచారం, జీఎస్‌టీఎన్‌ నెట్‌వర్క్‌ రిపోర్టుల ఆధారంగా వ్యాపార సమాచారం సేకరిస్తూ, ఎగవేతకు పాల్పడుతున్న వారిని గుర్తించి ప్రస్తుతం దాడి చేసినట్లు తెలిసింది. నగదు లావాదేవీలు ఎక్కువగా ఉన్నా, వ్యాపారుల రికార్డులకు, వాస్తవంగా ఉన్న సరుకు నిల్వలకు భారీ తేడాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు.



జీరో దందాపై నిఘా

పన్నులు ఎగవేసి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. డీలర్లు సైతం వారికి ఏమైనా ఇబ్బందులు ఉంటే నన్ను కలిసి చెబితే పరిష్కారానికి కృషిచేస్తా. మా శాఖ ఉద్యోగులు ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే నాకు సమాచారం ఇవ్వొచ్చు. జీరో దందా, అక్రమ వ్యాపారాల వివరాలు తెలిసిన వారు ఆ సమాచారాన్ని నా దృష్టికి తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. – కృష్ణమోహన్‌రెడ్డి, విజయవాడ రీజియన్‌ అడిషనల్‌ కమిషనర్‌

దుర్గగుడి మూసివేత



దుర్గగుడిని మూసివేస్తున్న వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి, శంకరశాండిల్య, ఈఓ భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): చంద్ర గ్రహణం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయంతో పాటు ఇతర ఉపాలయాలను మంగళవారం మూసివేశారు. వేకువ జామున అమ్మవారికి సుప్రభాత సేవ, ఖడ్గమాలార్చన, రుద్రహోమం, చండీ హోమం నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లతో పాటు ఉపాలయాల్లో కొలువై ఉన్న దేవతామూర్తులకు మహా నివేదన సమర్పించారు. అనంతరం ఎనిమిది గంటలకు ఆలయ ద్వారాలను మూసివేశారు. ఆలయ ప్రధాన ద్వారాలను వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, శంకరశాండిల్య మూసివేశారు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణం చంద్ర గ్రహణం కారణంగా నిర్మానుష్యంగా మారింది. సాయంత్రం 6.30 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచిన అర్చకులు సంప్రోక్షణ, ఆలయ శుద్ధి అనంతరం అమ్మవారికి స్నపనాభిషేకం నిర్వహించారు. అమ్మ వారి అలంకరణ, నివేదన, హారతి అనంతరం ఆలయ ద్వారాలను తిరిగి మూసివేశారు. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారి సుప్రభాత సేవ, అనంతరం ఖడ్గమాలార్చన ఇతర ఆర్జిత సేవలు యథావిధిగా జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్‌ బడ్జెట్‌కు ఆమోదం



వీసీ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీలో ఉపకులపతి, వర్సిటీ స్పోర్ట్స్‌ బోర్డ్‌ చైర్మన్‌ ఆచార్య కె.బి.చంద్రశేఖర్‌ అధ్యక్షతన మంగళవారం వర్సిటీ స్పోర్ట్స్‌ బోర్డ్‌ సమావేశం జరిగింది. రూ.40 లక్షలతో స్పోర్ట్స్‌ వార్షిక బడ్జెట్‌ ఆమోదించి, వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వైస్‌ చాన్సలర్‌ చంద్రశేఖర్‌.. మాట్లాడుతూ వర్సిటీలోని విద్యార్థులను క్రీడలలో నైపుణ్యం సాధించే దిశగా, కేంద్ర రాష్ట్రస్థాయిలో వివిధ టోర్నీల్లో పాల్గొని వర్సిటీకి పేరు ప్రఖ్యాతలు సాధించే విధంగా ప్రోత్సహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. వర్సిటీ రిజిస్ట్రార్‌, స్పోర్ట్స్‌ బోర్డ్‌ ట్రెజరర్‌ డాక్టర్‌ ఎం.రామిరెడ్డి మాట్లాడుతూ.. క్యాలెండర్‌లో పొందుపరిచిన ప్రతి కార్యక్రమాన్నీ వినూత్నంగా రూపొందించి నిర్వహించాలని సూచించారు. వర్సిటీ రెక్టార్‌ ఆచార్య డి.సూర్యచంద్రరావు, స్పోర్ట్స్‌ బోర్డ్‌ కన్వీనర్‌, సెక్రటరీ డాక్టర్‌ ఆర్‌.కిరణ్‌కుమార్‌, హైదరాబాద్‌ జేఎన్టీయూ నుంచి, విజయవాడ చుట్టుపక్కల కళాశాలలకు సంబంధించి ఈస్ట్‌ జోన్‌ ,వెస్ట్‌ జోన్‌ కమిటీ చైర్మన్లు, కన్వీనర్లు, పలువురు మెంబర్లు కూడా పాల్గొని భవిష్యత్‌ కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్‌ చంద్రశేఖర్‌ను కమిటీ సభ్యులు సత్కరించారు.

నేడు బీఎస్‌ఎన్‌ఎల్‌ మెగా మేళా

మధురానగర్‌ (విజయవాడ సెంట్రల్‌): ఉమ్మడి కృష్ణా జిల్లాలో బుధవారం బీఎస్‌ఎన్‌ఎల్‌ మెగా మేళా నిర్వహించనున్నట్లు సంస్థ విజయవాడ బిజినెస్‌ ఏరియా జనరల్‌ మేనేజర్‌ వై.రవీంద్రనాథ్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో కొత్త ల్యాండ్‌లైన్‌, బ్రాడ్‌బ్యాండ్‌, ఎఫ్‌టీటీహెచ్‌ కనెక్షన్‌లతో పాటు బీఎస్‌ఎన్‌ఎల్‌ ఫ్రీ మొబైల్‌ సిమ్‌కార్డులు లభిస్తాయని పేర్కొన్నారు. మెగా మేళాలో బీఎస్‌ఎన్‌ఎల్‌ ఫ్రాంచైజీలు ఉచితంగా బీఎస్‌ఎన్‌ఎల్‌ సిమ్‌లను ఇవ్వడంతోపాటు ఆకర్షణీయమైన తొలి రీచార్జ్‌ సదుపాయం అందజేస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెండి మకరతోరణాలు సమర్పణ



ఆలయ కమిటీ చైర్మన్‌కు వెండి మకరతోరణం అందజేస్తున్న భక్తులు

బంటుమిల్లి (పెడన): మండలంలోని పెదతుమ్మిడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని ప్రధాన మూర్తులకు పలువురు భక్తులు వెండి మకరతోరణాలు, చీర సమర్పించారు. స్వామి, అమ్మవారికి వేర్వేరుగా తయారు చేయించిన వెండి మకరతోరణాలు, వెండితో చేసిన చీరను కార్తిక పూర్ణిమ సందర్భంగా మంగళవారం ధర్మకర్తల మండలి చైర్మన్‌ మట్టా విజయలక్ష్మికి అందజేశారు. వీటి విలువ సుమారు రూ.8 లక్షలు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ మట్టా నాగబాబు, కార్యదర్శి లక్కాప్రగడ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో కార్తిక సందడి




హంసలదీవి సాగరతీరంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



మంగినపూడిలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని మచిలీపట్నం మండలంలోని మంగినపూడి, కోడూరు మండలంలోని హంసలదీవి సముద్ర తీరాలకు భక్తులు తరలివచ్చారు. మంగళవారం వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సముద్రుడికి పసుపు, కుంకుమ, పూలను సమర్పించిన అనంతరం స్నానాలు ఆచరించారు. మంగినపూడిలో తెల్లవారుజాము 4.30 గంటలకు డ్వామా పీడీ జి.వి.సూర్యానారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి స్నానాలను ప్రారంభించారు. - సాక్షి నెట్‌వర్క్‌

అరుణ చంద్రుడు



దుర్గగుడి రాజగోపురం వద్ద చంద్రగ్రహణ దృశ్యం

ఆకాశం అరుణవర్ణ శోభితమైంది. కార్తిక పౌర్ణమి విశిష్టత నేపథ్యంలో మంగళవారం రాత్రి ఏర్పడిన చంద్ర గ్రహణం ఆకట్టుకుంది. జిల్లాలో సాయంత్రం 6.10 నుంచి 6.50 గంటల వరకు చంద్రుడు బ్లడ్‌మూన్‌గా దర్శనమిచ్చాడు. గ్రహణం వీడిన అనంతరం పూర్ణ చంద్రుడు ఆవిష్కృతం కావడంతో అంతటా పండు వెన్నెల పరుచుకుంది. ఈ గ్రహణ విడుపును వీక్షించేందుకు పలువురు ఆసక్తి చూపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, విజయవాడ

బసవయ్యలెందరో...

‘నన్ను చూసి రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చేశారు. నేనే బ్రాండ్‌. నాదే ఇమేజ్‌. ప్రపంచ స్థాయి రాజధాని అమరావతి నిర్మాణం నా కల. ఆ కలలు పటాపంచలవుతున్నాయ’ని నిత్యం వాపోయే చంద్రబాబు, ఆయన ప్రభుత్వం గుంటూరు జిల్లా తుళ్లూరు, మంగళగిరి మండలాల్లోని 29 గ్రామాల పరిధిలో ఎన్నెన్ని అరాచకాలు చేసిందో, గ్రామీణుల మధ్య ఎంతెంత అగాధాలను సృష్టించిందో కళ్లారా చూసినా, చెవులారా విన్నా ‘రియల్‌’ వ్యవహారాలు బట్టబయలవుతాయి. ఒక్కో ఊరిది ఒక్కో కథ. ఒక్కో కుటుంబానిది ఒక్కో వ్యథ. బాబుకు ఆయన ‘రియల్‌’ బృందానికి కులం లేదు, మతం లేదు, గ్రామం లేదు. అప్పట్లో భూమి ఇచ్చారా? లేదా? అన్నదే ముఖ్యం. ఇచ్చేస్తే సరి. లేదంటే అంతే మరి.. అన్నట్లుగానే చర్యలు కొనసాగాయి.

– సాక్షి ప్రత్యేక ప్రతినిధి

- భూమి ఇవ్వనన్నందుకు పళ్లు ఊడగొట్టారు
- అభిప్రాయాలు చెప్పినందుకు 61 సార్లు అరెస్టు
- 1.20 ఎకరాల్లో 34 సెంట్లు తగ్గించేశారు
- భూమి తీసుకున్నారు.. కౌలూ ఇవ్వలేదు
- ఉన్న ఇంటిని కూలదోయమన్నారు
- రూ.35 లక్షలు విలువచేసే స్థలం అమ్ముకుని పోరాడుతున్నా..
- రాజధాని పర్వంలో ఓ దీనుడి వ్యథార్థ గాథ



విజయవాడ సీఆర్డీఏ కార్యాలయం వద్ద రైతు బండ్ల బసవయ్య

ఇదిగో ఈ ఫోటోలోని వ్యక్తిని చూశారుగా. బండ్ల బసవయ్య. ఈయనది తుళ్లూరు మండలం అనంతవరం గ్రామం. భూగాథను, శారీరక వ్యథను ఆయన మాటల్లోనే విందాం. మా నాన్న బండ్ల ప్రకాశరావు. శివరామకృష్ణయ్య నా సోదరుడు. వారసత్వంగా మా ఇద్దరికి రెండు చోట్ల ఎకరం 20 సెంట్లు సంక్రమించింది. ఎత్తిపోతల పథకం కింద మెట్ట. రాజధాని నిర్మాణానికి భూములు ఇవ్వాలంటూ భూసేకరణకు టీడీపీ సర్కారు ప్రకటన జారీ చేసింది. నాతో సహా మా గ్రామానికి చెందిన 46 మంది సుమారు 500 ఎకరాలు ఇవ్వడానికి ఇష్టపడలేదు. అప్పటి మంత్రులు పి.నారాయణ, పి.పుల్లారావు, ఎమ్మెల్యే శ్రావణ్‌ కుమార్‌, టీడీపీకి చెందిన మండల, గ్రామ స్థాయి నాయకులు అధికా రులు, పోలీసులను వెంటపెట్టుకుని నిత్యం రాజధాని గ్రామాల్లో తిరుగుతూ భూసమీకరణకు సామ, దాన, భేదదండోపాయాలన్నీ ప్రయోగించేవారు. చివరకు నా మిత్రులు నయాన, భయాన చెప్పడంతో మా భూమిని ఇవ్వడానికి అంగీకరించక తప్పలేదు.

కొలతల పేరిట అంతా మాయే...

అనంతవరంలోని సర్వే నెంబరు 217లో బండ్ల, ఎడ్లూరి కుటుంబీకులకు 12.68 ఎకరాలు ఉంది. డాక్యుమెంట్ల ప్రకారం తండ్రి, కొడుకుకు కలిపి 2.03 ఎకరాలు ఉండగా సర్వేలో మతలబులు చేసి 2.20 ఎకరాలు ఉన్నట్లు రికార్డులు సృష్టించారు. వారిరువురికి 17 సెంట్లు అదనంగా చేరింది. ఇదేవిధంగా మరొకరికి 17 సెంట్లు కలిపేశారు. మొత్తం మీద మా అన్నదమ్ములకు ఉన్న 1.20 ఎకరాలలో.. ప్రభుత్వం ఇచ్చిన అవార్డు నోటిఫికేషన్‌ ప్రకారం 25 సెంట్లు, కొలతల్లో 30 సెంట్లు, తుదిగా 34 సెంట్లు తగ్గిపోయినట్లు రికార్డుల పరంగా చూపారు.

రూ.కోటి 30 లక్షలు పోయినట్లే...

ఎత్తిపోతల పథకం కింద సాగుభూమి ఎకరం ధర రూ.15 లక్షలు. రాజధాని పేరిట చంద్రబాబు చెప్పిన ప్రకారం రూ.4 కోట్లు పలికింది. ఆ చొప్పున 34 సెంట్లు తగ్గినందుకుగాను రమారమి రూ.1.30 కోట్లను మేం కోల్పోయాం.

న్యాయస్థానాల్లో పోరాటం..

భూసమీకరణ ప్రకటనను నిలిపేయాలని 2016లో హైకోర్టుకు వెళ్లా. తప్పుడు కొలతలతో భూమిని తగ్గించేశారని, న్యాయం కోరుతూ 2018లో మంగళగిరి కోర్టును ఆశ్రయించా. ఈ వ్యాజ్యం నడుస్తోంది.

కౌలూ ఇవ్వలేదు...

మా భూమిని తీసేసుకున్నారు. సరిహద్దులన్నీ చెరిపేశారు. కనీసం కౌలు కూడా ఇవ్వలేదు. గత ఎనిమిదేళ్లుగా లెక్కగడితే మా అన్నదమ్ములకు రూ.పది లక్షలకు పైగా కౌలు రావాల్సి ఉంది. మా భూమిని పొందిన వారు కొంత అమ్ముకున్నారు. కౌలూ పొందుతున్నారు. మేం మాత్రం అన్యాయమైపోయాం.

61 సార్లు స్టేషన్‌కు తీసుకెళ్లి... నరకం చూపి... పళ్లు రాలగొట్టి...

పశ్చిమబెంగాల్‌తో సహా దేశంలో భూ వ్యవహారాలు ఏం జరిగాయో అవగాహన ఉన్నందున భూసమీకరణకు అంగీకరించలేదు. టీడీపీ నాయకులు, అధికారులు, మీడియా వద్ద మాట్లాడిన ప్రతిసారీ నన్ను పోలీసులు అదుపులోకి తీసుకునేవారు. అరెస్టు చేశామంటూ తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌కు 61 పర్యాయాలు తీసుకెళ్లారు. వ్యూహాత్మకంగా రికార్డులకు ఎక్కకూడదనే ఉద్దేశంతో కేసు నమోదుచేసేవారు కాదు. రేయింబవళ్లు స్టేషన్‌లో ఉంచేవారు. అన్నం నీళ్లు కూడా ఉండేవి కావు. అప్పటి ఎస్‌ఐ (ఇప్పుడు సీఐ) కొట్టడంతో దవడ పళ్లు రాలిపోయాయి. స్టేషన్‌కు తీసుకెళ్లిన ప్రతిసారి భూసమీకరణను వ్యతిరేకించే వారు, గ్రామస్తులు, రైతు నాయకులు యాభై అరవై మందికి పైగా పోగై స్టేషన్‌ వద్దకు వచ్చేవారు. చివరకు పోలీసులకు నన్ను వదిలిపెట్టక తప్పేది కాదని బండ్ల బసవయ్య ‘సాక్షి’కి వివరించారు.

అమరావతిలో 5 సెంట్లు అమ్ముకుని...

అప్పటి ప్రభుత్వ దమనకాండను అడ్డుకోవడానికి అమరావతిలో విలువైన ఐదు సెంట్ల భూమిని అమ్ముకుని ఖర్చు పెట్టుకున్నా. న్యాయం కోసం పోరాటం చేస్తూనే ఉన్నా. ఇప్పటి ప్రభుత్వానికి చెప్పుకుంటున్నా. న్యాయం జరగకపోతుందా అని ఎదురుచూస్తున్నా. ఆనాటి ప్రభుత్వ అరాచకాలకు బలైన నాలాంటి వారెందరో రాజధాని గ్రామాల్లో లేకపోలేదు. ఆనాడు భూమి ఇచ్చినందున ఇల్లు ఇస్తామనడంతో ఉన్న దాన్ని పడగొట్టేశా. ఇవ్వలేదు. ఆ ప్రభుత్వ హయాంలో మూడేళ్లు అద్దె ఇంట్లో ఉండాల్సి వచ్చింది. ఇప్పటికీ నా కుటుంబ దుస్థితి అదే. చివరగా ఒక్కమాట... మేమూ చంద్రబాబు గారి వర్గీయులమే అంటూ బండ్ల బసవయ్య ముక్తాయింపు ఇచ్చారు.

వెన్నెల సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోండి


ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే వెన్నెల స్లీపర్ ఏసీ సర్వీస్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆటోనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కె. ప్రవీణ్‌కుమార్ కోరారు. ఈ బస్సు పీఎన్‌బీఎస్ స్టేషన్ నుంచి రోజు మార్చి రోజు రాత్రి 11 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు విశాఖపట్నం చేరుతుందన్నారు. ఫోర్ లైన్ రోడ్డు కావడం వల్ల ప్రయాణికులకు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు.

టెన్నికాయిట్ రాష్ట్ర జట్లు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ టెన్నికాయిట్ సీనియర్ మహిళ, పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ తెలిపారు. మహిళల జట్టుకు విజయనగరానికి చెందిన ఆర్.మౌనిక, పి.రేణుక, ఎం.ప్రవల్లిక, జి.శ్రావణి, పశ్చిమ గోదావరికి చెందిన జి.హేమమాధురి, వైజాగ్‌కు చెందిన పల్లవిశ్వేతశ్రీ.. పురుషుల జట్టుకు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పీజీఎండీ రామారావు, వి.వినయ్‌కుమార్, ఎల్.త్రిమూర్తులు, వైజాగ్‌కు చెందిన ఎస్.నితిన్, బి.పవన్‌కుమార్, కె.శివ ఎంపికయినట్లు చెప్పారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు హరియాణా రాష్ట్రంలోని సోనిపట్‌లో జరిగే జాతీ య పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు.

వినువీధిలో వింత.. చూపరులకు గిలిగింత





ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. గగనవీధిలో ఖగోళ వింత కనువిందు చేసింది. మంగళవారం సాయంత్రం చంద్ర గ్రహణం ఏర్పడింది. విజయవాడలో కూడా పాక్షికంగా ఇది కనిపించింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్‌కాస్ట్), గాంధీ పర్వత సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ గాంధీ హిల్‌పై టెలిస్కోప్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు గ్రహణాన్ని చూపించారు. గ్రహణం ప్రారంభం నుంచి విడుపు వరకూ విశేషాలను సైన్స్ సెంటర్ ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. – వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ)





నాయీ బ్రాహ్మణులకు అన్యాయం చేయొద్దు

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్

పటమట(విజయవాడ తూర్పు): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారులకు సహకరిస్తూ నాయీబ్రాహ్మణ వృత్తికి అన్యాయం చేస్తుందని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ అన్నారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమటలోని బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘ ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ బీసీ కులాల్లో చారిత్రాత్మక గుర్తింపు కలిగినది నాయీబ్రాహ్మణ కులమని, మానవుడికి నాగరికతను అందించిన ఘనత ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ వృత్తిని నమ్ముకున్న నాయీబ్రాహ్మణులకు అన్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారులతో సెలూన్‌లు పెడతామని ప్రకటించటం దారుణమని అన్నారు. దీన్ని తమ సంఘం తరఫున ఖండిస్తున్నామన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు గోనుగుండ్ల యలమందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంటూరి మురళీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకునూరి సుబ్బారావు, మహిళా సంఘం అధ్యక్షురాలు సీహెచ్ రాజేశ్వరి, బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మారేష్

'ఓపెన్' పరీక్షల షెడ్యూల్ విడుదల

మధురానగర్(విజయవాడ సెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓల్డ్ బ్యాచ్ విద్యార్థుల పరీక్షల షెడ్యూల్ విడుదల అయ్యిందని వర్సిటీ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం. అజంతకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2016, అంతకు ముందు బ్యాచ్ విద్యార్థులు వారి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు పరీక్షలు జరుగుతాయన్నారు. డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 6వ తేదీవరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వచ్చేనెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు, ప్రథమ సంవత్సరం పరీక్షలు వచ్చేనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కొన సాగుతాయన్నారు. పరీక్షలు రాయగోరు అభ్య ర్థులు ఈనెల 10వ తేదీలోపు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. రూ. 500 అపరాధ రుసుంతో ఈనెల 15వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లాకు 56 సీజనల్ హాస్టళ్లు మంజూరు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వలస కార్మికుల పిల్లల కోసం ఎన్టీఆర్ జిల్లాకు 56 సీజనల్ హాస్టళ్లు మంజూరు అయినట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరానికి గానూ ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న వలస కార్మికుల పిల్లలకు 50 మందికి ఒక హాస్టల్ చొప్పున మంజూరైనట్లు చెప్పారు. జిల్లాలోని 17 మండలాల్లో హాస్టళ్లను నిర్వహించేందుకు అనుబంధ శాఖలు ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, స్వయం సహాయక సంఘాలు అర్హత కలిగిన రిజిస్టర్డ్ స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనుబంధ శాఖలు రాతపూర్వక దరఖాస్తును మెయిల్ ద్వారా గానీ, లెటర్ ద్వారాగానీ ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 90002 01529ను సంప్రదించాలని కోరారు.

వచన కవితలకు ఆహ్వానం

విజయవాడ కల్చరల్: ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో 42వ జాతీయ తెలుగు వచన కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కవిత సామాజిక వర్తమాన స్థితిగతులకు ప్రతిబింబించేలా ఉండాలని, కవితాంశం విషయంలో కవికి స్వేచ్ఛ ఉంటుందని, కవిత ఎక్స్‌రే అవార్డు కోసం రాసినదై ఉండాలని సూచించారు. చివరితేదీ డిసెంబరు 30 అని, కవితలను ఎక్స్‌రే సాహిత్య మాసపత్రిక, పోస్ట్ బాక్స్ నం: 340, కొల్లూరి టవర్స్, దాసువారి వీధి, అరండల్ పేట, విజయవాడ 2 చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 94912 98990లో సంప్రదించాలని కోరారు.

మత్స్యకారులకు ఆర్థిక అండ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటు చేయడం ద్వారా మత్స్య సంపదకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంపై జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న పథకాలను ఆయా వర్గాలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఫిష్ రిటైల్ అవులెట్స్, ఫిష్ రిటైల్ మార్కెటింగ్ హబ్స్, ఫిష్ కియోస్క్, ఐస్‌బాక్స్‌లతో కూడిన టూవీలర్, త్రీ వీలర్ మోటర్ సైకిళ్ల పంపిణీ, లైవ్ ఫిష్ అమ్మక కేంద్రాల ఏర్పాటు వంటి పథకాలకు సబ్సిడీపై ఆర్థిక సహాయం అందిస్తారన్నారు.

మత్స్యకారుల నుంచి దరఖాస్తులు

ఆయా పథకాలకు లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. రూ. 20 లక్షలతో ఇన్సులేటెడ్ వాహనాల ఏర్పాటుకు 6 దరఖాస్తులు, ఐస్ బాక్స్‌లతో కూడిన ద్విచక్రవాహనాలకు 163, త్రీవీలర్ మోటర్ సైకిళ్ల కోసం 74 మొత్తంగా 243 దరఖాస్తులను ఆమోదిస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఖాళీ స్థలాలను గుర్తించాలి..

అవుట్‌లెట్స్ ఏర్పాటుకు నగరంలో ఇరిగేషన్, ఆర్టీసీ, నగరపాలక సంస్థ, మార్కెటింగ్, పశు సంవర్థక, పంచాయతీరాజ్ వంటి ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఖాళీ స్థలాలను గుర్తించాలన్నారు. ప్రకాశం బ్యారేజ్ ఎగువన కృష్ణానదిలో 20 లక్షల చేప పిల్లలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విడుదల చేసిన చేప పిల్లలు పెరిగిన అనంతరం దాదాపు 1500 మంది మత్స్య కుటుంబాల వారు చేపలను వేటాడడం ద్వారా ఆర్థిక లబ్ధి పొందేందుకు అవకాశం కలుగుతుందని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి ఏ. నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయభారతి, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రుక్మాందయ్య, ఎల్‌డీఎం పి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ద్వారా జరిగే ఈ పరీక్షకు జిల్లాలో రెండు సెంటర్లలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. కానూరులోని ఐయాన్ డిజిటల్ జోన్, సైలేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెంటర్లలో కొనసాగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టులలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 1,165 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రత నిమిత్తం పోలీస్ సిబ్బందిని నియమించి కేంద్రాల సమీపంలో 144 సెక్షన్‌ను అమలు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అభ్యర్థులు కోవిడ్ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. లైజనింగ్ అధికారులు ఉదయం 7.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ శారదా, సెక్షన్ ఆఫీసర్ అంజనా, బందరు డీఎస్పీ మాసూంబాషా, కో–ఆర్డినేటర్ ఎం హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

నలుగురు న్యాయమూర్తులకు ఉద్యోగోన్నతులు

విజయవాడ స్పోర్ట్స్: కృష్ణాజిల్లాలో సీనియర్ సివిల్ జడ్జిలుగా పని చేస్తున్న నలుగురు న్యాయమూర్తులకు అదనపు జిల్లా జడ్జిలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలో చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న ఎం.సునీల్‌కుమార్ ఏలూరు ఎనిమిదో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. విజయవాడ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.హరినారాయణ కాకినాడ నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తిగా, మచిలీపట్నంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు నెల్లూరు నాలుగో అదనపు జిల్లా జడ్జిగా, నూజివీడులో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్. దామోదర్‌రావు విజయనగరం జిల్లా పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎ.నాగశైలజకు అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఉద్యోగోన్నతి కల్పించి నూజివీడు 15వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఎస్.ఎస్. శ్రీనివాసశర్మను విజయవాడ కమర్షియల్ కోర్టుకు బదిలీ చేశారు.

జాతీయ యోగా పోటీల్లో ధీరజ్ సత్తా

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో విజయవాడ నగరానికి చెందిన డి.ధీరజ్ శ్రీకృష్ణ సత్తా చాటాడు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో ఇటీవల జరిగిన ఈ పోటీలలో 8–18 వయసు ఆర్టిస్టిక్ సోలో కేటగిరీకి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి బంగారు పతకంతో మెరిశాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారుడు ధీరజ్ శ్రీకృష్ణను కృష్ణాజిల్లా యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ గోకరాజు గంగరాజు, అధ్యక్షుడు రామినేని రవి, ఉపాధ్యక్షుడు రామలింగరాజు, కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ మంగళవారం విజయవాడలో అభినందించారు. మరిన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించి జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ధీరజ్‌కు సూచించారు.



ధీరజ్‌ను అభినందిస్తున్న జిల్లా యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ గోకరాజు గంగరాజు తదితరులు

24/7 విద్యుత్ సరఫరానే లక్ష్యం

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దన్‌రెడ్డి

ఉయ్యూరు: 24/7 విద్యుత్ సరఫరా లక్ష్యంగా, ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి సేవలు అందిస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్దన్‌రెడ్డి అన్నారు. ఉయ్యూరు డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం పరిధిలో గండిగుంట, కాటూరు, ఉయ్యూరు సబ్‌స్టేషన్‌లలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సబ్‌స్టేషన్‌ల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పనితీరు మెరుగుపర్చుకోవాలని తగు సూచనలు చేశారు. విద్యుత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాలకు 24/7 విద్యుత్ సరఫరా చేయాలని, ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యం ఇచ్చి ఉత్తమ సేవలు అందించాలని సూచించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ శాఖలో సంస్కరణలు చేపడుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో రూ.1400 కోట్లతో వ్యవస్థ మెరుగుదలకు పనులు చేపట్టనున్నామన్నారు. పాత లైన్లు గుర్తించి మార్పు చేసే పనులు చేస్తున్నామన్నారు. విద్యుత్ సేవల్లో సంతృప్తికర స్థాయిలో ఏపీసీపీడీసీఎల్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవటం సంతోషకరమన్నారు. క్షేత్రస్థాయిలో చిన్న చిన్న లోటుపాట్లను గుర్తించి నాణ్యమైన సేవలు అందించేందుకు, ప్రజలు, విద్యుత్ ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఈఈ సీహెచ్ రాంభొట్లు, డీఈ రామకృష్ణ, ఏఈలు సత్యనారాయణ, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.




ఉయ్యూరు సబ్‌స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మ జనార్దన్‌రెడ్డి

రైలు పట్టాలు దాటుతూ వృద్ధురాలు మృతి

హనుమాన్ జంక్షన్ రూరల్(గన్నవరం): బాపులపాడు మండలం వీరవల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న ఓ వృద్ధురాలు దురదృష్టవశాత్తూ ప్రమాదానికి గురై మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన పగిడి దుర్గమ్మ (85) మూగ, చెవిటి సమస్యలతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో వీరవల్లి మీదుగా తన గ్రామానికి కాలినడకన వెళ్తున్న దుర్గమ్మ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్‌రైలు ఢీకొట్టింది. ఆమెకు రైలు శబ్దం వినపడక పోవటంతోనే ప్రమాదం చోటుచేసుకుందని భావిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికుల సమాచారం మేరకు ఏలూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ విజయలక్ష్మి కేసు దర్యాప్తు చేపట్టారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

అల్లూరు(వీరులపాడు): అప్పుల బాధ తాళలేక వ్యక్తి పురుగు మందు తాగి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన వేమూరి సురేష్ (37) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ భారమై చేసిన అప్పులు తీర్చే దారి లేక మండలంలోని పెద్దాపురం గ్రామ శివారులోని పొలంలో సురేష్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమీప పొలాల్లో పని చేస్తున్న కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా హుటాహుటిన సురేష్‌ను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని భార్య రజనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.



వేమూరి సురేష్ (ఫైల్)

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



రెండో డివిజన్‌లో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 2వ డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మసీదు వీధి, శ్రీలంక కొండ ఎగువ వరకు కాలిబాటన చేరుకున్నారు. కొండ చిట్టచివరి భాగంలో నివాసముంటున్న పేదలను కలిశారు. సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. తాగునీరు, కాలిబాటల నిర్మాణం వంటి సమస్యలను స్థానికులు అవినాష్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణం చేపట్టిందని చెప్పారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడానికి సీఎం జగన్ నిబద్ధతగా ముందుకు సాగుతున్నారన్నారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి పరిచే దిశగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఫలితంగా పేదలకు కార్పొరేట్ తరహా విద్య, వైద్యం అందుతున్నాయన్నారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్ ముందుకు సాగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొండ ప్రాంతాల్లో వసతులు కల్పిస్తాం..

గత ప్రభుత్వ హయాంలో కొండ ప్రాంతాల్లో మౌలిక వసతులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని అవినాష్ తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా కొండలపై ఇళ్లు నిర్మించుకుని పేదలు జీవిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు కేవలం ఓట్ల కోసమే స్థానికులను వినియోగించుకుని వదిలేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రమే స్థానిక సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. 5వ డివిజన్ కొండ ప్రాంతాల్లో కాలిబాటలు, మెట్ల మార్గాలు అభివృద్ధి చేశామన్నారు. తాగునీటి సమస్యకు పరిష్కారంగా వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం జరుగుతుందన్నారు. యూజీడీ వ్యవస్థ అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. 2వ డివిజన్ పరిధిలో సైతం అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. స్థానికంగా మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలా కుమారి, స్థానిక నాయకులు రవిప్రకాష్, చిన్నబాబు, సాంబయ్య, సింహాచలం పాల్గొన్నారు.

వీల్ చైర్ అందజేత

దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు సహాయ కార్యక్రమాలు అందజేస్తున్నట్లు దేవినేని అవినాష్ తెలిపారు. 2వ డివిజన్ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మసీదు వీధికి చెందిన అలీ అనే దివ్యాంగ బాలుడికి వీల్ చైర్‌ను అందజేశారు. నియోజకవర్గ పరిధిలో దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. స్థానిక నాయకులు ప్రసాద్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

20న విజయవాడ మారథాన్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు చక్కటి ఆరోగ్యంతో పాటు, నడక పట్ల అవగాహన కలిగించేందుకు విజయవాడ రన్నర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన విజయవాడ మారథాన్ పేరుతో రన్ నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ వ్యవస్థాపకులు మణి, దీపక్‌లు తెలిపారు. మహాత్మాగాంధీరోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆరేళ్లుగా మారథాన్ నిర్వహిస్తున్నామన్నారు. మారథాన్‌కు నగర ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని చెప్పారు. గత రెండేళ్లుగా కరోనా కారణంగా వర్చువల్ రన్ నిర్వహించామన్నారు. కరోనా తగ్గడంతో ఈ ఏడాది మారథాన్ పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నామని, ఇప్పటికే రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించామని తెలిపారు. ఈ రన్‌లో 5కే, 10కే, 21కే విభాగాల్లో రన్‌లు జరుగుతాయన్నారు. ఎంజీరోడ్డులోని డి.అడ్రస్ మాల్ నుంచి రన్ ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లు రిజిస్ట్రేషన్ కోసం 97035 52326, 73306 44528 నంబర్లలో సంప్రదించాలని మణి, దీపక్ తెలిపారు.

పిచ్చిమొక్కల తొలగింపు



పటమట(విజయవాడ తూర్పు): పటమట 11వ డివిజన్‌లో రహదారుల మార్జిన్లలో, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను వీఎంసీ సిబ్బంది మంగళవారం తొలగించారు. డివిజన్‌లోని ఆర్‌ఆర్‌గార్డెన్స్ వివేకనంద కాలనీలో దోమలు పెరిగిపోయాయని, డ్రైయినేజీల్లో నీరు పారటంలేదని కాలనీ సభ్యులుతో కలిసి యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో వీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు స్పందించిన ఖాళీస్థలాల్లో, రోడ్లు మార్జిన్లలో ఉన్న పిచ్చిమొక్కలను తొలిగించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): చిట్టీ డబ్బులు తీసుకువస్తానని ఇంటి నుంచి వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన నున్న రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన డాకమూరి జీవన్‌కుమార్, దుర్గ దంపతులకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 7వ తేదీన దుర్గ ఉదయం 8 గంటలకు చిట్టీ డబ్బులు తీసుకొని వస్తానని భర్తతో చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఎంతసేపటికి ఆమె తిరిగి రాకపోవడంతో భర్త, ఆమె కుటుంబ సభ్యులు సమీపంలోని స్నేహితులు, బంధువులు ఇళ్ల వద్ద వెతికారు. దుర్గ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. భర్త జీవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్స్ అంతర్ జిల్లా ఆక్వాటెక్‌లో స్విమ్మర్ల ప్రతిభ



పతకాలు ప్రదర్శిస్తున్న మహమ్మద్ షమీ

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): మాస్టర్స్ అంతర్ జిల్లా ఆక్వాటెక్ చాంపియన్‌షిప్‌లో కేఎల్ రావు స్విమ్మర్లు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, రజిత పతకాలను సాధించారని కోచ్ రఫీ పేర్కొన్నారు. కేఎల్ రావునగర్ స్విమ్మింగ్ పూల్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పతకాలను సాధించిన స్విమ్మర్లను అభినందించారు. 6వ తేదీ గాంధీనగర్‌లో జరిగిన పోటీల్లో 45 ఏళ్ల కేటగిరిలో వంద, 50 మీటర్ల ఫ్రీస్టైల్, విభాగంలో ఆకుల శ్రీనివాసరావు రజత పతకాన్ని సాధించారన్నారు. మహిళల విభాగంలో మహమ్మద్ షమీ 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో బంగారు పతకం, 50, 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకాలను సాధించారన్నారు. పతకాలు సాధించిన స్విమ్మర్లను నగరపాలక సంస్థ అధికారులు అభినందనలు తెలిపారు.

13న బ్రాహ్మణ సేవా సంఘం కార్తిక వనసమారాధన

సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న కొత్తూరు తాడేపల్లిలోని బెనడిక్ట్ స్కూల్ పక్కన మామిడి తోటలో వనసమారాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామకృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉదయం 8 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంతో కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్, గాయత్రి సొసైటీ దగ్గర నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొనే బ్రాహ్మణ కుటుంబాలు 94940 17000, 93920 97466 ఫోన్ నంబర్ల ద్వారా గాని, లేదా గాయత్రి సొసైటీలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో ఆరోగ్యానికి ముప్పు



సిద్ధార్థ కళాశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో అనేక దుష్పరిణామాలు ఉన్నాయని, ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. మహాత్మాగాంధీరోడ్డులోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం ఇ – వ్యర్థాలపై సదస్సు జరిగింది. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ.. ఇ – వ్యర్థాల విషయంలో ప్రభుత్వం కూడా తమ వంతు కృషి చేస్తుందన్నారు. ఇ – వ్యర్థాలను గుంటూరులోని నాయుడుపేటలో డంపింగ్ యార్డుకు తరలించి వాటిని ఏ విధంగా నిర్వీర్యం చేస్తున్నారో విద్యార్థినులకు వివరించారు. ఈ విషయంలో విద్యార్థినుల అభిప్రాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, డైరెక్టర్ టి.విజయలక్ష్మి, సరళ, నాగరాణి, కె.కవిత, ఎస్.ఝాన్సీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

21న త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వేముల హజరత్తయ్య గుప్తా, యలమందరావు, రాజేశ్వరి తదితరులు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 6వ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం, వాయిద్య కళాకారుల ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నటీనటుల, వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా వాయిద్య కళాకారులకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పర్యాటక శాఖామంత్రి ఆర్‌కే రోజా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొంటారన్నారు. వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు యలమందరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వాయిద్య కళాకారుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, గౌరవ సలహాదారుడు నిడమానూరు యలమందరావు పాల్గొన్నారు.

నంది అవార్డు సాధించిన విద్యార్థినికి అభినందన



బాలసరస్వతిని అభినందిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడ తూర్పు): తమిళనాడు వెల్లూరులోని సిరిపురంలోని గోల్డెన్ టెంపుల్లో శ్రీ సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న జరిగిన 7వ జాతీయ స్థాయి నంది అవార్డు డ్యాన్స్ ఫెస్టివల్‌లో విజయం సాధించిన మోదుకూరి బాలసరస్వతికి మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ చాంబర్‌లో ఆమెను బాలసరస్వతి, తల్లిదండ్రులతో మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్లో 8వ తరగతి చదువుతన్న తాను కూచిపూడి ప్లేట్ డ్యాన్స్‌లో అవార్డు సాధించానని మేయర్‌కు వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని, అందుకు వీఎంసీ సహకారం ఉంటుందని భరోసాని ఇచ్చారు. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సాహించేందుకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతిభ కలిగిన వారిని మరింత వెలుగులోకి తీసుకోస్తుందన్నారు. సమావేశంలో బాలసరస్వతి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయం మూసివేత



ఆలయం మూసివేస్తున్న సిబ్బంది

మధురానగర్(విజయవాడ సెంట్రల్): చంద్రగ్రహణం సందర్భంగా మాచవరం దాసాంజనేయ స్వామి వారి దేవాలయాన్ని మంగళవారం మూసివేశారు. మంగళవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఆలయాన్ని మూసివేశారు. బుధవారం ఉదయం సంప్రోక్షణ తరువాత 10.45 గంటల నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ తెలిపారు.

● నిర్మానుష్యంగా ఇంద్రకీలాద్రి



నిత్యం వేలాది మంది భక్తులతో రద్దీగా ఉండే ఇంద్రకీలాద్రి మంగళవారం నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. చంద్రగ్రహణంతో ఆలయాన్ని మూసివేయడంతో కనకదుర్గానగర్, క్యూ లైన్లు, గోపురం ప్రాంతంతో పాటు ఆలయ ప్రాంగణమంతా బోసిపోయింది. బుధవారం ఆలయ సంప్రోక్షణ అనంతరం ఆలయ అధికారులు అమ్మ వారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

● ఘనంగా గురునానక్ జయంతి



నగరంలో గురునానక్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గురునానక్ కాలనీలోని మందిరాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించిన సిక్కులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో మందిరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

16న వాహనాల వేలం

పటమట(విజయవాడ తూర్పు): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు పటమట ఎస్‌ఈబీ సీఐ నిక్సన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పటమట స్టేషన్ పరిధిలోని ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను స్టేషన్ ఆవరణలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ద్విచక్ర వాహనానికి రూ.5 వేలు, కార్లకు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంలో వాహనం దక్కించుకున్న వారు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలన్నారు. వివరాలకు 0866-2543707, 82478 27255, 94409 02456 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కరాటే విజేతకు అభినందన



మోహనసాయిని అభినందిస్తున్న కళాశాల జీఎం జీవీ రావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మంగళగిరిలో ఈ నెల 6న జరిగిన నేషనల్ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్ షిప్–2022 పోటీల్లో తమ కళాశాల విద్యార్థి జే.మోహనసాయి ప్రథమ స్థానంలో నిలిచి బ్లాక్‌బెల్ట్ సాధించారని శారదా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి చెప్పారు. జమ్మిచెట్టు సెంటర్‌లోని శారదా కళాశాల ఆవరణలో మంగళవారం మోహనసాయిని అభినందించారు. విద్యా సంస్థల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ రావు మాట్లాడుతూ.. జూనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న మోహనసాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన చూపారన్నారు. వివిధ జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు పొందడమే కాకుండా క్రీడల్లో కూడా తమ విద్యార్థులు ప్రతిభ చూపడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

నగర కళాకారులకు ప్రతిభా యువ పురస్కారాలు



కళాకారులతో నిర్వాహరాలు పద్మావతి, సప్తా శివకుమార్, కొణతల ప్రకాష్ తదితరులు

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ విద్యార్థులకు ప్రతిభా యువ పురస్కారాలు లభించాయని నాట్యాచార్యుడు సప్తా శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మలేసియాకు చెందిన పిరమిడ్ యోగా డ్యాన్స్ అకాడమీ(పైడా) ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య కళాకారిణి, అంతర్జాతీయ యోగా కేంద్ర నిర్వాహకురాలు పద్మావతి పులమరశెట్టి పర్యవేక్షణలో మలేసియాలోని కౌలాలంపూర్‌లో ఆదివారం జరిగిన యువజనోత్సవాల్లో విద్యార్థులు పాల్గొన్నారన్నారు. దేశంలోని వివిధ సంప్రదాయ నృత్య రీతులను ప్రతీ ఏటా ప్రదర్శన, యోగా అంశాలపై సదస్సులను నిర్వహిస్తారని చెప్పారు. 2022 సంవత్సరానికి గానూ నగర కళాకారులకు ప్రతిభా పురస్కారాలు లభించాయన్నారు. సభలో పిరమిడ్ యోగా డ్యాన్స్ అకాడమీ ప్రతినిధులు కాంతారావు, కొణతల ప్రకాష్, యోగా మాస్టర్ యోగేష్, పూర్ణిమ పాల్గొన్నారు.

నేడు, రేపు 'వసంతం' ప్రదర్శన



మాట్లాడుతున్న ఏపీ క్రాఫ్ట్ కౌన్సిల్ సెక్రటరీ రంజన, చిత్రంలో కౌన్సిల్ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో వసంతం – 2022 పేరుతో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు కౌన్సిల్ కార్యదర్శి ఎస్. రంజన తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వహించే ప్రాంగణం శ్రీ శేషసాయి కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో చేనేత వృత్తులు, అల్లికలు, హస్తకళలు, నేత కార్మికులు, కళాకృతులు, డిజైనర్స్ తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తామన్నారు. ప్రజలకు నచ్చే అనేక కళాకృతులతో పాటుగా, కొత్తవారిని, వారు చేసిన కళాకండాలను ప్రదర్శనలో ఉంచుతామని తెలిపారు. ఈ ప్రదర్శనను బుధవారం హ్యాండ్లూమ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో బాయన సుజాత తదితరులు పాల్గొన్నారు.

20న త్రిశక్తి పీఠంలో సత్యనారాయణస్వామి వ్రతం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీన సామూహిక శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి వారి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ వ్రతంలో పాల్గొనే భక్తులు దేవస్థానం టికెట్ కౌంటర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గుణదల(విజయవాడ తూర్పు): గుణదలలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల మధ్య విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. శ్రీరామచంద్ర నగర్, గణేష్ నగర్, కరెన్సీనగర్, కనకదుర్గానగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు సహకరించాలని కోరారు.

ప్రకటన

[illegible]

వి. శ్రీనివాస్, అడ్వకేట్, లిబర్టీ రోడ్డు, సత్యనారాయణపురం, విజయవాడ–520011.

అలరించిన చంద్రగ్రహణం

నగరంలో మంగళవారం సాయంత్రం చంద్రగ్రహణం అలరించింది. చంద్రుడు ఆసాంతం ఎరుపు రంగులో దర్శనమిచ్చాడు. నగర వాసులు గ్రహణాన్ని ఆసక్తిగా తిలకించి, తమ సెల్‌ఫోన్లలో గ్రహణ చిత్రాలను బంధించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





వైభవంగా సత్యదేవుని గిరి ప్రదక్షిణ


గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

అన్నవరం: కార్తిక పౌర్ణమి పర్వదినం సందర్భంగా మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరంలోని సత్యదేవుని గిరి ప్రదక్షిణ కార్యక్రమం కనులపండువగా జరిగింది. ఇందులో లక్ష మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన గిరిప్రదక్షిణ 9 గంటల వరకు కొనసాగింది. సుమారు 11 కిలోమీటర్లు దూరం మేరకు ప్రదక్షిణ కొనసాగింది. సత్యదీక్ష చేపట్టిన స్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ అనంతరం భక్తులు సత్యదేవుని దర్శించారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు స్వామివారి దర్శనానికి అనుమతించారు. మంగళవారం సాయంత్రం చంద్రగ్రహణం కారణంగా సత్యదేవుని ఆలయాన్ని ఉదయం 11 గంటలకు మూసివేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో సత్యనారాయణ మూర్తి, ఏసీ రమేష్ బాబు ప్రారంభించారు. భక్తులకు పాలు, పండ్లు, మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.


విజయవాడ గాంధీ హిల్‌పై నుంచి గ్రహణాన్ని వీక్షిస్తున్న సందర్శకులు


తిరుపతి సైన్స్ సెంటర్‌లో టెలిస్కోప్, బైనాక్యులర్ ద్వారా గ్రహణాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు


రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్ వద్ద చంద్రగ్రహణం సందర్భంగా పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

తిరుమలలో సర్వదర్శనం ప్రారంభం

గ్రహణం అనంతరం అన్ని ఆలయాల్లో సంప్రదాయబద్ధంగా పూజలు

అనంతరం భక్తులకు దర్శనాలు.. శ్రీకాళహస్తిలో పోటెత్తిన భక్తులు

తిరుమల/సింహాచలం/శ్రీశైలం టెంపుల్/శ్రీకాళహస్తి : పాక్షిక చంద్ర గ్రహణం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మూతబడ్డ ప్రధాన ఆలయాలన్నీ గ్రహణం విమోచానంతరం సంప్రోక్షణ, ప్రదోష కాల పూజలు పూర్తయ్యాక తెరుచుకున్నాయి. రాహుకేతువులకు నిలయమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో మాత్రం స్వామిఅమ్మవార్లకు గ్రహణ కాలాభిషేకాలు చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం రాత్రి 8.20 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం ప్రారంభమైంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఉ.8.40 గంటలకు ఆలయం తలుపులు మూసివేశారు. రాత్రి 7.20 గంటలకు తెరిచారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, రాత్రి కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం ప్రారంభమైంది. అలాగే, రాత్రి 8.30 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. విశాఖ జిల్లా సింహాచలంలో ఉన్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో రాత్రి 7.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి పూజాదికాలు నిర్వహించారు. ఇక్కడ బుధవారం ఉ.6.30 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు. ఇక శ్రీశైల ఆలయంలో రాత్రి 8 గంటల నుంచి అలంకార దర్శనాన్ని మాత్రమే భక్తులకు కల్పించారు.


చంద్రగ్రహణం తర్వాత తిరుపతి కపిల తీర్థంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తిలో గ్రహణ కాలాభిషేకాలు

మరోవైపు.. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా భక్తులు పోటెత్తారు. దేశవ్యాప్తంగా ఆలయాలన్నీ మూతబడినప్పటికీ ఇక్కడి స్వామిఅమ్మవార్లకు గ్రహణ కాలాభిషేకాలు చేశారు. దీంతో దేశం నలుమూలల నుంచి స్వామివారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. సహస్ర లింగం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శాంతి అభిషేకాలు జరిపారు. రష్యా భక్తులు కూడా రాహు–కేతు పూజలు చేయించుకుని మురిసిపోయారు.

రేడియంట్ భూములపై ఆరోపణలన్నీ అవాస్తవాలే

- సంయుక్త ప్రకటనలో రేడియంట్, వీపీఆర్ ప్రాజెక్ట్స్ ప్రతినిధులు వెల్లడి
- నిబంధనల ప్రకారమే ప్రాజెక్టు
- హైకోర్టు ఆదేశాలతోనే రేడియంట్ సంస్థ పేరు మీద భూ హక్కులు
- వీఎంఆర్డీయే, జీవీఎంసీకి అన్ని చార్జీలు చెల్లించాం
- ప్రాజెక్టుకు రెరా అనుమతులు కూడా ఉన్నాయి
- టీడీపీ నేతల ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి
- కొనుగోలుదారులను భయపెట్టేలా మాట్లాడటం సరికాదు
- అవసరమైతే న్యాయపరమైన చర్యలకు సిద్ధంగా ఉన్నాం

దొండపర్తి (విశాఖ దక్షిణ): రేడియంట్ భూముల వ్యవహారంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవాలు లేవని రేడియంట్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లాండ్ ఓనర్), వీపీఆర్ ప్రాజెక్ట్స్ (డెవలపర్) సంస్థల ప్రతినిధులు ఓ సంయుక్త ప్రకటనలో ఖండించారు. మధురవాడ సర్వే నంబర్ 428/2లో భూములను వీఎంఆర్డీఏ నుంచి రేడియంట్ సంస్థ కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూముల అభివృద్ధి కోసం ఏళ్ల తరబడి పోరాడామన్నారు. నిబంధనల ప్రకారం వీఎంఆర్డీఏ, జీవీఎంసీకి అన్ని చార్జీలను చెల్లించినట్లు చెప్పారు. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన జీవో 77ను 2019 ఫిబ్రవరి 14వ తేదీన గత ప్రభుత్వం అధ్యయనం చేసిందని, జీవో ప్రకారం నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ అదే ఏడాది సెప్టెంబర్ 4వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ కొంత సమాచార లోపం కారణంగా స్టాంప్ డ్యూటీ మాఫీ వంటి అంశాలతో రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు. జీవో నంబర్ 77 ప్రకారం రేడియంట్ సంస్థకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించేలా ఆ శాఖకు ఆదేశాలు జారీ చేయాలని తాము హైకోర్టులో రిట్ పిటిషన్ (డబ్ల్యూపీ నంబర్ 9968/2020) వేసినట్లు తెలిపారు. దీనిని విచారించిన హైకోర్టు రేడియంట్ సంస్థ పేరు మీద భూ హక్కులు బదలాయించాలని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. దీంతో ప్రభుత్వం స్టాంప్ డ్యూటీని మాఫీ చేస్తూ జీవో నెంబర్ 23 విడుదల చేయడంతో 2021 ఫిబ్రవరి 5న సంస్థ పేరు మీద భూముల రిజిస్ట్రేషన్ పూర్తయిందని వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు జరిగిన వ్యవహారంపై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పల్లా శ్రీనివాసరావు ప్రచారం కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వీరి ఆరోపణలను ప్రచురించే ముందు కొన్ని పత్రికలు, మీడియా సంస్థలు కనీసం అందులో వాస్తవాలను గ్రహించకపోవడాన్ని తప్పుబట్టారు. వీపీఆర్ ప్రాజెక్ట్స్‌పై వీరి నిరాధార ఆరోపణలపై స్పందించాల్సిన అవసరం లేకపోయినప్పటికీ, తెలుగుదేశం పార్టీ నాయకుల దురుద్దేశాన్ని తమ కస్టమర్లు, ప్రజలకు తెలియజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ భూములపై ప్రమోటర్లు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (రేడియంట్), వైఎస్ అనిల్‌రెడ్డి (వీపీఆర్ ప్రాజెక్ట్స్)కి పూర్తి హక్కులు ఉన్నాయని స్పష్టం చేశారు. ఎటువంటి ఒత్తిళ్ల లేకుండా ఈ భూముల అభివృద్ధి బాధ్యతలను వీపీఆర్ ప్రాజెక్ట్స్‌కు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ ప్రైవేటు వాణిజ్య ఒప్పంద వివరాలను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. 'ది క్యాపిటల్ లుక్స్' పేరుతో ఇక్కడ చేపట్టే నిర్మాణాలకు వీఎంఆర్డీఏ, జీవీఎంసీల నుంచే కాకుండా రెరా నుంచి కూడా అనుమతులు పొందినట్లు వివరించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్లాన్ అనుమతులు రద్దు చేస్తామంటూ టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేసిన వ్యాఖ్యలను వారు తప్పుబట్టారు. ఇటువంటి ప్రకటనలపై న్యాయపరమైన చర్యలకు తమ లీగల్ కౌన్సిల్ సిద్ధంగా ఉందన్నారు.

సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మికి క్లీన్‌చిట్

- ఓఎంసీ కేసులో అభియోగాలు కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు
- నేరారోపణలకు సరైన ఆధారాలు లేవన్న ధర్మాసనం
- నిర్దోషిగా ప్రకటిస్తూ ఆదేశాలు
- ఏడాదిపాటు జైల్లో ఉన్న సీనియర్ ఐఏఎస్
- పదకొండేళ్లుగా న్యాయ పోరాటం
- హైకోర్టు తీర్పుతో ఊరట

సాక్షి, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి, ఏపీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. ఆమెపై సీబీఐ చేసిన అభియోగాలను కొట్టివేసింది. ఆమెను నిర్దోషిగా ప్రకటిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఓఎంసీ కేసులో ఆరో నిందితురాలిగా ఉన్న శ్రీలక్ష్మి తనను ఈ కేసు నుంచి తప్పించాలంటూ వేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను సీబీఐ కోర్టు గత నెల 17న కొట్టేసింది. దీన్ని సవాల్ చేస్తూ అదే నెలలో శ్రీలక్ష్మి హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. శ్రీలక్ష్మిపై అభియోగాల నమోదు చేపట్టవద్దని సీబీఐ కోర్టును ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం మరోసారి విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం.. ఆమెపై మోపిన అభియోగాలను కొట్టివేసింది. అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్ 13(1)(డి), ఐపీసీ సెక్షన్ 120–బి రెడ్‌విత్ 409 ప్రకారం శిక్షార్హమైన నేరాలను పిటిషనర్‌పై మోపడానికి ఎటువంటి ఆధారాల్లేవని స్పష్టంచేసింది. ఆమెపై ఇతర సెక్షన్ల కింద అభియోగాలను నమోదు చేసినట్లయితే ట్రయల్ కోర్టు విచారణ కొనసాగించవచ్చని సూచించింది. ఆమె తరఫున కె.రాఘవాచార్యులు వాదనలు వినిపిస్తూ.. కేవలం ఆరోపణలతోనే సీబీఐ కేసు నమోదు చేసిందని అన్నారు. ఓఎంసీకి మైనింగ్ లీజుల్లో శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగానికి ఆధారాల్లేవన్నారు. 'క్యాప్టివ్ మైనింగ్' అన్న పదానికి చట్టబద్ధతే లేదన్నారు. సీబీఐ ప్రత్యేక న్యాయవాది ఎన్.నాగేంద్రన్ వాదనలు వినిపిస్తూ.. ఓఎంసీకి క్యాప్టివ్ మైనింగ్ కింద లీజు కేటాయించడం కోసం మిగిలిన కంపెనీల దరఖాస్తులను తిరస్కరించారన్నారు.

2011లో అరెస్టు

2004–09 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీలక్ష్మి మైనింగ్ శాఖ కార్యదర్శిగా ఉన్న సమయంలో అనంతపురం జిల్లా బళ్లారి రిజర్వ్ ఫారెస్ట్‌లో ఓఎంసీ అక్రమ మైనింగ్ చేసిందన్న ఆరోపణలు వచ్చాయి. 2007–09 మధ్య ఓఎంసీ నుంచి ముడుపులు తీసుకుని అనుమతులిచ్చారని ఆరోపిస్తూ శ్రీలక్ష్మిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఆమెను ఆరో నిందితురాలిగా చేర్చింది. 2011 నవంబర్‌లో ఆమెను అరెస్ట్ చేసింది. ఆమె 2012 అక్టోబర్‌లో జైలు నుంచి బయటకు వచ్చారు. 11 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్నారు.

పేదల ఇళ్ల స్థలాలపై కులవాదుల వ్యాఖ్యలు సిగ్గుచేటు

772వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: న్యాయస్థానం తీర్పును వ్యతిరేకిస్తూ.. పేదల ఇళ్లస్థలాలపై కులవాదులు చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 772వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. వారికి అనుకూలంగా న్యాయస్థానం తీర్పులు ఉంటే సాగిలపడి మొక్కుతూ జడ్జిలకు పూలుచల్లి స్వాగతం పలుకుతూ ఎల్లో మీడియాలో ప్రసారాలు చేసిన కులవాదులు, పేదలకు అనుకూలంగా తీర్పులు వస్తే మాత్రం ఇష్టారీతిగా మాట్లాడుతుండడం మంచి పద్ధతి కాదన్నారు. పేదల సంక్షేమానికి అడుగడుగునా అడ్డుపడుతున్న కులవాదులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, తదితరులు పాల్గొన్నారు.

నిత్య జీవనంలో న్యాయపరమైన సమస్య ఏదైనా వస్తే తమ దగ్గరి వాళ్లకి చెప్పుకొని, ఉపశమనం పొందుతుంటారు. అన్యాయం చేసినవారిని తిట్టుకుంటూ విలువైన సమయాన్ని, డబ్బును పోగొట్టుకుంటుంటారు. కానీ, న్యాయవ్యవస్థను సంప్రదించాలంటే మాత్రం భయపడతారు. లాయర్లకు బోలెడంత డబ్బు ఫీజుగా ఇచ్చుకోలేమనో, కోర్టు చుట్టూ తిరగలేమనో అనుకుంటారు. నేడు అంటే నవంబర్ 9న నేషనల్ లీగల్ సర్వీస్ డే. ఈ సందర్భంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో ఉచితంగా న్యాయం పొందగలిగే విధానాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడం అవసరం.



నిరుపేదలకు కూడా న్యాయం అందుబాటులో ఉండాలి.

ప్రతీకాత్మక చిత్రం

సముచిత న్యాయానికి...

పూర్ణకు పెళ్లయ్యి ఏడాదిన్నర అవుతోంది. ఆర్నెల్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. తండ్రి కట్నంగా ఇస్తానన్న డబ్బు తీసుకునే ఇంటికి రావాలని అత్తింట్లో షరతు పెట్టారు. కూలి పనులు చేసే తండ్రి అంత డబ్బు ఇచ్చుకోలేడు. తనకు న్యాయం జరిగేదెలాగో పూర్ణకు తెలియడం లేదు.

•••

నీతు ఇంజనీరింగ్ చదువుతోంది. నెల రోజులుగా తెలియని వారు తన గురించి అసభ్యకరమైన మెసేజీలు పంపిస్తూ మానసికంగా వేధిస్తున్నారు. ఇంట్లో పెద్దలకు చెబితే తననే తప్పు పడతారేమో, పోలీసులను సంప్రదిస్తే ఇంటి పరువు పోతుందేమో అని భయం. ఎవరి నుంచి ఎలాంటి సాయం తీసుకోవాలో అర్థం కావడం లేదు.

•••

'ప్రతి మనిషికి న్యాయపరమైన అవసరం ప్రతి దశలోనూ ఉంటుంది. అందుకు ముందుగా పోలీసులు సంప్రదించలేకపోవచ్చు. కానీ, న్యాయపరమైన సలహా తీసుకుంటే మాత్రం సరైన పరిష్కారం లభిస్తుంది' అంటారు అడ్వకేట్ రాజేశ్వరి. 'పెద్ద పెద్ద నేరాలు జరిగితే తప్ప అలాంటి చోటుకి మనకేం పని అన్నట్టుగా చాలా మంది ఆలోచిస్తారు. అంతే కాదు, న్యాయం పొందాలంటే చేతిలో దండిగా డబ్బు ఉండాలని కూడా భావిస్తారు. అయితే అవన్నీ పొరపాటు భావనలేనని, ఆరోగ్యం బాగోలేకపోతే హాస్పిటల్‌కి వెళ్లినట్టే ఏదైనా న్యాయపరమైన అవసరం ఏర్పడితే లీగల్ సర్వీస్ సెల్‌ని సంప్రదించవచ్చు' అనేది న్యాయ నిపుణుల మాట.

ఒక చిన్న వ్యాపారం మొదలు పెట్టడానికి అన్ని అర్హతలు ఉండి, బ్యాంకు లోన్‌కు నిరాకరించినా అందుకు తగిన న్యాయ సలహా తీసుకోవడం అవసరం. వినియోగదారుడు ఏదైనా వస్తువును కొని మోసపోయినా అందుకు సంబంధించిన న్యాయం పొందడానికి అవగాహన తప్పనిసరి. గ్రామాల్లో పది మంది మహిళా సంఘ సభ్యులు కలిసి ఏదైనా కార్యక్రమం చేపట్టాలన్నా న్యాయపరమైన అవసరం ఉంటుంది. మన నిత్యజీవితంలో ప్రతి చిన్న విషయానికి 'న్యాయం'అవసరం గుర్తించాలి. అంతేకాదు ప్రతీ చిన్న విషయానికి డబ్బు చెల్లిస్తేనే న్యాయం పొందుతామనే ఆలోచనను దూరం పెట్టాలి.



ఉచితంగా న్యాయ సేవ

పేద పౌరుల కేటగిరీ కిందకు వచ్చే ప్రతి ఒక్కరూ ఉచిత న్యాయ సేవలను అందుకోవడానికి అర్హులు. 9-9-1995 నుంచి లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్ 1987 అమల్లోకి వచ్చింది. ఇందులో అర్హులైన వ్యక్తులు తమ తరఫున కేసులను దాఖలు చేయడానికి లేదా ఏదైనా కోర్టులో తమకు వ్యతిరేకంగా దాఖలైన కేసులలో తమను తాము రక్షించుకోవడానికి న్యాయ సేవలను ఉచితంగా పొందవచ్చు. ఉచిత న్యాయ సహాయం గురించి, దీనితోపాటు లీగల్ సర్వీసెస్ అథారిటీలు అందించే అనేక సేవలను ప్రజలకు తెలియజేయడానికి ప్రతియేటా ప్రచారాలు నిర్వహిస్తారు. చట్టపరమైన సహాయం కోరుకునే వ్యక్తి న్యాయ సేవల కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనూ సంప్రదించవచ్చు.

■ **సరైన పరిష్కారానికి..**

సమస్య వచ్చినప్పుడు స్థానికంగా మండల లేదా జిల్లా లేదా రాష్ట్ర స్థాయిల్లో ఉన్న లీగల్ సర్వీస్ అథారిటీని సంప్రదించి, సలహా తీసుకోవచ్చు. లీగల్ సర్వీస్ అథారిటీ ప్యానెల్‌లో సివిల్, క్రిమినల్.. ఇలా ఒక్కో విభాగానికి ఒక్కో లాయర్ ఉంటారు. రాష్ట్రస్థాయి లీగల్ ప్యానెల్‌లో హైకోర్టు జడ్జి కూడా ఉంటారు. వీరిలో ఎవరిని సంప్రదించినా పరిష్కారం ఎక్కడ లభిస్తుందో అందుకు సంబంధించిన సమాచారం తప్పక తెలుస్తుంది. ఏ కేసులు ఎంత వరకు పరిష్కారం అవుతున్నాయనే విషయంలోనూ ఈ సెల్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉంటుంది. వీటితోపాటు మధ్యవర్తిగా సమస్యలను పరిష్కరించే లోక్ అదాలత్ అనే మీడియేషన్ టెక్నిక్ కూడా అందుబాటులో ఉంది.

■ **మహిళలు.. పిల్లలు**

అత్యాచారం, కిడ్నాప్, వరకట్న వేధింపులు, మానసిక-శారీరక హింస, లైంగిక వేధింపులు మొదలైన వాటి నుంచి మహిళలు న్యాయ పొందడానికి లీగల్ సర్వీస్ సెల్‌ను ఆశ్రయించవచ్చు. అంతేకాదు సైబర్ బుల్లీయింగ్, మహిళా సాధికారతకు అవరోధం కలిగించే అంశాలేవైనా న్యాయపరమైన సలహా తీసుకోవచ్చు.

■ **కాలేజీలు.. పాఠశాలలు**

ఇటీవల యువతలో బాగా వినిపిస్తున్న మాట మాదకద్రవ్యాల వినియోగం. కాలేజీల్లో లీగల్ అడ్వైజ్ సెషన్స్ ఏర్పాటు చేయడానికి యాజమాన్యాలు ముందుకు రావాలి. లీగల్ సర్వీస్ అథారిటీ కూడా లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాలను చేపడుతుంది. వీటికి హాజరై అందుకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

■ **పారా లీగల్ వాలెంటీర్లు**

వీళ్లు పూర్తిస్థాయి లాయర్లు కాదు. న్యాయ సమాచారం తెలుసుకుని, జనాలకు స్వచ్ఛందంగా అందిస్తుంటారు. జనాల మధ్యన తిరుగుతూ, ఎవరికైనా న్యాయపరమైన సాయం చేసేవారుంటారు. ఎవరైనా ఆసక్తి గలవారు 'న్యాయం' కు సంబంధించిన సమాచారం తెలుసుకొని, ప్రజలకు స్వచ్ఛందంగా అవగాహన కలిగించవచ్చు. ఇది కూడా సామాజిక సేవలో భాగమే అవుతుంది.

– నిర్మలారెడ్డి

అవగాహన తప్పనిసరి

ఈ నవంబర్ నెల అంతా స్కూల్స్, కాలేజీల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. చదువుకునే విద్యార్థులకు న్యాయవ్యవస్థకు సంబంధించిన ప్రాథమికాంశాల పట్ల అవగాహన ఉండాలనేది మా థీమ్. అమ్మాయిలకైతే శారీరక, మానసిక, లైంగిక హింసలు, గృహహింస, ఆస్తి హక్కుల గురించిన పూర్తి సమాచారం తెలిసుండాలి. వీటికి సంబంధించిన విషయాల మీద లీగల్ సర్వీస్ అథారిటీ కూడా మండల, గ్రామ, జిల్లా స్థాయిల్లోనూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తుంటుంది.



- రాజేశ్వరి, అడ్వకేట్

బ్యూటిప్స్



మొటిమలకు పుదీనా పూత

● పుదీనా ఆకులను ఎండబెట్టి పొడి చేయాలి. ఈ పొడిలో కొద్దిగా ముల్తానీ మట్టి, రోజ్‌వాటర్ వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని ముఖంపై ఉన్న మొటిమలపై రాయాలి. పూర్తిగా ఆరాక నీటితో కడిగేయాలి. ఈ పేస్టు చర్మంపై పేరుకు పోయిన జిడ్డుని తొలగించి, మొటిమలు తగ్గుముఖం పట్టేలా చేస్తుంది. క్రమం తప్పకుండా ఈ ప్యాక్ వేసుకుంటే ముఖ చర్మం నిగారింపుని సంతరించుకుంటుంది.





● గుప్పెడు పుదీనా ఆకులకు కొద్దిగా తేనె, రోజ్ వాటర్ జోడించి పేస్టులా నూరాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా వేసి పదిహేను నిమిషాల తరువాత చల్లటి నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల ముఖం జిడ్డులేకుండా ఫ్రెష్‌గా కనిపిస్తుంది.



ఫుట్‌కేర్

పాదాలను కోమలంగా మారుద్దాం!

● వేడినీళ్లల్లో మీకు నచ్చిన షాంపు, కొద్దిగా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో పాదాలను నానబెట్టాలి. పది నిమిషాల తరువాత పాత టూత్‌బ్రష్ తీసుకుని కాళ్లను రుద్ది కడగాలి. అడుగు భాగంలో పెడిక్యూర్ బ్రష్‌తో రుద్దితే పాదాలపై ఉన్న మృతకణాలు తొలగిపోతాయి.



● తెల్లగా ఉండే టూత్ పేస్టును అర టేబుల్ స్పూను తీసుకుని దానిలో విటమిన్ ఈ క్యాప్యూల్స్ రెండు వేసి రెండింటిని బాగా కలపాలి. కడిగిన పాదాలను తడిలేకుండా తుడిచి ఈ మిశ్రమాన్ని పగుళ్లపై రాసి మర్దనా చేయాలి. తరువాత సాక్సులు వేసుకుని రాత్రంతా ఉంచుకోవాలి. పొద్దున్నే సాక్సులను తీసేసి పాదాలను శుభ్రంగా కడుక్కోవాలి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల పాదాల పగుళ్లు తగ్గి కోమలంగా తయారవుతాయి.

మానవత

తల్లిపాల రుణం



కానిస్టేబుల్ ఎంఆర్ రమ్య

తల్లికి దూరమైన పన్నెండు రోజుల పసిపాప ఆకలితో ఏడుస్తోంది. ఆ ఏడుపు ఎక్కువై పరిస్థితి ఆందోళనకరంగా మారింది. 'పాపకు ఏమైనా అవుతుందేమో' అనే భయం ఆవరించింది. అలాంటి విపత్కర సమయంలో దేవుడు పంపిన మనిషిలా వచ్చింది కానిస్టేబుల్ రమ్య...

ఒక మహిళ గట్టిగా ఏడుస్తూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. 'ఏమైంది?' అని అడిగే లోపే తన బిడ్డను భర్త ఎత్తుకెళ్లిపోయాడని గుండెలు బాదుకుంది. తనకూ, భర్తకు మధ్య తగాదాలు జరుగుతున్నాయి. అతడి కోసం వెదికితే జాడలేదు.

'పాప ఎన్ని ఇబ్బందులు పడుతోందో!' అనే ఆందోళన అందరిలో మొదలైంది.

ప్రాథమిక దర్యాప్తులో అతడు బెంగళూరుకు పారిపోయే ప్రయత్నంలో ఉన్నాడని తెలుసుకున్నారు. చెక్‌పోస్ట్‌ల దగ్గర నిఘా పెట్టారు.

వయనాడ్ (కేరళ) సరిహద్దుల దగ్గర చెక్‌పోస్ట్‌లో బాధితురాలి భర్తను పట్టుకున్నారు పోలీసులు. అతడి చేతుల్లో పాప ఉంది. ఎప్పటి నుంచి ఏడుస్తుందో ఏడుస్తూనే ఉంది. పాపను తల్లి దగ్గరకు చేర్చాలంటే చాలా సమయం పట్టేట్లు ఉంది.

ఈలోపు పాప పరిస్థితి ఆందోళనకరంగా మారింది. పాప బతకాలంటే పాలు పట్టాలి. తల్లి ఎక్కడో దూరంలో ఉంది. ఈ పరిస్థితుల్లో దేవుడు పంపిన మనిషిలా ముందుకు వచ్చింది పోలీస్ కానిస్టేబుల్ ఎంఆర్ రమ్య.

పాప పరిస్థితి చూసి చలించిపోయింది. ఇంటి దగ్గరున్న తన పిల్లలు గుర్తువచ్చారామెకు. ఈ పాప తన మూడో పాప అనుకుంది. అక్కున చేర్చుకుని అమ్మలా పాలు పట్టింది. దాంతో ప్రమాదం తప్పింది.

'పాపను తల్లికి అప్పగించి ఊరికి వచ్చే సరికి చాలా పొద్దుపోయింది. విపరీతమైన ఆకలి.





ఏదైనా తిందామంటే ఒక్క దుకాణం కూడా తెరిచి లేదు. ఆ భయానకమైన ఆకలి కాస్తా ఈ రోజు నేను ఒక మంచిపని చేశాను అని గుర్తు తెచ్చుకోవడంతో మాయమైపోయింది' అంటుంది రమ్య.

> నిబద్ధత ఉన్న ఉద్యోగిగా, చల్లని మనసు ఉన్న తల్లిగా ఒకే సమయంలో రెండు విధులు నిజాయితీగా నిర్వహించావు. మానవత్వంపై ఆశ కోల్పోయిన వారిలో ఆశలు రేకెత్తించేలా చేశావు...

రమ్య చేసిన మంచిపని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. వారామెను సత్కరించి ప్రశంసించారు.

కేరళ హైకోర్టు జడ్జి జస్టిస్ దేవన్ రామచంద్రన్ రమ్యను ప్రశంసిస్తూ ఉత్తరం రాశారు.

అందులో ఇలా ఉంది...

'నువ్వు చేసిన మంచి పని పోలీస్ డిపార్ట్‌మెంట్ మానవతా దృక్పథానికి అద్దం పడుతుంది. నిబద్ధత ఉన్న ఉద్యోగిగా, చల్లని మనసు ఉన్న తల్లిగా ఒకే సమయంలో రెండు విధులు నిజాయితీగా నిర్వహించావు. మానవత్వంపై ఆశ కోల్పోయిన వారిలో ఆశలు రేకెత్తించేలా చేశావు...'

కోళికోడ్‌కు చెందిన రమ్యకు ఇద్దరు పిల్లలు. భర్త స్కూలు టీచర్. ఒకప్పుడు రమ్య పేరు పెద్దగా ఎవరికీ తెలియదు. అయితే పాపకు పాలు పట్టిన వార్తతో ఆమె పేరు అందరికీ సుపరిచితం అయింది.

ఎక్కడికి వెళ్లినా 'చల్లగా జీవించు తల్లీ' అనే దీవెనలు లభిస్తున్నాయి.

కిచెన్‌టిప్స్



● తేనె సీసాకు చీమలు పట్టకుండా ఉండాలంటే అందులో కొన్ని మిరియాలు వేసి ఉంచితే సరి!

● కాటన్ వస్త్రంలో టేబుల్ స్పూను బియ్యం వేసి మూటకట్టాలి. ఈ మూటను కాఫీ పొడి డబ్బా లేదా సీసాలో వేసి మూత గట్టిగా పెట్టి ఉంచితే కాఫీపొడి గడ్డకట్టదు.

● పాలల్లో కొన్ని రకాల హెల్త్ డ్రింక్ పొడులు వేసుకుని తాగుతుంటాం. ఈ పొడి గ్లాసు అడుగు భాగంలో కొంత అతుక్కుపోతుంటుంది. ఇటువంటప్పుడు గ్లాసులో ముందుగా పంచదార, తరువాత పొడి, పాలు పోసి కలిపితే గ్లాసుకి అతుక్కోకుండా పొడి చక్కగా పాలల్లో కలిసిపోతుంది.

యూత్ పల్స్

కావాలోయ్ గ్రీన్‌కాలర్ జాబ్!



ప్రతీకాత్మక చిత్రం

ఈజిప్ట్ వేదికగా జరుగుతున్న వాతావరణ సదస్సు 'కాప్- 27'తో భూతాపం, పర్యావరణంలో జరుగుతున్న మార్పులు, అడవుల పరిరక్షణ... మొదలైన విషయాలపై నాలుగు మాటలు గట్టిగానే వినబడుతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ ముఖచిత్రమైన యువతలో వాటి పట్ల ఆసక్తి ఏ మేరకు ఉంది? అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. గత కాలం సంగతి ఎలా ఉన్నా... ఈతరం మాత్రం పర్యావరణానికి సంబంధించిన విషయాలపై ఆసక్తి ప్రదర్శించడం, అవగాహన పెంచుకోవడం మాత్రమే కాదు 'గ్రీన్‌కాలర్ జాబ్' చేయడానికి ప్రాధాన్యత ఇస్తోంది...

సోషల్‌మీడియా విస్తృతి వల్ల వాతావరణ సంక్షోభం గురించిన అవగాహన, చర్చ అనేవి అంతర్జాతీయ సదస్సులు, జర్నల్స్‌కు మాత్రమే పరిమితం కావడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యావరణ సంక్షోభంపై మాటాముచ్చట పెరుగుతోంది. ఈ క్రమంలో యువతరంలో కొంతమంది పర్యావరణహిత ఉపాధి అవకాశాలపై అధిక ఆసక్తి చూపుతున్నారు.

ముంబైకి చెందిన దిశా సద్నాని పర్యావరణ ప్రేమికురాలు. రెగ్యులర్ జాబ్ కాకుండా పర్యావరణ పరిరక్షణలో భాగం అయ్యే ఉద్యోగం చేయాలనేది దిశ కల. ప్రస్తుతం ఒక కార్పొరేట్ సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న దిశ నీటి నుంచి పారిశుధ్యం వరకు రకరకాల ప్రాజెక్ట్‌లలో పనిచేస్తోంది.

పంజాబ్‌లోని లుథియానాకు చెందిన 25 సంవత్సరాల శౌర్య శర్మ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్. క్లైమెట్ కన్సల్టెన్సీకి సంబంధించిన ఉద్యోగం చేయాలనేది శర్మ కల. అయితే 'పేరు గొప్ప ఊరు దిబ్బ' లాంటి ఉద్యోగాలు, నాలుగు గోడల మధ్య ఉపన్యాసాలకే పరిమితం అయ్యే ఉద్యోగాలు చేయడం అతడికి ఇష్టం లేదు. ఊరూవాడా తిరగాలి. ప్రజలతో కలిసి పనిచేయాలి. పర్యావరణ పరిరక్షణలో నిర్మాణాత్మక అడుగు వేయాలనేది అతడి కల.

బ్రిటిష్ ఇంటర్నేషనల్ ఇంటర్‌నెట్-బేస్ట్ మార్కెట్ రీసెర్చ్ అండ్ డాటా ఎనలటిక్స్ సంస్థ 'యూ గోవ్' పర్యావరణ స్పృహకు సంబంధించిన అంశాలపై 18-35 ఏళ్ల వయసు ఉన్న వారిపై యూకే, యూఎస్, ఇండియా, పాకిస్థాన్, ఘనా... మొదలైన దేశాల్లో ఒక అధ్యయనం నిర్వహించింది.

పర్యావరణ సంక్షోభానికి సంబంధించిన పరిష్కారాలు వెదికే శక్తిసామర్థ్యాలు తమ తరానికి ఉన్నాయని యూత్‌లో 78 శాతం మంది నమ్ముతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే 'గ్రీన్ జాబ్' చేయడానికి 74 శాతం మంది ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ రంగంలో పనిచేస్తున్న యువత సంఖ్య తక్కువగా ఉంది. భవిష్యత్ మాత్రం ఆశాజనకంగా ఉంది.

కంపెనీల విషయానికి వస్తే... ఒకరిని ఉద్యోగంలోకి తీసుకోవడానికి కేవలం పర్యావరణ ప్రేమ మాత్రమే ప్రమాణంగా తీసుకోవడం లేదు. సాంకేతిక సామర్థ్యానికే పెద్ద పీట వేస్తున్నాయి.

సస్టెయినబిలిటీ మేనేజర్, సేఫ్టీ మేనేజర్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీర్ అనేవి మన దేశంలో టాప్-3 గ్రీన్ జాబ్స్. సాఫ్ట్‌వేర్, ఐటీ సర్వీసులు, మాన్యుఫాక్చరింగ్, ఎడ్యుకేషన్ రంగాలు 'గ్రీన్ టాలెంట్'కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి.

మాన్యుఫ్యాక్చరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ కంపెనీలు సస్టెయినబిలిటీ ఎనాలసిస్ట్, వాటర్ వేస్ట్ మేనేజిమెంట్ ఎక్స్‌పర్ట్, సోలార్ డిజైనర్స్, అర్బన్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ ఆఫీసర్స్, ఎన్విరాన్‌మెంట్ డాటాబేస్ అడ్మినిస్ట్రేటర్స్... మొదలైన నిపుణులకు ప్రాధాన్యత ఇస్తున్నాయి.

పునరుత్పాదకశక్తి, ఆరోగ్యం-భద్రత, సౌరశక్తి, పర్యావరణ సమతుల్యతను కాపాడడానికి సహజ వనరుల క్షీణతను నివారించడం... మొదలైనవి 'గ్రీన్ స్కిల్స్'కు ముఖ్యకేంద్రాలుగా ఉన్నాయి. మన దేశంలోని అగ్రశ్రేణి కళాశాలలు, యూనివర్శిటీలు పర్యావరణానికి సంబంధించిన ప్రత్యేక కోర్సులు ప్రవేశ పెట్టాయి. వాటిలో కొన్ని... గ్రీన్ ఎకానమీ ఫర్ బిజినెస్, ఎన్విరాన్‌మెంటల్ లా, క్లైమెట్ చేంజ్, క్లైమెట్ సైన్స్ అండ్ పాలసీ, గ్రీన్ ఎకనామీ, గ్రీన్ ఇన్నోవేషన్ ఫ్రమ్ నాలెడ్జ్ టు యాక్షన్, వేస్ట్ మేనేజ్‌మెంట్.

యువతరం సంప్రదాయ ఉద్యోగాలకు భిన్నంగా కొత్తరకం ఉద్యోగాలపై ఆసక్తి ప్రదర్శించడం విశేషం అయితే 'గ్రీన్ జాబ్'లు చేయాలనుకోవడం స్వాగతించ తగిన పరిణామం.

ఇది చాలదు... ఇంకా

పర్యావరణహిత ఉద్యోగాలలో కదలిక మొదలైంది. అయితే అది ఇంకా విస్తృతం కావాలి. పర్యావరణ స్పృహ అనేది జీవన విధానంగా మారాలి. క్లైమెట్ స్ట్రాటజీపై యువతరం దృష్టి పెట్టాలి. తమవైన పరిష్కార మార్గాల గురించి ఆలోచించాలి. వాతావరణానికి సంబంధించి ప్రస్తుత సంక్షోభ పరిస్థితులలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి కంపెనీ స్పెషల్ క్లైమెట్ యాక్షన్ టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలి. వాటిలో యువతరం క్రియాశీల పాత్ర పోషించాలి.



- శీతల్ పర్మార్, పర్యావరణ అంశాల బోధకురాలు, అహ్మదాబాద్



నాకౌట్ దశకు పంకజ్ అద్వానీ

ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ పంకజ్ అద్వానీ నాకౌట్ దశకు అర్హత సాధించాడు. టర్కీలో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో గ్రూప్ 'కె'లో ఉన్న పంకజ్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి గ్రూప్ టాపర్‌గా నిలిచాడు. తొలి మ్యాచ్‌లో పంకజ్ 3-0తో రెహమాన్ (టర్కీ)పై, రెండో మ్యాచ్‌లో 3-0తో సమీర్ (ఈజిప్ట్) పై, మూడో మ్యాచ్‌లో 3-0తో మార్కో రీజెర్స్ (నెదర్లాండ్స్)పై నెగ్గాడు. 37 ఏళ్ల పంకజ్ ఇప్పటి వరకు వివిధ ఫార్మాట్‌లలో కలిపి 25సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో లక్ష్య సేన్



ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఉత్తరాఖండ్‌కు చెందిన 21 ఏళ్ల లక్ష్య సేన్ రెండు స్థానాలు పురోగతి సాధించి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు ఐదో ర్యాంక్‌లో ఉంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ కెరీర్ బెస్ట్ ఏడో ర్యాంక్‌కు చేరుకోగా... మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం ఐదు స్థానాలు ఎగబాకి 23వ ర్యాంక్‌లో నిలిచింది.

విజేత గార్సియా



టెక్సాస్: మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ఫ్రాన్స్ క్రీడాకారిణి కరోలినా గార్సియా చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జరిగిన ఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంకర్ గార్సియా 7-6 (7/4), 6-4తో ప్రపంచ ఏడో ర్యాంకర్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. తద్వారా ఈ మెగా టోర్నీ చరిత్రలో అమెలీ మౌరెస్మో (2005లో) తర్వాత సింగిల్స్ టైటిల్ గెలిచిన రెండో ఫ్రాన్స్ క్రీడాకారిణిగా గార్సియా గుర్తింపు పొందింది. విజేతగా నిలిచిన గార్సియాకు 15 లక్షల 70 వేల డాలర్లు (రూ. 12 కోట్ల 76 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1,375 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. తాజా విజయంతో గార్సియా, సబలెంకా డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాల చొప్పున మెరుగుపర్చుకొని వరుసగా నాలుగు, ఐదు ర్యాంక్‌ల్లో నిలిచారు.

సెమీస్‌లో నరేందర్



అమ్మాన్ (జోర్డాన్): ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు 12వ పతకం ఖాయమైంది. పురుషుల ప్లస్ 92 కేజీల విభాగంలో నరేందర్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్యం ఖరారు చేసుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో నరేందర్ 5-0తో ఇమాన్ (ఇరాన్)పై గెలిచాడు. బుధవారం మొత్తం 12 వెయిట్ కేటగిరీల్లో భారత బాక్సర్లు సెమీఫైనల్ బౌట్‌లు ఆడనున్నారు.

ఫైనల్ పోరుకు చేరేదెవరు?



విలియమ్సన్

ఈ టి20 ప్రపంచకప్‌లో తొలి రౌండ్‌లో మొదలైన సంచలనాలు 'సూపర్ 12'లో ముగిశాయి. ఇప్పుడిక మేటి జట్ల మధ్య నాకౌట్ మెరుపులకు రంగం సిద్ధమైంది. వర్షం కురిస్తే రిజర్వ్ డే ఉందేమో కానీ ఓడితే మాత్రం ఇంకో మ్యాచ్ ఉండదు. ఇంటిముఖం పట్టాల్సిందే! అదృష్టం కలిసొచ్చిన పాకిస్తాన్ జట్టుతో నిలకడగా ఆడుతున్న న్యూజిలాండ్ నేడు జరిగే తొలి సెమీఫైనల్లో తలపడనుంది. సూపర్ ఫామ్‌లో ఉన్న న్యూజిలాండ్ టైటిల్ వేటలో తొలి అడుగు వేసేందుకు సై అంటుండగా... గత ప్రపంచకప్‌లో సెమీస్‌తో ముగిసిన తమ ప్రయాణాన్ని ఈసారి ఫైనల్ దాకా కొనసాగించాలని, 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించాలని పాకిస్తాన్ పట్టుదలతో ఉంది.

- న్యూజిలాండ్, పాకిస్తాన్ మధ్య తొలి సెమీఫైనల్ నేడు
- జోరు మీదున్న విలియమ్సన్ బృందం
- 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో బాబర్ ఆజమ్ జట్టు
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

సిడ్నీ: ఐసీసీ ప్రపంచకప్ టోర్నమెంట్‌లలో (వన్డే, టి20) ఇప్పటివరకు న్యూజిలాండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ ఓడిపోలేదు. కానీ ఈసారి పాకిస్తాన్ జట్టుకు గెలవడం అంత సులభం కాదేమో! బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ప్రతి విభాగంలో పాక్ కంటే ఎంతో మెరుగ్గా ఉన్న కివీస్ విజయమే లక్ష్యంగా టి20 ప్రపంచకప్ తొలి సెమీఫైనల్లో బరిలోకి దిగుతోంది. పడుతూ లేస్తూ వచ్చిన బాబర్ ఆజమ్ బృందం ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే సర్వశక్తులు ఒడ్డితేనే ముందడుగు వేస్తుంది. లేదంటే గత ఏడాది మాదిరిగానే ఈసారీ సెమీఫైనల్లో నిష్క్రమించాల్సి వస్తుంది. చివరిసారి 2009 టి20 ప్రపంచకప్‌లో ఫైనల్ చేరి విజేతగా నిలిచిన పాక్ ఆ తర్వాత ఫైనల్ చేరలేకపోయింది.

పిచ్, వాతావరణం

సిడ్నీ పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామం కావడంతో మెరుపులకు కొదవే ఉండదు. కివీస్, ఆసీస్‌ల మధ్య 'సూపర్ 12' తొలి మ్యాచ్‌కు ఉపయోగించిన పిచ్‌పైనే తొలి సెమీస్‌ను ఆడిస్తున్నారు. దీంతో పాక్‌కంటే న్యూజిలాండ్‌కే కాస్త అనుకూలం ఎందుకంటే ఆ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుపై 200 పరుగులు చేసింది. ఉదయం చినుకులు కురిసే అవకాశమున్నప్పటికీ మ్యాచ్ సమయానికి ఏ ఇబ్బంది ఉండదు.

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో...

ఈ టోర్నీ ఆరంభం నుంచి కూడా న్యూజిలాండ్ నిలకడైన ప్రదర్శనతో విజయాలు సాధిస్తూ వచ్చింది. ఒక్క ఇంగ్లండ్ మ్యాచ్‌లో మినహా ప్రతి మ్యాచ్‌లోనూ పెద్ద తేడాతోనే నెగ్గుకొచ్చింది. ఆతిథ్య ఆసీస్‌నైతే 89 పరుగులతో ఓడించింది. టాపార్డర్‌లో ఓపెనర్లు అలెన్, డెవాన్ కాన్వే, కెప్టెన్ విలియమ్సన్ సహా నాలుగో వరుసలో గ్లెన్ ఫిలిప్స్ రాణిస్తున్నారు. ముఖ్యంగా లంకతో జరిగిన పోరులో టాపార్డర్ మూకుమ్మడిగా విఫలమైనా... ఫిలిప్స్ ఒంటిచేత్తో శతక్కొట్టి గెలుపును ఖాయం చేశాడు. బౌలింగ్‌లో బౌల్ట్, సౌతీ, సాన్‌ట్నర్, ఫెర్గూసన్, సోధి ప్రత్యర్థి బ్యాటర్స్‌ను ఇబ్బంది పెడుతున్నారు. బౌల్ట్ మినహా మిగతా నలుగురు బౌలర్లు ప్రతీ మ్యాచ్‌లోనూ వికెట్లను పడగొట్టారు. .

ఒత్తిడిలో బాబర్ జట్టు

పాకిస్తాన్ ఈ టోర్నీలో సాధారణ ప్రదర్శనతోనే నెట్టుకొచ్చింది. అదృష్టంతో ఇప్పుడు నాకౌట్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. అయితే ఇక్కడ మాత్రం అదృష్టాన్ని నమ్ముకుంటే కుదరదు... మెరుపుల్లేని ఓపెనింగ్ జోడీ రిజ్వాన్, బాబర్ బ్యాట్ ఝుళిపించాల్సిందే. మిడిలార్డర్‌లో ఇఫ్తికార్, షాన్ మసూద్ ఆదుకుంటున్నారు. బౌలింగ్ కూడా రాటుదేలితేనే పటిష్టమైన న్యూజిలాండ్‌ను ఢీకొట్టగలదు. లేదంటే ఇక్కడితోనే ఇంటిబాట ఖాయం!



జట్లు (అంచనా)

న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), అలెన్, డెవాన్ కాన్వే, ఫిలిప్స్, మిచెల్, నీషమ్, సాన్‌ట్నర్, టిమ్ సౌతీ, ట్రెంట్ బౌల్ట్, సోధి, ఫెర్గూసన్.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), రిజ్వాన్, హారిస్, షాన్ మసూద్, ఇఫ్తికార్, నవాజ్, షాదాబ్ ఖాన్, వసీమ్, నసీమ్ షా, షాహిన్ అఫ్రిది, హారిస్ రవూఫ్.

3 న్యూజిలాండ్‌తో జరిగిన మూడు ప్రపంచకప్ సెమీఫైనల్స్‌లో (1992, 1999 వన్డే వరల్డ్‌కప్, 2007 టి20 ప్రపంచకప్) పాకిస్తాన్ జట్టే గెలిచింది.

17 అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో ఓవరాల్‌గా న్యూజిలాండ్, పాక్ జట్ల మధ్య 28 మ్యాచ్‌లు జరిగాయి. 17 మ్యాచ్‌ల్లో పాక్ గెలుపొందగా... 11 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ విజయం సాధించింది.



ఆతిథ్య జట్టు అజేయంగా..

- ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో కలిసొస్తున్న తొలి మ్యాచ్

తొమ్మిది దశాబ్దాల చరిత్ర కలిగిన ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో 2006 నుంచి తొలి మ్యాచ్‌లో ఆతిథ్య దేశం ఉండేలా అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య షెడ్యూల్ రూపొందిస్తోంది. గత నాలుగు ప్రపంచకప్‌లలోనే కాకుండా అంతకుముందు జరిగిన ప్రపంచకప్‌లలోనూ ఆతిథ్య దేశం తాము ఆడిన తొలి మ్యాచ్‌లో శుభారంభం చేసింది. ప్రత్యర్థి ఎంతటి జట్టయినా ఆతిథ్య జట్టు గెలవడం లేదంటే 'డ్రా' చేయడం జరిగింది.

గతంలో వరుసగా 11 సార్లు ఆసియా క్వాలిఫయింగ్ దశలోనే నిష్క్రమించిన ఖతర్ జట్టు ఆతిథ్య దేశం హోదాలో తొలిసారి ప్రపంచకప్ టోర్నమెంట్‌లో బరిలోకి దిగుతోంది. 12 ఏళ్ల క్రితం ఆతిథ్య హక్కులు పొందిన వెంటనే ఖతర్ జట్టు సన్నాహాలు మొదలయ్యాయి. ఈసారి ప్రధాన టోర్నీలో నేరుగా ఆడే అవకాశం రావడంతో మంచి ప్రదర్శనతో ఆకట్టుకోవాలని పట్టుదలతో ఉంది. ఈనెల 20న జరిగే ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్‌లో ఈక్వెడార్‌తో ఖతర్ ఆడుతుంది. ఇప్పటివరకు ఆతిథ్య జట్లకు తాము ఆడిన తొలి మ్యాచ్‌లలో అనుకూల ఫలితాలే వచ్చాయి. ఈ సంప్రదాయాన్ని ఖతర్ కూడా కొనసాగిస్తూ విజయంతో బోణీ కొడుతుందో, లేదంటే 'డ్రా'తో పాయింట్ల ఖాతా తెరుస్తుందో వేచి చూడాలి. 2018 ప్రపంచకప్‌లో ఆతిథ్య దేశం రష్యా తొలి మ్యాచ్‌లో 5-0తో సౌదీ అరేబియాను ఓడించగా... 2014 మెగా ఈవెంట్‌లో బ్రెజిల్ 3-1తో క్రొయేషియాపై గెలిచింది. 2010 టోర్నీలో దక్షిణాఫ్రికా తొలి మ్యాచ్‌ను మెక్సికోతో 1-1తో 'డ్రా' చేసుకుంది. 2006లో జర్మనీ 4-2తో కోస్టారికాను ఓడించి శుభారంభం చేసింది. 2002లో దక్షిణ కొరియా-జపాన్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వగా... తమ తొలి మ్యాచ్‌ల్లో కొరియా 2-0తో పోలాండ్‌పై గెలుపొందగా... బెల్జియంతో జరిగిన మ్యాచ్‌ను జపాన్ 2-2తో 'డ్రా'గా ముగించింది. 1998లో ఆతిథ్య ఫ్రాన్స్ జట్టు తమ తొలి మ్యాచ్‌లో 3-0తో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. 1994లో ఆతిథ్య అమెరికా దేశం తొలి మ్యాచ్‌ను స్విట్జర్లాండ్‌తో 1-1తో 'డ్రా' చేసుకుంది. 1990లో ఇటలీ జట్టు తొలి మ్యాచ్‌లో 1-0తో ఆస్ట్రియాను ఓడించింది. 1986లో మెక్సికో జట్టు 2-1తో బెల్జియంపై గెలిచింది. 1982లో స్పెయిన్ తొలి మ్యాచ్‌ను హోండూరస్‌తో 1-1తో 'డ్రా'గా ముగించింది. 1978లో ఆతిథ్య అర్జెంటీనా జట్టు 2-1తో హంగేరిపై గెలిచింది. 1974లో పశ్చిమ జర్మనీ 1-0తో చిలీపై నెగ్గగా, 1970లో మెక్సికో 0-0తో సోవియట్ యూనియన్‌తో... 1966లో ఇంగ్లండ్ 0-0తో ఉరుగ్వేతో 'డ్రా' చేసుకుంది. 1962లో చిలీ 3-1తో స్విట్జర్లాండ్‌పై... 1958లో స్వీడన్ 3-0తో మెక్సికోపై.. 1954లో స్విట్జర్లాండ్ 2-1తో ఇటలీపై... 1950లో బ్రెజిల్ 4-0తో మెక్సికోపై.. 1938లో ఫ్రాన్స్ 3-1తో బెల్జియంపై... 1934లో ఇటలీ 7-1తో అమెరికాపై... 1930లో ఉరుగ్వే 3-1తో పెరూపై విజయం సాధించాయి.

–సాక్షి క్రీడావిభాగం



సినిమా



పుష్పలో అల్లు అర్జున్

చిత్తూరు సుట్టూ తిరగతాంది

సినిమా ఇప్పుడు ఒక్క భాష.. ఒక్క యాసకి పరిమితం కావడంలేదు. 'పాన్ ఇండియా' అయిపోయింది. అందుకే కథకు తగ్గ 'యాస' చుట్టూ సినిమా తిరుగుతోంది. ఇప్పుడు చిత్తూరు యాస సుట్టూ సినిమా తిరగతాంది! అన్ని సినిమాలూ కాదనుకోండి... అయితే ఇంతకుముందు వరకూ పెద్దగా వినపడని ఈ యాస ఇప్పుడు నాలుగైదు సినిమాల్లో వినబడుతోంది. ఇప్పటికే 'అరవింద సమేత వీర రాఘవ'లో ఎన్టీఆర్, 'పుష్ప 1' లో అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోలు చిత్తూరు యాసలో మాట్లాడి, అలరించారు. ప్రస్తుతం చిత్తూరు యాస నేపథ్యంలో 'పుష్ప 2', 'హరోం హర', 'వినరో భాగ్యము విష్ణుకథ', 'అలిపిరికి అల్లంత దూరంలో', 'అమ్మాయిలు అర్థం కారు' వంటి చిత్రాలు రూపొందుతున్నాయి. వాటిపై ఓ లుక్కేద్దాం.



'హరోం హర'లో సుధీర్‌బాబు



'వినరో...'లో కిరణ్ అబ్బవరం

పులిపెక్కి పోతాండవంట..

'ఏం పాప.. నచ్చినానా నీకు', 'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైరు', 'పుష్ప.. పుష్పరాజ్.. తగ్గేదే లే'.. అంటూ 'పుష్ప' తొలి భాగంలో అల్లు అర్జున్ చెప్పిన డైలాగులు ఎంత పాపులర్ అయ్యాయో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. 'హే ఛీ ఛీ.. నువ్వు నాకు నచ్చేదేంది.. నేను నిన్ను సూల్లేదని ఓ పులిపెక్కి పోతాండవంట గదా' అంటూ రష్మికా మందన్న చెప్పిన మాటలు కుర్రాళ్ల హృదయాన్ని తాకాయి. చిత్తూరు సమీపంలోని శేషాచలం అడవుల్లో విరివిగా ఉండే ఎర్రచందనం నేపథ్యంలో దర్శకుడు సుకుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అల్లు అర్జున్, రష్మిక, సునీల్... ఇలా అన్ని పాత్రలు చిత్తూరు యాసలోనే మాట్లాడతాయి. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఇక 'పుష్ప 2' రానుంది. తొలి భాగంలో నటించిన వారే రెండో భాగంలోనూ ఉంటారు.

నీ కోసం సూస్తా ఉండారు..

'సుబ్రహ్మణ్యం అన్న.. జనాలు నీ కోసం సూస్తా ఉండారు.. అట్లా కదలకుండా ఉంటే ఎట్లా.. ఏందో కటి సెప్పు', 'ఇంగ సెప్పేదేం లేదో.. సేసేదే' వంటి చిత్తూరు యాస డైలాగులు 'హరోం హర' సినిమా మోషన్ టీజర్‌లో వినిపించాయి. సుధీర్ బాబు హీరోగా జ్ఞానసాగర్ దర్శకత్వంలో 'హరోం హర' సినిమా రూపొందుతోంది. సుమంత్ జి. నాయుడు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన 1989 నాటి కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది.

మాది తిరపతి.. నా పేరు విష్ణు

'ఏడు వింతల గురించి మాకు పెద్దగా తెలీదన్నా.. మా జీవితాలన్నీ ఏడుకొండల సుట్టూ తిరగతా ఉంటాయి, మాది తిరపతి.. నా పేరు విష్ణు' అంటూ 'వినరో భాగ్యము విష్ణుకథ' చిత్రం టీజర్‌లో హీరో కిరణ్ అబ్బవరం చెప్పే చిత్తూరు యాస డైలాగులు ఆసక్తిగా ఉన్నాయి. కిరణ్ అబ్బవరం, కశ్మీరా పరదేశి జంటగా మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణుకథ'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించారు. తిరుపతి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం 2023 ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది.

ఇవే కాదు.. మీడియమ్, స్మాల్ రేంజ్ చిత్రాల్లోనూ చిత్తూరు యాస వినపడనుంది. వాటిలో రావణ్ నిట్టూరు, శ్రీ నిఖిత, అలంకృత షా, బొమ్మకంటి రవీందర్ కీలక పాత్రల్లో డైరెక్టర్ నందినీ రెడ్డి శిష్యుడు ఆనంద్ జె. దర్శకత్వం వహించిన 'అలిపిరికి అల్లంత దూరంలో' ఒకటి. రమేష్ డబ్బుగొట్టు, రెడ్డి రాజేంద్ర పి. నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలకానుంది. అలాగే నరసింహ నంది దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'అమ్మాయిలు అర్థంకారు'. అల్లం శ్రీకాంత్, ప్రశాంత్, కమల్, మీరావలి, సాయిదివ్య, ప్రియాంక, స్వాతి, శ్రావణి హీరోహీరోయిన్లుగా నటించారు. నందిరెడ్డి విజయలక్ష్మి రెడ్డి, కర్ర వెంకట సుబ్బయ్య నిర్మించిన ఈ సినిమా కూడా చిత్తూరు యాస నేపథ్యంలో ఉంటుంది. ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

ఇంకా చిత్తూరు యాస సుట్టూ తిరిగే కథలు కొన్ని ఉన్నాయి.




కార్తీ

జపాన్ ఫిక్స్

కార్తీ హీరోగా నటించనున్న 25వ సినిమాకు 'జపాన్' అనే టైటిల్ ఖరారైంది. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు మంగళవారం చెన్నైలో జరిగాయి. ''సగుని, కాష్మోరా, ధీరన్ అధిగారమ్ ఒండ్రు, ఖైదీ, సుల్తాన్' చిత్రాల తర్వాత డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌లో కార్తీ చేస్తున్న ఆరో చిత్రం 'జపాన్'. ఈ సినిమాలో సునీల్ కీలక పాత్ర చేస్తున్నారు. సినిమాటోగ్రాఫర్, దర్శకుడు విజయ్ మిల్టన్ తొలిసారిగా ఈ సినిమాలో నటిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కెమెరా: రవివర్మన్.

అనంతపురంలో వీరసింహారెడ్డి



బాలకృష్ణ

అనంతపురంకు షిఫ్ట్ అయ్యారు వీరసింహారెడ్డి. బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వీరసింహారెడ్డి'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో దునియా విజయ్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రం కొత్త షెడ్యూల్ బుధవారం అనంతపురంలో ప్రారంభం కానుంది. అనంతపురంలోని పెన్నా అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, ఉరవకొండ, పెనుగొండ ఫోర్ట్ లొకేషన్స్‌లో చిత్రీకరణను ప్లాన్ చేశారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి రిలీజ్ కానుంది. ఈ చిత్రా నికి సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చందు రావిపాటి.

కష్టమే... కానీ పోరాడుతున్నాను – సమంత




''కథలు, క్యారెక్టర్స్ ఎంపిక చేసుకునేటప్పుడు ఇంతకుముందు నేను చేసిన సినిమాలకు భిన్నంగా, కొత్తగా ఉండాలని ఆలోచిస్తాను. 'యశోద' కంటే ముందు 'యు-టర్న్' అనే థ్రిల్లర్ మూవీ చేశాను. కానీ యాక్షన్ పరంగా, కథ పరంగా 'యశోద' కొత్తగా ఉంటుంది'' అని సమంత అన్నారు. సమంత టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'యశోద'. హరి-హరీష్ ద్వయం దర్శకత్వంలో ఈ సినిమాను శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా సమంత చెప్పిన విశేషాలు.

- సాధారణంగా నేను ఏదైనా స్క్రిప్ట్‌ను ఓకే చేయడానికి ఒక రోజు టైమ్ తీసుకుంటాను. కానీ 'యశోద' కథకు వెంటనే ఓకే చెప్పాను. పవర్‌ఫుల్ స్టోరీ ఇది. కథ విని థ్రిల్ అయ్యా. థియేటర్స్‌లో ప్రేక్షకులు కూడా థ్రిల్ అవుతారనే నమ్మకం ఉంది. హరి-హరీష్‌లు ఓ కొత్త కాన్సెప్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. దర్శకులు కథ, స్క్రీన్‌ప్లే రాసిన విధానం, స్క్రీన్ మీదకు తీసుకు వచ్చిన తీరు, ఫైట్స్, సెట్స్, మణిశర్మగారి మ్యూజిక్... ఇలా ప్రతి అంశం సూపర్.
- 'యశోద' సినిమాలో ఏం ఉందో అదే ట్రైలర్‌లో చూపించాం. ప్రేక్ష కులు బాగా రిసీవ్ చేసుకున్నారు. ఇక సరోగసీ (యశోద సినిమా సరోగసీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది)పై నాకు బలమైన అభిప్రాయం లేదు. తల్లిదండ్రులు కావాలనుకునేవారికి అదొక పరిష్కారం మాత్రమే. వాళ్ల ఆశలకు ఆయువు పోస్తుంది.
- 'ది ఫ్యామిలీమేన్ 2' వెబ్ సిరీస్‌లోని రాజీ పాత్రకోసం తొలిసారి యాక్షన్ చేశాను. ఇప్పుడు 'యశోద' కోసం చేశాను. ఫైట్ మాస్టర్స్ యానిక్ బెన్, వెంకట్ గార్లు మంచి యాక్షన్ సీన్స్ డిజైన్ చేశారు. వీటి కోసం చాలా ప్రిపేర్ అయ్యాను. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ గారు సినిమా గొప్పగా ఉండాలని తపిస్తుంటారు. అందుకు తగ్గట్లుగానే ఖర్చుకు వెనకాడకుండా నిర్మించారు.
- 'యశోద'కు నేనే డబ్బింగ్ చెప్పాలని ముందే డిసైడ్ అయ్యాను. ఓ ఆర్టిస్టు ప్రాణం పెట్టి ఓ సినిమా చేశారంటే.. వారే ఆ సినిమాకు డబ్బింగ్ చెప్పాలనుకుంటారు. నేనూ అంతే. నాలో ఆ పట్టుదల ఉంది. సవాళ్లు ఎదరైనప్పటికీ డబ్బింగ్ చెప్పగలిగినందుకు హ్యాపీగా ఉంది.

అంతిమంగా మనదే విజయం

మయోసైటిస్ (కండరాలకు సంబంధించిన వ్యాధి)తో బాధపడుతున్నట్లు సమంత ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. తన అనారోగ్యం గురించి సమంత తాజాగా స్పందిస్తూ.. ''మన జీవితాల్లో కొన్ని మంచి రోజులు, కొన్ని చెడ్డ రోజులు ఉంటాయని నా సోషల్ మీడియా పోస్ట్‌లో నేను చెప్పినట్లున్నాను. ఒక్కో రోజైతే ఇంకొక్క అడుగు కూడా ముందుకు వేయలేనేమో అనిపిస్తుంది. కానీ వెనక్కి తిరిగి ఆలోచిస్తుంటే ఇంత దూరం వచ్చానా? అని అనిపిస్తుంటుంది (భావోద్వేగానికి లోనవుతూ...). నేను ఫైట్ చేయాల్సి ఉంది. నేనే కాదు.. నాలా చాలామంది విభిన్న రకాల సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కానీ అంతిమంగా మనమే విజయం సాధిస్తాం. అయితే నేను ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్నట్లు కొన్ని కథనాలు చదివాను. కానీ ప్రస్తుతం నేను ఉన్న ఈ స్థితి ప్రాణాంతకం కాదు. ప్రస్తుతానికైతే నేను చావలేదు (సరదాగా). సో.. నా ఆరోగ్యం గురించి అలాంటి హెడ్‌లైన్స్ అనవసరం. కష్టమే... కానీ నేను పోరాడుతున్నాను.



పల్లెటూరి ప్రేమ



రణధీర్, నందిని

రణధీర్, నందిని జంటగా ఎం. వినయ్ బాబు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సీతా రామపురంలో ఒక ప్రేమ జంట..'. శ్రీ ధనలక్ష్మీ మూవీస్ పతాకంపై బీసు చందర్ గౌడ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ– ''గ్రామీణ నేపథ్యంలో జరిగే విభిన్నమైన ప్రేమకథా చిత్రమిది. అద్భుతమైన ట్విస్ట్‌లతో ఈ సినిమాను ఆసక్తిగా తెరక్కించారు వినయ్‌బాబు. అంతర్లీనంగా మంచి సందేశం కూడా ఉంటుంది'' అన్నారు. ''ఈ చిత్రంలో మంచి కంటెంట్‌తో పాటు కమర్షియల్ అంశాలున్నాయి. మా నిర్మాత రాజీపడకుండా నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు, పాటలకు మంచి స్పందన వస్తోంది'' అని ఎం. వినయ్ బాబు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కుమార్ ఎ, సంగీతం: ఎస్.ఎస్. నివాస్.

ఆ సీన్ కోసం తక్కువ తిన్నా!



జెన్నిఫర్

ఉదయ్ శంకర్, జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ జంటగా గురుపవన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నచ్చింది గాళ్ ఫ్రెండూ'. ఆర్ సౌజన్య సమర్పణలో అట్లూరి నారాయణరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో జెన్నిఫర్ మాట్లాడుతూ – ''నా స్వస్థలం ముంబై. ఇంగ్లీష్ లిటరేచర్‌లో మాస్టర్స్ చేసిన తర్వాత జర్నలిజంలో డిప్లొమా కోర్సు చేశాను. ఆ తర్వాత యాక్టింగ్ కోర్సులో జాయిన్ అయ్యాను. వెస్ట్రన్ డాన్సులతో పాటు భరత నాట్యం వంటి సంప్రదాయ నృత్యాలు నేర్చుకున్నాను. అవకాశాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో నాకు 'బాయ్స్ విల్ బీ బాయ్స్' అనే తెలుగు సినిమాలో నటించే అవకాశం వచ్చింది. కానీ ఈ సినిమా ఇంకా విడుదల కాలేదు. అయితే సినిమాటోగ్రాఫర్‌గా చేసిన మనోహర్‌గారు 'నచ్చింది గాళ్ ఫ్రెండూ'కు నన్ను ప్రిఫర్ చేశారు. ఈ చిత్రంలో రెండు షేడ్స్ ఉన్న సంధ్య అనే పాత్ర చేశాను. కొన్ని సన్నివేశాల కోసం బికినీ ధరించాను. అయితే దర్శకుడు నన్ను అందంగా చూపించారు కానీ అసభ్యంగా చూపించలేదు. అలాగే ఓ సీన్ కోసం రెండు రోజులు చాలా తక్కువ ఫుడ్ తీసుకున్నాను. దర్శకులు గురు పవన్‌గారికి కథ పట్ల మంచి క్లారిటీ ఉంది. తెలుగులో నాకు నచ్చిన హీరో ఎన్టీఆర్, హీరోయిన్స్‌లో సమంత అంటే ఇష్టం'' అని అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	235	61,185
నిఫ్టీ ▲	86	18,203

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,716	▲	153
డోజోన్స్	33,317	▲	490
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,306	▲	6
డాక్స్	13,689	▲	155
షాంఘై	3,064	▼	13
నికాయ్	27,872	▲	344

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బీఎస్‌ఈ లాభాల్లో క్షీణత

క్యూ2లో రూ. 34 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) రెండో త్రైమాసికంలో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్‌ఈ లిమిటెడ్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం దాదాపు సగానికి క్షీణించి రూ. 34 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 65 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 6 శాతం పుంజుకుని రూ. 240 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 226 కోట్ల ఆదాయం నమోదైంది. అయితే నిర్వహణ మార్జిన్లు 28 శాతం నుంచి 7 శాతానికి భారీగా పతనమయ్యాయి. ఇందుకు కారణాలను ఎక్స్ఛేంజీ వెల్లడించలేదు. కాగా.. మొత్తం వ్యయాలు 36 శాతం పెరిగి రూ. 184 కోట్లను దాటాయి. ఎక్స్ఛేంజీలో రిజిస్టరైన మొత్తం ఇన్వెస్టర్ల ఖాతాలు 11.7 కోట్లకు ఎగశాయి. రోజువారీ సగటు టర్నోవర్ ఈక్విటీ విభాగంలో 17 శాతం వృద్ధితో రూ. 4,740 కోట్లను తాకగా.. డెరివేటివ్స్ నుంచి 88 శాతం అధికంగా రూ. 2.26 లక్షల కోట్లు చొప్పున నమోదైంది. కరెన్సీ డెరివేటివ్స్‌లో సైతం సగటు టర్నోవర్ 31 శాతం ఎగసి రూ. 32,161 కోట్లకు చేరింది.



బజాజ్ ఎలక్ట్రికల్స్ లాభం రూ.62 కోట్లు

న్యూఢిల్లీ: ఎలక్ట్రికల్ ఉత్పత్తులు, ఉపకరణాల తయారీ దిగ్గజం బజాజ్ ఎలక్ట్రికల్స్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో రూ.62 కోట్ల నికరలాభం ఆర్జించింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.62.5 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ 6.81 శాతం తగ్గి రూ.1,159 కోట్లుగా ఉంది. కన్జూమర్ ప్రొడక్ట్స్ ఆదాయం 2.45 శాతం తగ్గి రూ.883 కోట్లు, లైటింగ్ సొల్యూషన్స్ విభాగం 3.73 శాతం క్షీణించి రూ.276 కోట్లు, ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ సెగ్మెంట్ 39.4 శాతం పడిపోయి రూ.67 కోట్లకు వచ్చి చేరింది. ఆర్డర్ బుక్ అక్టోబర్ 1 నాటికి రూ.1,554 కోట్లు ఉందని కంపెనీ వెల్లడించింది. క్రితం ముగింపుతో పోలిస్తే బజాజ్ ఎలక్ట్రికల్స్ షేరు ధర బీఎస్‌ఈలో మంగళవారం 0.47 శాతం పెరిగి రూ.1,158.55 వద్ద స్థిరపడింది.



జూబిలెంట్ ఫుడ్ లాభం అప్



క్యూ2లో రూ. 131 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో ఫాస్ట్ ఫుడ్ చైన్ దిగ్గజం జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ పటిష్ట ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 131 కోట్లను అధిగమించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 120 కోట్లు ఆర్జించింది. డామినోస్ పిజ్జా, డంకిన్ డోనట్స్ కంపెనీ ఆదాయం 17 శాతం ఎగసి రూ. 1,301 కోట్లను తాకింది. అయితే మొత్తం వ్యయాలు 20 శాతం పెరిగి రూ. 1,154 కోట్లకు చేరాయి. ఈ కాలంలో 76 డామినోస్ స్టోర్లను కొత్తగా ప్రారంభించింది.

గోద్రెజ్ కన్జూమర్ లాభం డౌన్



క్యూ2లో రూ. 359 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం గోద్రెజ్ కన్జూమర్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 25 శాతం క్షీణించి రూ. 359 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 479 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 3,144 కోట్ల నుంచి 7 శాతం పుంజుకుని రూ. 3,364 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 14 శాతంపైగా పెరిగి రూ. 2,951 కోట్లను దాటాయి. దేశీ ఆదాయం 8 శాతం పుంజుకుని రూ. 1,985 కోట్లను తాకింది. ఇండోనేసియా నుంచి 8 శాతం అధికంగా రూ. 409 కోట్ల టర్నోవర్ సాధించింది.

చమురు పీఎస్‌యూలకు భారీ నష్టాలు

- క్యూ2లో ఉమ్మడిగా రూ. 2,749 కోట్లు
- తొలి అర్ధభాగంలో రూ. 21,201 కోట్లు



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజాలు ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో ఉమ్మడిగా రూ. 2,749 కోట్ల నికర నష్టాలు ప్రకటించాయి. అయితే తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో ఇవి మరింత అధికమై రూ. 21,201 కోట్లకు చేరాయి. ఇందుకు పెట్రోల్, డీజిల్ తదితర ప్రొడక్టులను తయారీ వ్యయాలకంటే తక్కువ ధరలో విక్రయించడం ప్రభావం చూపింది. అయితే క్యూ2లో ప్రభుత్వం ఎల్‌పీజీ విక్రయాలపై వీటికి ఉమ్మడిగా రూ. 22,000 కోట్ల నష్టపరిహారాన్ని చెల్లించింది. దీంతో క్యూ1(ఏప్రిల్–జూన్)తో పోలిస్తే క్యూ2లో చమురు పీఎస్‌యూల నష్టాలు పరిమితమయ్యాయి. వెరసి చమురు పీఎస్‌యూల చరిత్రలో తొలిసారి వరుసగా రెండు త్రైమాసికాలలో నికర నష్టాలు ప్రకటించిన రికార్డు నమోదైంది. స్థూల రిఫైనింగ్ మార్జిన్లు(జీఆర్‌ఎం) మెరుగుపడినప్పటికీ 7 నెలలుగా ధరలను సవరించకపోవడంతో నష్టాలు వాటిల్లినట్లు ప్రభుత్వ దిగ్గజాలు పేర్కొన్నాయి. కాగా.. క్యూ1లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 10,197 కోట్ల నికర నష్టాన్ని హెచ్‌పీసీఎల్ ప్రకటించింది. ఈ బాటలో బీపీసీఎల్ రూ. 6,263 కోట్లు, ఐవోసీ రూ. 1,995 కోట్లు చొప్పున నష్టాలు నమోదు చేయడం గమనార్హం!

ఎల్‌పీజీ సబ్సిడీ ఇలా

ప్రభుత్వం ప్రకటించిన ఎల్‌పీజీ విక్రయాల సబ్సిడీని చమురు పీఎస్‌యూలు క్యూ2 ఫలితాలలో పరిగణనలోకి తీసుకున్నాయి. ఐవోసీ అత్యధికంగా రూ. 10,800 కోట్లు అందుకోగా.. హెచ్‌పీసీఎల్‌కు రూ. 5,617 కోట్లు, బీపీసీఎల్‌కు రూ. 5,582 కోట్లు చొప్పున లభించాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ద్రవ్యోల్బణానికి చెక్ పెట్టేందుకు వీలుగా పెట్రోల్, డీజిల్ ధరల సవరణను చేపట్టలేదని చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పేర్కొన్నారు. దీంతో ఇంధన రంగ పీఎస్‌యూలకు సబ్సిడీ చెల్లింపుల ద్వారా ఆర్థిక శాఖ నుంచి మద్దతును కోరినట్లు తెలియజేశారు.

మార్కెట్లో న్యూఏజ్ టెక్ షేర్ల వెల్లువ

- ఈ నెలలో ముగియనున్న లాకిన్ గడువు
- జాబితాలో పలు టెక్ స్టార్టప్ కంపెనీలు
- పేటీఎమ్, జొమాటో, పీబీ ఫిన్‌టెక్, నైకా
- పతన బాట పట్టనున్న పలు కౌంటర్లు!



గత కొద్ది నెలలుగా పబ్లిక్ ఇష్యూలకు వచ్చి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన పలు కొత్తతరం (న్యూఏజ్) టెక్ కంపెనీల షేర్లు కొద్ది రోజులుగా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇందుకు ఐపీవోకు ముందు కంపెనీలో ఇన్వెస్ట్ చేసిన సంస్థల షేర్లపై లాకిన్ గడువు తీరనుండటం కారణమవుతోంది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఐపీవోకు ముందు కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లు లేదా 20 శాతానికి మించిన ప్రమోటర్ల వాటాకు లాకిన్ గడువును ఏడాది నుంచి ఆరు నెలలకు కుదించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నిబంధనలు అమల్లోకి వచ్చాయి. వివరాలు చూద్దాం..

గతేడాది నవంబర్ మొదలు ఈ ఏడాది మే నెల వరకూ పబ్లిక్ ఇష్యూలకు వచ్చిన పలు న్యూఏజ్, ఫిన్‌టెక్ కంపెనీలు, స్టార్టప్‌ల షేర్లకు లాకిన్ గడువు ఈ నెలలో ముగియనుంది. 12 నెలల నుంచి 6 నెలల గడువు తీరనుండటమే దీనికి కారణం. నేటి నుంచి క్యాంపస్ యాక్టివ్‌వేర్ షేర్లు అందుబాటులోకి రానుండగా.. ఎఫ్‌ఎస్‌ఎన్ ఈకామర్స్, రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ షేర్లకు రేపు(10న) లాకిన్ గడువు తీరనుంది. ఈ జాబితాలో ఫినో పేమెంట్స్ బ్యాంక్(12న), పీబీ ఫిన్‌టెక్(15న), పేటీఎమ్, శాఫైర్ ఫుడ్స్(18న), డెల్హివరీ(24న), టార్సన్స్ ప్రొడక్ట్స్(26న) పారదీప్ ఫాస్ఫేట్స్(27న), గో ఫ్యాషన్ ఇండియా(30న) తదితరాలున్నాయి. దీంతో ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలను తాకనున్నాయి. వెరసి పలు కంపెనీల కౌంటర్లలో అందుబాటులోని ఈక్విటీ ఒక్కసారిగా పెరగనుంది. అయితే నైకా, రెయిన్‌బో చిల్డ్రన్స్, క్యాంపస్ యాక్టివ్‌వేర్, శాఫైర్ ఫుడ్స్, గోకలర్స్ తదితర కొన్ని కౌంటర్లు ఐపీవో ధరతో పోలిస్తే భారీ లాభాలతో ట్రేడవుతున్నాయి. దీంతో లాభాల స్వీకరణకు అవకాశమున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఐపీవోకు ముందు ఇన్వెస్ట్ చేసిన సంస్థలు ఆయా షేర్లను విక్రయించేందుకు ఆసక్తి చూపేదీ లేనిదీ వేచి చూడవలసి ఉన్నట్లు మరికొందరు అభిప్రాయపడ్డారు.

జొమాటో ఎఫెక్ట్

ఈ ఏడాది జులైలో లాకిన్ గడువు ముగిసిన వెంటనే జొమాటో షేర్లు జులైలో 22 శాతం పతనంకావడం గమనార్హం. ప్రీఐపీవో ఇన్వెస్టర్లు ఉబర్, టైగర్ గ్లోబల్ తదితరాలు షేర్లను విక్రయించడం ప్రభావం చూపింది. ఒక అంచనా ప్రకారం 14 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 1,15,000 కోట్లు) విలువైన షేర్లకు లాకిన్ గడువు తీరనుంది. వీటిలో నైకా 31.9 కోట్ల షేర్లు, పాలసీ బజార్ 2.8 కోట్ల షేర్లు అందుబాటులోకి రానున్నట్లు అంచనా. దీంతో పలు కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే పేటీఎమ్ షేరు ఐపీవో ధరతో పోలిస్తే 70 శాతం పతనంకాగా.. గత నెల రోజుల్లోనే డెల్హివరీ 35 శాతం, పీబీ ఫిన్‌టెక్ 26 శాతం, ఫినో పేమెంట్స్ బ్యాంక్ 21 శాతం చొప్పున డీలా పడ్డాయి.

షేర్ల తీరు ఇదీ...

కంపెనీ పేరు	ఇష్యూ ధర	ప్రస్తుత ధర
నష్టాల్లో...		
పేటీఎమ్	2,150	652
పీబీ ఫిన్‌టెక్	980	384
ఫినో పేమెంట్స్	577	201
డెల్హివరీ	487	395
లాభాల్లో...		
గోకలర్స్	690	1,330
క్యాంపస్ యాక్టివ్	292	541
రెయిన్‌బో చిల్డ్రన్స్	542	845
శాఫైర్ ఫుడ్స్	1,180	1,447

(షేర్ల ధరలు రూ.లలో –7న ముగింపు)

అరవింద్ లాభం 79% జంప్



న్యూఢిల్లీ: వస్త్రాల తయారీ దిగ్గజం అరవింద్ లిమిటెడ్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 79 శాతం ఎగసి రూ.125 కోట్లు సాధించింది. టర్నోవర్ 2.93 శాతం అధికమై రూ.2,170 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 3.5 శాతం హెచ్చి రూ.2,072 కోట్లుగా ఉంది. వస్త్రాల ద్వారా ఆదాయం 1.88 శాతం పెరిగి రూ.1,759 కోట్లకు, అడ్వాన్స్ మెటీరియల్స్ 5 శాతం అధికమై రూ.313 కోట్లకు చేరింది. క్రితం ముగింపుతో పోలిస్తే అరవింద్ లిమిటెడ్ షేరు ధర బీఎస్‌ఈలో మంగళవారం 1.88 శాతం తగ్గి రూ.94 వద్ద స్థిరపడింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-11-2022	
విశాఖ	505–00
చిత్తూరు	533–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	504–00
విజయవాడ	504–00
రిటైల్ ధర (డజను)	78.00
8-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	485–00
వరంగల్	487–00
రిటైల్ ధర	5.45

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

డైలీ కరెంట్ అఫైర్స్
అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే కీలకమైన 'డైలీ కరెంట్ అఫైర్స్' కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

వైజాగ్ స్టీల్ ప్లాంట్, విశాఖపట్నంలో 31 పోస్టులు

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన వైజాగ్‌స్టీల్ ప్లాంట్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేటలోని జగ్గయ్యపేట లైమ్‌స్టోన్ మైన్స్, తెలంగాణ రాష్ట్రం మాధారంలోని మాధారం డోలమైట్ మైన్స్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 31
- » **పోస్టుల వివరాలు:** మైన్ ఫోర్‌మ్యాన్–02, ఆపరేటర్–కమ్–మెకానిక్–19, మైన్‌మేట్–04, బ్లాస్టర్–02, డ్రిల్ టెక్నీషియన్–04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ,ఐటీఐ, డిప్లొమా,డ్రైవింగ్ లైసెన్స్,సర్టిఫికెట్ కోర్సుతోపాటు సంబంధిత అనుభవం ఉండాలి. **వయసు:** 01.10.2022 నాటికి 35ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి రాతపరీక్ష, జాబ్ టెస్ట్/స్కిల్ టెస్ట్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.11.2022
- » **వెబ్‌సైట్:** www.vizagsteel.com

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో 50 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్.. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
- » **విభాగాలు:** టెక్నికల్ ఆఫీసర్, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్, ఫారెక్స్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్, ట్రెజరీ డీలర్ తదితరాలు.
- » **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/బీఈ/బీటెక్ /ఎంబీఏ/పీజీడీబీఏ/పీజీడీబీఎం/సీఏ/సీఎంఏ(ఐసీడబ్ల్యూఏ)/ఎంటెక్/ఎంసీఏ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 25 నుంచి 35 ఏళ్లు ఉండాలి. » **జీతం:** నెలకు రూ.48,170 నుంచి రూ.63,840 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్/ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **దరఖాస్తులకు చివరితేది:** 20.11.2022
- » **వెబ్‌సైట్:** punjabandsindbank.co.in

డీఈఆర్ఎల్, హైదరాబాద్‌లో 101 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్–డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు చెందిన డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ ల్యాబొరేటరీ.. ట్రేడ్/టెక్నీషియన్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 101
- » **ట్రేడులు:** సీవోపీఏ, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, కార్పెంటర్, షీట్ మెటల్, వెల్డర్, ఎలక్ట్రోప్లేటింగ్, ప్లాస్టింగ్ ప్రాసెసింగ్, డ్రాఫ్ట్స్‌మెన్(మెకానికల్), డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), సెక్రటేరియల్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్, డీజిల్ మెకానిక్, ఫైర్‌మ్యాన్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, బుక్ బైండింగ్, ఏఎస్‌ఎం.
- » **అర్హత:** ఐటీఐ, డిప్లొమా, ఏఎస్‌ఎం ఉత్తీర్ణులవ్వాలి. » **స్టైపెండ్:** నెలకు రూ.7700 నుంచి రూ.8050 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేయాలి.
- » **వెబ్‌సైట్:** www.apprenticeshipindia.org

ఐజీసీఏఆర్, కల్పక్కంలో 60 జేఆర్ఎఫ్‌లు

కల్పక్కంలోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్(ఐజీసీఏఆర్).. జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 60
- » **విభాగాలు:** ఫిజికల్ సైన్స్, కెమికల్ సైన్స్, ఇంజనీరింగ్ సైన్స్.
- » **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఎస్/బీఈ /బీటెక్ /బీఎస్సీ /ఎంఎస్/ఎంఎస్సీ/ఎంటెక్/ఎంఈ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్(ఆర్), రిక్రూట్‌మెంట్ సెక్షన్, ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్, కాంచీపురం జిల్లా, కల్పక్కం–603102, తమిళనాడు చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 12.11.2022
- » **వెబ్‌సైట్:** www.igcar.gov.in

మెదక్ కోర్టులో 12 ఉద్యోగాలు

తెలంగాణ రాష్ట్రం మెదక్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
- » **పోస్టుల వివరాలు:** సీనియర్ సూపరింటెండెంట్–01, సీనియర్ అసిస్టెంట్–01, స్టెనోగ్రాఫర్‌గ్రేడ్ 3–01, జూనియర్ అసిస్టెంట్‌లు–02, డ్రైవర్–01, టైపిస్ట్–02, ఆఫీస్ సబార్డినేట్–04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి/ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ నైపుణ్యాలు ఉండాలి. వయసు: 18 నుంచి 34 ఏళ్లు ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, డిస్ట్రిక్ట్ కోర్టు కాంప్లెక్స్, మెదక్–502110 చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 26.11.2022
- » **వెబ్‌సైట్:** districts.ecourts.gov.in

సర్టిఫికేషన్స్‌తో.. కెరీర్ షైన్!

- » ఐటీ రంగంలో సర్టిఫికేషన్స్‌కు పెరుగుతున్న డిమాండ్
- » క్లౌడ్ కంప్యూటింగ్, డేటాసైన్స్, ఏఐ, ఐఓటీలతో అవకాశాలు
- » సర్టిఫికేషన్స్ అందిస్తున్న పలు ఐటీ సంస్థలు



టెక్ స్కిల్స్

ఐటీ కొలువులు.. నేటి యువతలో ఎక్కువ మంది లక్ష్యం! ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు బ్రాంచ్‌తో సంబంధం లేకుండా.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో చేరేందుకు ప్రయత్నిస్తుంటారు!! జాబ్ మార్కెట్‌లో డిమాండ్ నెలకొన్న ఉద్యోగాలకు సంబంధించిన స్కిల్స్ ఉంటే.. ఐటీ కంపెనీల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. అందుకే విద్యార్థులు సంస్థల అవసరాలకు సరితూగే నైపుణ్యాల సాధన దిశగా కసరత్తు చేస్తుంటారు. ఇలాంటి వారికి చక్కటి మార్గం.. జాబ్ సర్టిఫికేషన్స్!! ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో డిమాండింగ్ స్కిల్స్, వాటిని నేర్చుకునేందుకు అందుబాటులో ఉన్న సర్టిఫికేషన్స్‌పై ప్రత్యేక కథనం...

విద్యార్థులు అకడమిక్ అర్హతలకే పరిమితం కాకుండా.. లేటెస్ట్ నైపుణ్యాలపై దృష్టి పెడుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుత డిజిటల్ యుగంలో అన్నిరకాల కార్యకలాపాలు ఆన్‌లైన్‌లో సాగుతున్నాయి. అందుకే సంస్థలు ఆయా కార్యకలాపాలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన స్పెషలైజ్డ్ స్కిల్స్, సంబంధిత సర్టిఫికేషన్స్ ఉన్న అభ్యర్థులను నియమించుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రస్తుత జాబ్ మార్కెట్ ట్రెండ్స్‌ను గమనిస్తే క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర టెక్నాలజీకి డిమాండ్ నెలకొంది.

క్లౌడ్ కంప్యూటింగ్

ఇంటర్నెట్ ఆధారంగా సాఫ్ట్‌వేర్ సేవలు అందించేందుకు వీలుకల్పిస్తున్న టెక్నాలజీ.. క్లౌడ్ కంప్యూటింగ్! ఇది ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో అనివార్యంగా మారింది. విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్ నైపుణ్యాలు పొందేందుకు క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిజైన్, క్లౌడ్ విజువలైజేషన్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఒరాకిల్, వీఎం వేర్, సీసీఎన్ఏ వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్, రెడ్‌హ్యాట్ సర్టిఫైడ్ ఇంజనీర్, వెబ్ డిజైనింగ్, బోర్లాండ్ డేటా బేస్ ఇంజన్ తదితర కోర్సులు కూడా విద్యార్థులకు ఉపయోగపడే సర్టిఫికేషన్స్‌గా చెప్పొచ్చు. వీటితో పాటు గూగుల్ సర్టిఫైడ్ ప్రొఫెషనల్ క్లౌడ్ ఆర్కిటెక్ట్; గూగుల్ సర్టిఫైడ్ ప్రొఫెషనల్ డేటా ఇంజనీర్; ఏడబ్ల్యూఎస్ సర్టిఫైడ్ సిస్టమ్స్ అండ్ ఆపరేషన్స్ అడ్మినిస్ట్రేటర్; ఏడబ్ల్యూఎస్ సర్టిఫైడ్ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్, మైక్రోసాఫ్ట్ సర్టిఫైడ్ ఎజ్యూర్ సొల్యూషన్ ఆర్కిటెక్ట్ ఎక్స్‌పర్ట్, ఎజ్యూర్ ఫండమెంటల్స్, ఎజ్యూర్ అడ్మినిస్ట్రేటర్ అసోసియేట్ వంటి సర్టిఫికేషన్లు అందుబాటులో ఉన్నాయి.

సైబర్ సెక్యూరిటీ

- సైబర్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో.. ఆన్‌లైన్ కార్యకలాపాల భద్రతను పర్యవేక్షించేందుకు సైబర్ సెక్యూరిటీ నిపుణుల సేవలు తప్పనిసరి. అందుకే సంస్థలు ఈ నైపుణ్యాలున్న వారిని నియమించుకుంటున్నాయి. దీనికి సంబంధించి ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.
- సిస్కో సీసీఎన్ఏ సెక్యూరిటీ; సీసీఎన్‌పీ సెక్యూరిటీ; సీసీఐఈ సెక్యూరిటీ, అదే విధంగా ఈసీ కౌన్సిల్ సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ కోర్సులు, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ అందించే సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

డేటా సైన్స్

- ప్రస్తుత పరిస్థితుల్లో ఎమర్జింగ్ కెరీర్‌గా నిలుస్తోంది.. డేటాసైంటిస్ట్. ఈ కొలువు సొంతం చేసుకునేందుకు కొన్ని ప్రత్యేక నైపుణ్యాలు అవసరం. వీటిని అందించేందుకు ప్రస్తుతం పలు సర్టిఫికేషన్ కోర్సులు సైతం అందుబాటులోకి వచ్చాయి. అవి..
- ఐబీఎం ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ ఇన్ డేటా ఇంజనీరింగ్ ఫండమెంటల్స్. ▪ గూగుల్ డేటా అనలిటిక్స్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్.
- కోర్స్‌ఎరా/యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్: అప్లైడ్ డేటాసైన్స్ విత్ పైథాన్ స్పెషలైజేషన్.

బ్లాక్ చైన్ సర్టిఫికేషన్

ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న మరో టెక్నాలజీ.. బ్లాక్‌చైన్. ఆన్‌లైన్‌లో జరిగే లావాదేవీలను..వికేంద్రీకృత వ్యవస్థలో పారదర్శకంగా, సురక్షితంగా నిర్వహించేందుకు వినియోగించే టెక్నాలజీగా బ్లాక్ చైన్ నిలుస్తోంది. ఈ టెక్నాలజీని సమర్థంగా వినియోగించాలన్నా.. నిర్వహించాలన్నా.. ప్రత్యేక నైపుణ్యాలు అవసరం. బ్లాక్‌చైన్ టెక్నాలజీలో పలు సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. బ్లాక్‌చైన్ కౌన్సిల్, గవర్నమెంట్ బ్లాక్‌చైన్ అసోసియేషన్, సెంట్రల్ బ్లాక్ చైన్ బాడీస్ ఆఫ్ అమెరికా, ఇతర మూక్స్ వంటివి ఆన్‌లైన్ సర్టిఫికేట్ ప్రోగ్రామ్స్ అందిస్తున్నాయి. ఎంఐటీ మీడియా ల్యాబ్ తదితర సంస్థలు కూడా బ్లాక్ చైన్ టెక్నాలజీకి సంబంధించిన నైపుణ్యాలు అందిస్తున్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసుకుంటే.. ఈ–కామర్స్ సంస్థలు మొదలు ప్రభుత్వ శాఖల వరకు ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

- ఇప్పుడు ఏ రంగంలో చూసినా అత్యంత కీలకంగా మారుతున్న టెక్నాలజీ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్(ఏఐ, ఎంఎల్). పరిమిత మానవ ప్రమేయంతో సమర్థవంతంగా,వేగంగా కార్యకలాపాలను నిర్వహించేందుకు సంస్థలు ఈ టెక్నాలజీని అనుసరిస్తున్నాయి. ఏఐ, ఎంఎల్ నైపుణ్యాలున్న వారికి కంపెనీలు నియామకాల్లో పెద్దపీట వేస్తున్నాయి. ప్రస్తుతం ఏఐ, ఎంఎల్‌కు సంబంధించి పలు షార్ట్‌టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులు కూడా అందుబాటులోకి వచ్చాయి.
- ఐబీఎం, ఇంటెల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఏఐలో ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. వీటి కాల వ్యవధి నెల రోజుల నుంచి నాలుగు నెలల వరకు ఉంటోంది. వీటిని పూర్తి చేసుకుని సంబంధిత పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. ఇండస్ట్రీ వర్గాల్లో మంచి గుర్తింపు లభిస్తోంది. దేశంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్వల్పకాలిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఐవోటీ

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్.. ఐవోటీ. కోర్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఈ టెక్నాలజీకి ప్రాధాన్యం పెరుగుతోంది. విద్యార్థులు ఆయా రంగాలకు సంబంధించి ఆధునిక నైపుణ్యాలను సముపార్జించుకుంటూనే.. ఐవోటీ స్కిల్స్‌పైనా దృష్టిసారించాలి. ప్రస్తుతం ఐఓటీకి సంబంధించి.. మైక్రోసాఫ్ట్ ఎజ్యూర్ ఐఓటీ డెవలపర్, ఐబీఎం ఐఓటీ, సీసీఎన్ఏ, వీఎంవేర్ వంటి సంస్థలు ఐఓటీలో సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకోవడం ద్వారా ఐఓటీ విభాగంలో డెవలపర్, ఆర్కిటెక్ట్, సిస్టమ్ డిజైనర్, రోబో కోఆర్డినేటర్ తదితర ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్

ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో ఎంతో డిమాండ్ నెలకొన్న మరో సర్టిఫికేషన్.. ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్. వాణిజ్య, వ్యాపార రంగాల్లోని సంస్థలు ఆన్‌లైన్ ద్వారా సేవలందిస్తూ.. దానికి సంబంధించి వినియోగదారులను ఆకర్షించేందుకు సొంతంగా వెబ్‌సైట్లను నడిపిస్తున్న విషయం తెలిసిందే. సదరు వెబ్‌సైట్‌ను యూజర్ ఫ్రెండ్లీగా రూపొందించడం, అందుకు అవసరమైన కోడింగ్, ప్రోగ్రామ్‌లు రాయడం.. అదే విధంగా బ్యాక్ ఎండ్‌లో సర్వర్ సైడ్‌లో ఎలాంటి అవాంతరాలు లేకుండా విధులు నిర్వర్తించేందుకు ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ నిపుణుల అవసరం ఉంటుంది. ఈ స్కిల్స్‌ను అందుకునేందుకు ప్రస్తుతం పలు సర్టిఫికేషన్స్ అందుబాటులోకి వచ్చాయి. యుడెమీ, కోర్స్‌ఎరా వంటి మూక్ ప్రొవైడర్స్ ద్వారా ఆన్‌లైన్ సర్టిఫికేషన్లు పూర్తి చేసుకోవచ్చు.

ఐటీ సంస్థల సర్టిఫికేషన్లు

ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలు సైతం పలు సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాయి. ఐబీఎం, ఒరాకిల్, ఇంటెల్, గూగుల్, మైక్రోసాఫ్ట్, సిస్కో వంటి సంస్థలు ప్రత్యేకంగా శిక్షణ విభాగాలను నెలకొల్పి.. ఆన్‌లైన్ విధానంలో ఈ సర్టిఫికేషన్లను అందిస్తున్నాయి.

సర్టిఫికేషన్ కోర్సుల వెబ్ పోర్టల్స్

- www.microsoftvirtualacademy.com
- https://www.cisco.com/c/en/us/training-events/training-certifications/certifications.html
- https://grow.google/intl/en_in/certificates/
- https://www.ibm.com/training/credentials
- https://www.cisco.com/c/en/us/training-events/training-certifications/certifications.html
- www.hclcdc.in
- www.education.oracle.com
- https://www.intel.com/content/www/us/en/developer/topic-technology/artificial-intelligence/training/courses.html

జపాన్ తీరంలో భారత్ నౌక ఫ్లీట్ రివ్యూ



ఆపదలో ఉన్న నౌకపై అగ్నిమాపక పరికరాలతో కాపాడే విన్యాసం చూపుతున్న భారత్ నౌకా సిబ్బంది

మల్కాపురం(విశాఖ పశ్చిమ): సముద్ర తీరం మధ్యలో నౌక అగ్నిప్రమాదానికి గురైతే ఆ నౌకలో ఉన్న వారిని ఎలా కాపాడాలి? ఆ నౌక మరింత ప్రమాదానికి గురికాకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి? అన్న అంశంపై భారత్ నౌకా సిబ్బంది చేసిన విన్యాసం ఆకట్టుకుంది. జపాన్‌లోని యోకోసుకా సముద్ర తీరం వద్ద కొద్ది రోజులుగా ఫ్లీట్ రివ్యూ జరుగుతోంది. మంగళవారం యోకోసుకా తీరం వద్ద భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ కమోర్టా నౌకా సిబ్బంది విన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో పది దేశాల నుంచి సుమారు 23 యుద్ధ నౌకలు ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి. ఈ విన్యాసాల్లో యుద్ధ విమానాలు కూడా పాల్గొని తీరంపై విన్యాసాలు చేశాయి.

అన్నదాత అడిగిందే తడవుగా

విద్యుత్ కనెక్షన్

ఈ ఏడాది ఇప్పటికే 57,420 వ్యవసాయ సర్వీసులు

- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైతే 48 గంటల్లోనే కొత్తది
- రూ.1,700 కోట్లతో వ్యవసాయ విద్యుత్ సరఫరా వ్యవస్థ ఆధునికీకరణ



సాక్షి, అమరావతి: వ్యవసాయాన్ని పండుగలా మార్చాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను వేగంగా మంజూరు చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 57,420 వ్యవసాయ సర్వీసులు అందజేశారు. డిస్కంల వారీగా పరిశీలిస్తే ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలోని చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఈ ఏడాది (2022–23 ఆర్థిక సంవత్సరం) ఇప్పటివరకూ 33,794 వ్యవసాయ విద్యుత్ సర్వీసులను అధికారులు అందజేశారు. మరో 33,099 సర్వీసులకు ఈ నెలాఖరుకల్లా కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు జిల్లాల్లో ఈ ఏడాది 4,525 సర్వీసులను రైతులకు అందించారు. 3,687 సర్వీసులను ఈ నెలలో మంజూరు చేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్, ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు వెల్లడించారు. ఇక ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో ఇప్పటివరకూ 19,101 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను రైతులకు మంజూరు చేశారు. విజయవాడ సర్కిల్ పరిధిలో 6,411, గుంటూరు సర్కిల్ పరిధిలో 2,064, ఒంగోలు సర్కిల్ పరిధిలో 11,479, సీఆర్‌డీఏ పరిధిలో 88 చొప్పున మరో 20,042 కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు మౌలిక సదుపాయాల పనులు జరుగుతున్నాయని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి తెలిపారు.

రూ.1,700 కోట్ల ఖర్చు

వచ్చే ఏడాది నుంచి వ్యవసాయానికి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ) ద్వారా తీసుకునే సౌర విద్యుత్‌ను 9 గంటలపాటు పగటిపూటే పంపిణీ చేయనున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుత్ వ్యవస్థను ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.1,700 కోట్లను ఖర్చు చేసింది. అంతేకాకుండా హై–ఓల్టేజి డిస్ట్రిబ్యూషన్ సిస్టం (హెచ్‌వీడీఎస్) పథకం ద్వారా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేయనున్నారు. బోరు దగ్గరకు 180 మీటర్ల వరకు ఉచితంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ మొత్తం ప్రక్రియకు ఒక్కో వ్యవసాయ సర్వీసుకు అయ్యే దాదాపు రూ.1.20 లక్షల ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఏటా సగటున 45,098 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వీటిని బాగుచేయడం కోసం రూ.102 కోట్లు ఖర్చవుతోంది. అయినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింటే 48 గంటల్లోనే బాగు చేయడం లేదా కొత్తది ఇవ్వడం జరగాలని ఇటీవల సీఎం వైఎస్ జగన్ ఆదేశించడంతో ఆ మేరకు అవసరమైన మెటీరియల్ కూడా ఆయా జిల్లాల స్టోర్లలో అధికారులు సిద్ధంగా ఉంచారు.

'అనంత'లో విద్యుత్ ప్రమాదాలకు అడ్డుకట్ట

- సబ్‌స్టేషన్లు, లైన్లలో లోపాలను యుద్ధప్రాతిపదికన సరిదిద్దేందుకు చర్యలు
- 'సాక్షి'తో ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



సాక్షి, అమరావతి/తిరుపతి రూరల్: విద్యుత్ ప్రమాదాలకు అవకాశమున్న ప్రాంతాలను, బలహీనంగా ఉన్న లైన్లను గుర్తించి రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీ ఎస్పీడీసీఎల్) రంగంలోకి దిగింది. ముఖ్యంగా అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు సమీపంలో విద్యుత్ ప్రమాదం నేపథ్యంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు సంస్థ సీఎండీ కె.సంతోషరావు మంగళవారం తెలిపారు. అనంతపురం సర్కిల్ పరిధిలోని సబ్‌స్టేషన్లు, లైన్లను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రమాదం జరిగేందుకు వీలున్న లైన్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ పనులు చేపట్టేందుకు వీలుగా సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి సర్కిల్ ఇన్‌చార్జ్, నోడల్ ఆఫీసర్ కె.గురవయ్య(చీఫ్ జనరల్ మేనేజర్/ఓఎం) నేతృత్వంలో అనంతపురం టౌన్, అనంతపురం రూరల్, గుత్తి, కళ్యాణదుర్గం, కదిరి, హిందూపురం డివిజన్లకు బాధ్యులుగా జి.బాలకృష్ణారెడ్డి (జనరల్ మేనేజర్/ఎనర్జీ ఆడిట్), కె.ఆదిశేషయ్య(సూపరింటెండింగ్ ఇంజినీర్/అసెస్మెంట్, ఎంక్వైరీస్), సీహెచ్.రామచంద్రారావు (జనరల్ మేనేజర్/కమర్షియల్), జి.సత్యనారాయణ(జనరల్ మేనేజర్/ప్రాజెక్ట్స్), జె.రమణాదేవి (సూపరింటెండింగ్ ఇంజినీర్/డీపీఈ), పి.మురళి (జనరల్ మేనేజర్/ప్లానింగ్)లను నియమిస్తూ ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. వీరికి సహాయకులుగా నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు డీపీఈ డివిజన్ల అధికారులు విధులు నిర్వహిస్తారని, సర్కిల్ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో లోపాలను గుర్తించి, సరిదిద్దేందుకు వీలుగా అనంతపురం టౌన్, అనంతపురం రూరల్, గుత్తి, కళ్యాణ దుర్గం, కదిరి, హిందూపురం డివిజన్లకు మీటర్స్, ప్రొటెక్షన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను కేటాయించినట్లు వివరించారు. అధికారులంతా వారికి కేటాయించిన విధులకు తక్షణమే హాజరు కావాలని, ఈ పనులు పూర్తయ్యేవరకు వారంతా తమకు కేటాయించిన ప్రాంతంలోనే బస చేయాలని ఆదేశాలిచ్చామన్నారు.

'అగ్నిలెట్ ఇంజన్' పరీక్ష విజయవంతం

ఇండియన్ స్పేస్ స్టార్టప్ అభివృద్ధి చేసిన రాకెట్ ఇంజన్ ప్రయోగం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కేరళలోని తిరువనంతపురం తుంబా ఈక్విటోరియల్ స్పేస్ స్టేషన్‌లో ఇండియన్ స్పేస్ స్టార్టప్ అభివృద్ధి చేసిన 'అగ్నిలెట్ ఇంజన్'కు (రాకెట్ ఇంజన్) హాట్ టెస్టింగ్ పరీక్షను ఈ నెల 4న ప్రయోగాత్మకంగా నిర్వహించి విజయం సాధించామని ఇస్రో మంగళవారం ప్రకటించింది. 'మిస్టర్ అగ్నికుల్ కాస్మోస్ ప్రైవేట్ లిమిటెడ్' కోసం విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ అగ్నిలెట్ ఇంజన్ సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు 15 సెకండ్లపాటు హాట్ టెస్టింగ్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఇండియన్ స్పేస్ స్టార్టప్‌లకు ఇన్‌స్పేస్ ద్వారా ఇస్రో సౌకర్యాలను ఉపయోగించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. అగ్నిలెట్ ఇంజన్ అనేది లిక్విడ్ ఆక్సిజన్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)ని ప్రొపెల్లెంట్లుగా ఉపయోగించి 10.9 బార్ (ఏ) చాంబర్ ప్రెషర్‌లో పనిచేసే రీజెనరేటివ్‌గా కూల్డ్–1.4 కేఎన్ సెమీ క్రయోజనిక్ ఇంజన్. భవిష్యత్‌లో ఇస్రో వాణిజ్యపరమైన ప్రయోగాల సంఖ్యను పెంచుకునేందుకు కొత్త ఇంజన్‌లకు పరిశోధనలు నిర్వహించి.. ప్రయోగాత్మక పరీక్షలు చేసి నిర్ధారించుకునే క్రమంలో కూల్డ్–1.4 కేఎన్ సెమీ క్రయోజనిక్ ఇంజన్‌ను ప్రయోగించామని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు.

రొయ్య రైతుకు బాసట

అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన రొయ్యల ధరలు

- రాష్ట్రంలో రొయ్య రైతుకు అండగా నిలవాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు
- రంగంలోకి దిగిన ఆక్వా సాధికారత కమిటీ
- నిత్యం ధరలపై సమీక్ష.. ధరలు నిలకడగా ఉండేలా చర్యలు
- సమీపంలోని ప్రాసెసింగ్ కంపెనీలతో కొనిపిస్తున్న కమిటీ
- ప్రస్తుతం 100 కౌంట్ రూ.190కి కొనుగోలు
- నిలకడగా మిగిలిన కౌంట్ ధరలు
- త్వరలోనే చైనా మార్కెట్‌కు ఎగుమతులు
- 100 కౌంట్ రూ. 240కి పెరుగుతుందని అంచనా

సాక్షి, అమరావతి: రొయ్య రైతుకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో రొయ్య ధరలు తగ్గుతుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆక్వా రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతుల వద్ద ఉన్న రొయ్యలు పూర్తి స్థాయిలో అమ్ముడయ్యే వరకు వారికి అండగా నిలవాలని స్పష్టంగా చెప్పారు. దీంతో సీనియర్ మంత్రుల సారథ్యంలో ఏర్పాటు చేసిన ఆక్వా సాధికారత కమిటీ రంగంలోకి దిగింది. కమిటీ సభ్యులైన మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, కమిషనర్ కన్నబాబు ప్రతి రోజు మార్కెట్‌ను నిశితంగా పరిశీలిస్తున్నారు. రొయ్య ధరలను సమీక్షించి, ఆక్వా రైతులకు నష్టం కలగకుండా కమిటీ చర్యలు చేపడుతోంది. సమీపంలోని ప్రాసెస్ కంపెనీల ద్వారా రొయ్యలు కొనుగోలు చేయిస్తోంది. రవాణాకు అవసరమైన వాహనాలను సమకూరుస్తూ క్రయవిక్రయాలను దగ్గరుండి పర్యవేక్షిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌ను బూచిగా చూపి ధరలు తగ్గించే ప్రాసెసింగ్ యూనిట్లపై కఠిన చర్యలకు సైతం కమిటీ సిద్ధమవుతోంది. అవసరమైతే కంపెనీల్లో విస్తృత తనిఖీలు చేపట్టాలని యోచిస్తోంది. త్వరలో మరోసారి రాష్ట్రస్థాయిలో ఆక్వా రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఫీడ్, సీడ్ కంపెనీలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది.



నిలకడగా కౌంట్ ధరలు

రాష్ట్రంలో ప్రస్తుతం వంద కౌంట్ రొయ్యలు రూ.190కు, 30 కౌంట్ రొయ్యలను రూ. 370కి తక్కువ కాకుండా కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన కౌంట్ ధరలూ నిలకడగానే ఉన్నాయి. 100 కౌంట్ రొయ్యలను కనీసం రూ.240కు కొనాలని ప్రాసెసింగ్ కంపెనీలకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే ప్రస్తుతం మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో 100 కౌంట్ రూ.220కు తక్కువ కాకుండా కొనాలని కంపెనీలను ఆదేశించింది. అమెరికా, చైనా, ఈక్విడార్ దేశాల నుంచి ఆర్డర్లు ఊపందుకోగానే ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే కొంటామని కంపెనీలు చెబుతున్నాయి. వచ్చేవారంలో చైనా మార్కెట్ ఓపెన్ కానుండడంతో 100 కౌంట్ ధరలు రూ.240కు పైగా పెరిగే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

విపక్షాలది దుష్ప్రచారం

రొయ్య రైతులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదంటూ విపక్షాలు చేస్తున్నది దుష్ప్రచారం. రాష్ట్రంలో ఎక్కడా వంద కౌంట్ రూ.190కు తగ్గలేదు. ప్రతిరోజూ మార్కెట్‌ను సమీక్షిస్తూ కౌంట్ ధర రూ.240కి పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కొనాలని ప్రాసెసింగ్ కంపెనీలను ఆదేశించాం. అవసరమైతే కంపెనీలపై చర్యలకు సైతం ప్రభుత్వం వెనుకాడదు. ఆ అధికారాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాధికారత కమిటీకి ఇచ్చారు.

–వడ్డి రఘురాం, వైస్ చైర్మన్,అప్సడా

ఆందోళన వద్దు

రొయ్య రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. వారం పదిరోజుల్లో చైనా మార్కెట్ ఓపెన్ అవుతుంది. ఎగుమతులు పుంజుకుంటాయి. వందకౌంట్‌కు రూ. 240 కుపైగా ధర వస్తుంది.

– ఐపీఆర్ మోహనరాజు, జాతీయ రొయ్య రైతుల సంఘం అధ్యక్షుడు

సౌదీ జాతీయ క్రీడల్లో మెరిసిన మెహద్

బ్యాడ్మింటన్ పోటీల్లో నెల్లూరు జిల్లా వాసికి స్వర్ణ పతకం



బంగారు పతకంతో షేక్ మెహద్

అల్లూరు: సౌదీ అరేబియా జాతీయ క్రీడల్లో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అల్లూరు వాసి సత్తా చాటాడు. ఇటీవల జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి, రూ.2 కోట్ల ప్రైజ్ మనీని సొంతం చేసుకున్నాడు. ఆ దేశ క్రీడారంగం చరిత్రలో స్వర్ణ పతకం సాధించిన తొలి తెలుగువాడిగా అల్లూరు కోనేటిమిట్టకు చెందిన షేక్ షాహీద్, షాకీరా బేగం కుమారుడు మెహద్ (17) అరుదైన రికార్డు సృష్టించాడు. సౌదీ అరేబియా ఒలింపిక్ కమిటీ ఉపాధ్యక్షుడు, సౌదీ క్రీడల డైరెక్టర్ ప్రిన్స్ అబ్దుల్ అజీజ్ చేతుల మీదుగా స్వర్ణ పతకాన్ని అందుకున్నాడు. షేక్ మెహద్ తండ్రి సివిల్ ఇంజనీర్‌గా రియాద్ (సౌదీ)లో పనిచేస్తున్నాడు. తల్లి షాకీరా బేగం హైదరాబాద్‌లో ఉంటున్నారు. మెహద్ రియాద్ నగరంలో తండ్రితో ఉంటూ పదకొండో తరగతి చదువుతున్నాడు. మెహద్ స్పోర్ట్స్ కోటాలో హైదరాబాద్‌కు వచ్చి గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. మెహద్ స్వర్ణ పతకం సాధించడంపై అతని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.